www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 15-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 346

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి మ.2.34 తదుపరి విదియ; నక్షత్రం: ఉత్తర ఉ.8.54 తదుపరి హస్త; వర్జ్యం: సా.6.17-8.05; అమృతఘడియలు: తె.5.02 మొ.; దుర్ముహూర్తం: ఉ.6.26-8.02; రాహుకాలం ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.26; సూర్యాస్తమయం: 6.21

వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రైతువేదికల నిర్వహణకు నిధులేవి?

- 30 నెలలుగా విడుదల చేయని ప్రభుత్వం
- కనీస సదుపాయాలు లేక రైతులకు ఇబ్బందులు
- కొన్ని చోట్ల సొంతడబ్బుతో నిర్వహిస్తున్న అధికార్లు
- రాష్ట్రవ్యాప్తంగా 2,600 రైతువేదికలు
- పేరుకుపోయిన కరెంటు బిల్లుల బకాయిలు



3



ఆలోచించండి... ఓ అమ్మానాన్న?

పిల్లలేం చేశారు పాపం!

- కన్నబిడ్డల్ని చంపి తల్లిదండ్రులు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు
- తాము చనిపోతే వాళ్లేమవుతారోనని భయం
- కన్నవారి మానసిక రుగ్మతలే చిన్నారులకు శాపమవుతున్న వైనం
- సరైన సమయంలో గుర్తిస్తే ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయొచ్చు: మానసిక వైద్యులు

13

నిద్ర లేమితో గుండె జబ్బులు!

- అల్జీమర్స్ సహా అనేక అనారోగ్య సమస్యలు
- గురక.. నిద్రలేమికి సంకేతం
- అరెథ్మియా, హార్ట్ ఫెయిల్యూర్ రోగుల్లో 30-60% మందికి మంచి నిద్రతో సత్ఫలితాలు
- నిద్ర ఏకధాటిగా 6-8 గంటలు ఉండాలి
- మధ్యాహ్నం 30 నిమిషాల కునుకుతో మేలు
- 'స్మార్ట్' పరికరాలతో సమస్యలే ఎక్కువ!
- 'వరల్డ్ స్లీప్ డే' సందర్భంగా ఏఐజీ హాస్పిటల్స్ సదస్సులో వైద్యుల వెల్లడి



హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మనిషికి నిద్ర అనేది అత్యవసరం. కంటి నిండా నిద్ర పోతే కలిగే మేలు ఎంతో.. కలత నిద్రతో జరిగే కీడూ అంతే! చాలామంది నిద్రాహారాలు మానేసి కష్టపడతున్నామని చెబుతుంటారు. కానీ, తగినంతగా నిద్రపోకపోతే అనేక అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకున్నట్లేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. 'ప్రపంచ నిద్ర దినోత్సవం (వరల్డ్ స్లీప్ డే)' సందర్భంగా శుక్రవారం గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్స్‌లో 'నిద్ర సమస్యలను అధిగమించడం' పేరిట ఓ చర్చ నిర్వహించారు. ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి సంధానకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిద్ర మన జీవితంలో అతి ముఖ్యమైన అంశాల్లో ఒకటన్నారు. జీవితంలో మూడో వంతు సమయం నిద్రలోనే గడుపుతుంటామని, దురదృష్టవశాత్తు దీని గురించి చాలామందికి అవగాహన తక్కువగా ఉంటుందని చెప్పారు. నిద్రకు, గుండెకు మధ్య ఉన్న సంబంధం గురించి డాక్టర్ నరసింహన్ వివరించారు. ఎన్నో దశాబ్దాలుగా కార్డియో వాస్క్యులర్ వ్యాధుల

మిగతా 10వ పేజీలో...



2

పెళ్లితో మగవాళ్లు

లావెక్కుతారు!

- 'సింగిల్స్'తో పోలిస్తే వివాహమైన పురుషుల్లో 62% అధిక బరువుకు చాన్స్
- 3 రెట్లు ఎక్కువగా ఊబకాయం ప్రమాదం
- ఇది మహిళల్లో 39 శాతం మాత్రమే..
- వార్సా పరిశోధకుల అధ్యయనం వెల్లడి
- పెరిగే ఆహార పరిమాణం, శారీరక శ్రమ లేకపోవడమే కారణమంటున్న నిపుణులు

గ్రూప్-3 టాపర్లూ

పురుషులే..

టాప్-10లో ర్యాంకుల్లో 9 మంది వారే

- ఫలితాలు విడుదల చేసిన టీజీపీఎస్సీ.. 2,49,557 మంది జనరల్ ర్యాంకుల ప్రకటన
- అత్యధిక మార్కులు 339 (75.38%)తో ప్రథమ ర్యాంకు సాధించిన అర్జున్‌రెడ్డి
- ఓఎంఆర్ షీట్లు నెల రోజులు ఆన్‌లైన్‌లో.. పారదర్శకంగా ప్రక్రియ: బుర్రా వెంకటేశం

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పోటీ పరీక్షల ఫలితాల్లో పురుషుల హవా కొనసాగుతోంది. గ్రూప్-3 పరీక్ష ఫలితాల్లోనూ వారే టాపర్లుగా నిలిచారు. గతేడాది నవంబరు 17, 18వ తేదీల్లో నిర్వహించిన గ్రూప్-3 ఫలితాలను టీజీపీఎస్సీ శుక్రవారం ప్రకటించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో మొత్తం 1388 పోస్టుల భర్తీకి సంబంధించి నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 5,36,400 మంది దరఖాస్తు చేసుకోగా 2,67,921 మంది అన్ని (3) పేపర్లకు హాజరయ్యారు. వీరిలో 18,364 మందిని ఇన్‌వ్యాలీడ్‌గా ప్రకటించారు. మిగతా 2,49,557 మంది జనరల్ ర్యాంకింగ్ వివరాలను కమిషన్ విడుదల చేసింది. అలాగే టాప్-10 జనరల్ ర్యాంకులు, టాప్-10 మహిళా ర్యాంకులను విడుదల చేశారు. టాప్-10 జనరల్ ర్యాంకింగ్స్‌లో తొమ్మిది మంది పురుషులుండగా, ఒక్కరే మహిళ ఉన్నారు. మొత్తం 450 మార్కులకుగాను



తల్లిదండ్రులు నరేందర్‌రెడ్డి, శోభతో అర్జున్‌రెడ్డి

339.239 (75.38 శాతం) మార్కులు సాధించి కుకునూరి అర్జున్‌రెడ్డి టాపర్‌గా నిలిచారు. గత జనవరిలో ఈ పరీక్ష ప్రిలిమినరీ కీ విడుదల చేయగా.. అందులో అభ్యర్థుల నుంచి స్వీకరించిన అభ్యంతరాలపై నిపుణుల అభిప్రాయాలు సేకరించామని టీజీపీఎస్సీ తెలిపింది. జనరల్ ర్యాంకింగ్స్ నుంచి అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలనకు పిలుస్తామని కమిషన్ కార్యదర్శి పేర్కొన్నారు. కాగా, గ్రూప్-3 పరీక్ష, సమాధాన పత్రాల పరిశీలన, ఫలితాల వెల్లడిని అత్యంత పారదర్శకంగా నిర్వహించామని

మిగతా 9 వ పేజీలో...



మత్తు తగ్గింది

- రాష్ట్రంలో తగ్గిన మద్యం, బీర్ల విక్రయాలు
- ఇందుకు పలు కారణాలు..
- పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ సరఫరా
- ఏపీలో అందుబాటులోకి బ్రాండెడ్ మద్యం
- కల్తీ కల్లు, నాటు సారాపై నియంత్రణ కరవు
- ఎంఆర్‌పీ కన్నా అధిక ధరకు అమ్మకం


3 నెలల్లో తగ్గిన 1104 కోట్ల విక్రయాలు!

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు నెలలుగా మద్యం విక్రయాలు 'మత్తు'గా సాగుతున్నాయి. అమ్మకాలు, ఆదాయం రెండూ తగ్గిపోయాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో అమ్మకాలు గతేడాది ఇవే నెలలతో పోలిస్తే తగ్గాయి. అలాగే 2024 డిసెంబరు అమ్మకాలు కూడా 2023 డిసెంబరుతో పోలిస్తే క్షీణించాయి. దీంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఏటా మద్యం, బీర్ల అమ్మకాలు పెరుగుతుండగా.. ఈ సారి మాత్రం మూడు నెలల్లోనే రూ.1104 కోట్ల విలువైన అమ్మకాలు తగ్గాయి. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పేరున్న సంస్థల మద్యం విక్రయించేవారు కాదు. అక్కడ బ్రాండెడ్ మద్యం దొరక్కపోవడంతో సరిహద్దు జిల్లాలైన నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్‌ల నుంచి ఏపీ వాసులు మద్యాన్ని కొనుగోలు చేసేవారు. దీంతో తెలంగాణలో మద్యం విక్రయాలు

మిగతా 9వ పేజీలో...

15 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ అప్పు

1,50,000 కోట్లు?



- తొలి ఏడాది పాలనలో తీసుకున్నది లక్షా 24 వేల కోట్లు
- స్వయంగా శాసనమండలికి వెల్లడించిన ప్రభుత్వం
- గత డిసెంబరులో తీసుకున్నది రూ.13,909 కోట్లు
- ఈ ఏడాది 70 రోజుల్లో 14,800 కోట్ల రుణాలు
- ఇవన్నీ కలిపితే లక్షన్నర కోట్లు దాటే అవకాశం
- బీఆర్ఎస్ హయాంలో అప్పు రూ.6,71,757 కోట్లు
- రెండూ కలిస్తే రుణభారం రూ.8.24 లక్షల కోట్లు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం తెస్తున్న అప్పులపై వాడివేడిగా చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. గత సమావేశాల్లో ఇదే అంశంపై ప్రభుత్వం మీద బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విరుచుకుపడగా, డిప్యూటీ సీఎం భట్టి అంతే ధాటిగా ఎదురుదాడి చేసి, ప్రభుత్వ వాదన వినిపించారు. ఈసారి కూడా అప్పులపైనే విపక్షాలు ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే గత బుధవారం సీఎస్పీ సమావేశంలో కూడా అప్పులపై శ్వేతపత్రం ఇద్దామా? అని అధికార పార్టీ నేతలు చర్చించారు. ఇలాంటి తరుణంలో తమ ఏడాది పాలనలో ఏకంగా లక్షా 24 వేల కోట్ల రూపాయల అప్పు చేశామని ప్రభుత్వం స్వయంగా అంగీకరించింది. ఈ మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అడిగిన ప్రశ్నకు శాసనమండలిలో లిఖిత పూర్వక సమాధానం ఇచ్చింది. 1.24 లక్షల కోట్లు 2024 నవంబరు 30 వరకు చేసిన అప్పు. ఆ తర్వాత డిసెంబరులో 13,909 కోట్లు, 2025 సంవత్సరంలో జనవరి 1 నుంచి మార్చి 11 వరకు చేసిన మరో 14,800 కోట్ల అప్పు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నట్లు రిజర్వు బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. అంటే, రాష్ట్ర ప్రభుత్వ మార్చి వరకు గత 15 నెలల్లో తీసుకున్న అప్పు లక్షా 52 వేల కోట్లు దాటినట్లే భావించాల్సి వస్తోంది. ఇందులో ఎఫ్ఆర్‌బీఎం పరిమితులకు లోబడి తెచ్చిన బడ్జెట్ అప్పులతో పాటు కార్పొరేషన్ల పేర గ్యారెంటీ అప్పులు, గ్యారెంటీలు లేకుండా తెచ్చిన అప్పులు ఉన్నాయి. గత శాసనసభ సమావేశాల్లో ఈ అంశం చర్చకు వచ్చినపుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.27 లక్షల కోట్ల అప్పు తెచ్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. తెచ్చిన అప్పులను బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పాత అప్పుల కిస్తీలు, వడ్డీలకే చెల్లించాల్సి వస్తోందని, వాటికి తోడు కాంట్రాక్టర్ల పాత బిల్లులను చెల్లించాల్సి వస్తోందని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క బదులిచ్చారు. 2023 డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే అంతకుముందు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టింది. అప్పటివరకు



మిగతా 13వ పేజీలో...



ప్రాథమిక ఆస్పత్రుల్లో.. డిజిటల్

హెల్త్ రికార్డ్

- ఏప్రిల్ నుంచి రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో
- దశల వారీగా అన్ని ఆస్పత్రుల్లో అమలు
- ప్రత్యేక ఐడీ సంఖ్యతో 'అబా' కార్డు జారీ
- దాంతో ఏ ఆస్పత్రిలోనైనా రోగి వివరాలు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డుల అంశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏప్రిల్ మొదటి వారం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ)కు వచ్చే రోగుల వివరాలను ఆన్‌లైన్ చేయడం ప్రారంభించనున్నారు. తొలుత ప్రజారోగ్య సంచాలకుల పరిధిలోని పీహెచ్‌సీల్లో, ఆ తర్వాత తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో, అనంతరం వైద్యవిద్య సంచాలకుల పరిధిలోని బోధనాస్పత్రుల్లో దశలవారీగా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ డిజిటల్ హెల్త్ రికార్డు కోసం ప్రతీ పీహెచ్‌సీలో ఓ కంప్యూటర్, ప్రింటర్, ఇంటర్నెట్ కనెక్షన్‌తో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను అందుబాటులో

మిగతా 13వ పేజీలో...

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించండి!

20 లక్షల దరఖాస్తుదారులకు అధికార్ల లేఖలు 12

అటవీ అనుమతుల్లో

ఆలస్యం!

- 13 జాతీయ రహదార్ల పనులకు అంతరాయం
- 243 హెకార్ల అటవీ భూముల గుండా రోడ్లు
- వివిధ దశల్లో అనుమతులకు ఎదురుచూపులు
- అవన్నీ వస్తేనే రహదారుల పనులు వేగిరం
- ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి కేటాయించిన ప్రత్యామ్నాయ భూములకు 6 కోట్ల బకాయిలు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అటవీ అనుమతుల్లో జాప్యంతో రాష్ట్రంలో దాదాపు 13 జాతీయ రహదారుల పనులకు అంతరాయం కలుగుతోంది. ఒకదానికొకటి అనుసంధానమై ఉండడంతో దశల వారీగా రావాల్సిన అనుమతుల్లో జాప్యం జరుగుతోంది. ఫలితంగా రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నాయి. అటవీ, జాతీయ వన్యప్రాణుల బోర్డు, పర్యావరణానికి సంబంధించి రావాల్సిన అనుమతుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో చర్చలు జరిపి త్వరితగతిన అనుమతులు తీసుకురావాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అయినా ఆశించిన స్థాయిలో అనుమతులు రావడంలేదు. అనుమతులు వస్తాయన్న ఉద్దేశంతో ఒకటి, రెండు చోట్ల రహదారుల పనులు మొదలుపెట్టడంతో నిబంధనలను ఉల్లంఘించారంటూ కేంద్ర అధికారులు లేఖలు పంపారు. తెలంగాణకు కేంద్రం మంజూరు చేసిన పలు జాతీయ రహదారులు అటవీ భూములు, వన్య ప్రాణులున్న ప్రాంతాల పరిధిలో నుంచి వెళ్తున్నాయి. వీటన్నింటికీ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ, జాతీయ వన్యప్రాణుల బోర్డుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో

మిగతా 9వ పేజీలో...



హైదరాబాద్‌లోని ఇఫ్లూ చౌరస్తాలో ధర్నా చేస్తోన్న బీఆర్ఎస్‌వీ నాయకులు

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై

బీఆర్ఎస్ నిరసనలు

- మండల కేంద్రాలు, గ్రామాల్లో కార్యకర్తల ధర్నాలు
- పాలన చేతకాక ప్రతిపక్షం గొంతునొక్కాలని కుట్రలు
- రేవంత్‌కు మూడు చెరువుల నీళ్లు తాగిపిస్తాం: కేటీఆర్
- ప్రజలకు ఏ ఆపదొచ్చినా అండగా బీఆర్ఎస్: హరీశ్

హైదరాబాద్/హైదరాబాద్‌సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల నుంచి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మండల కేంద్రాలు, గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తలు శుక్రవారం ధర్నాలు నిర్వహించారు. జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికమని నినదించారు. ఈ సందర్భంగా నిరసనలు చేపట్టిన బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలు చూపిన సమరోత్సాహం.. రాష్ట్ర నాయకత్వానికి కొండంత స్ఫూర్తినిచ్చిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ కార్యకర్తలు పిడికిలి బిగించిన తీరు అభినందనీయమన్నారు. పరిపాలన చేతకాక అసెంబ్లీలో బీఆర్ఎస్ గొంతు నొక్కాలని చూస్తున్న సీఎంకు ప్రజలపక్షాన తప్పకుండా మూడు చెరువుల నీళ్లు తాపిస్తామని అన్నారు. ఆరు గ్యారంటీలతో ఆగం చేసి, 420 హామీలతో

మిగతా 12వ పేజీలో...




స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

హోలీ వేడుకల్లో గంజాయి కుల్ఫీ, బర్ఫీ

- గంజాయితో చేసిన 100 కుల్ఫీలు, 72 బర్ఫీలు ధూల్‌పేటలో స్వాధీనం
- ముత్తంగిలో 84 గంజాయి చాక్లెట్లు పట్టివేత

3

భూమిపై ఏలియన్స్!



- 1940ల నుంచి అంతరిక్షనౌక వచ్చి వెళ్తోంది
- మన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిని గ్రహాంతర వాసులు పరిశీలిస్తున్నారు
- వెల్లడించిన అమెరికా నిఘా అధికారులు

2

గ్రీన్‌కార్డుతో శాశ్వత నివాసం లభించదు

- ఆ విషయాన్ని అమెరికన్లమైన మేం నిర్ణయిస్తాం
- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

2



మోదీ, ట్రంప్‌నకు పుతిన్ కృతజ్ఞతలు

▸ ఉక్రెయిన్-రష్యా సంక్షోభ పరిష్కారంలో చొరవపై హర్షం



మాస్కో, మార్చి14: ఉక్రెయిన్-రష్యా సంక్షోభ పరిష్కారంలో చొరవ తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ధన్యవాదాలు తెలిపారు. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా అధ్యక్షులు కూడా ఈ సంక్షోభ పరిష్కారానికి సమయం ఇచ్చారని గుర్తు చేస్తూ వారికి కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఇది యుద్ధాల సమయం కాదని, భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని పుతిన్ సమక్షంలోనే మోదీ గతంలో చెప్పారు. మరోవైపు ట్రంప్ అధికారంలోకి రాగానే ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని విరమింపచేసేందుకు తీవ్రంగా కృషి చేశారు. 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించారు. దీనికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెనువెంటనే సమ్మతి తెలపగా పుతిన్ ఎట్టకేలకూ అంగీకారం తెలిపారు. అయితే కాల్పుల ఒప్పందం శాశ్వత శాంతికి దారి తీయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. మరోవైపు పుతిన్‌తో చర్చలు ఫలప్రదంగా జరిగాయని ట్రంప్ చెప్పారు. చర్చల సందర్భంగా కుర్స్క్ ప్రాంతంలో రష్యా సైన్యం చుట్టుముట్టిన వేలాది మంది ఉక్రెయిన్ సైనికుల ప్రాణాలు కాపాడాలని పుతిన్‌ను గట్టిగా కోరానన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పుతిన్ ఉక్రెయిన్ సైనికులను లొంగిపోవాలని కోరారు. ట్రంప్ విజ్ఞప్తిని సానుభూతితో అర్థం చేసుకున్నామంటూ టెలివిజన్ సందేశంలో తెలిపారు. ఉక్రెయిన్ సైనికులు ఆయుధాలు అప్పగించి లొంగిపోతే వారి ప్రాణాలకు హామీ ఇస్తామన్నారు. ఉక్రెయిన్ సైనికులతో గౌరవంగా వ్యవహరిస్తామని పుతిన్ హామీ ఇచ్చారు.

అర్మేనియా, అజర్‌బైజాన్ మధ్య శాంతి ఒప్పందం

టిబిలిసీ/బాకూ, మార్చి 14: నాలుగు దశాబ్దాల వైరానికి సోవియట్ పూర్వ దేశాలు ఆర్మేనియా, అజర్‌బైజన్ తెర దించేందుకు సిద్ధమవుతున్నాయి. ఎట్టకేలకు శాంతి ఒప్పంద ముసాయిదాను ఇరుదేశాలు ఆమోదించాయి. ఇక ఆ పత్రాలపై సంతకాలు చేయడమే తరువాయి. అర్మేనియా, అజర్‌బైజన్ 1980ల నుంచి ఎడతెరిపి లేకుండా తలపడుతున్నాయి. నగోర్నో- కరాబఖ్ ప్రాంతం అజర్‌బైజన్ పరిధిలో ఉన్నా సంస్కృతిపరంగా ఆర్మేనియాకు దగ్గరగా ఉంటుంది. ఈ ప్రాంతం ఆర్మేనియా సాయంతో అజర్‌బైజన్ నుంచి విడిపోవడంతో ఈ రెండు దేశాల మధ్య ఘర్షణలు భగ్గుమన్నాయి. ఇటీవల ఆ భూభాగాన్ని బలప్రయోగం ద్వారా అజర్‌బైజన్ తిరిగి తనలో విలీనం చేసుకుంది. శాంతి ఒప్పందంపై ఒకసారి సంతకాలు పూర్తయితే ఇరుదేశాల మధ్య తిరిగి రాకపోకలు మొదలవుతాయని ఆర్మేనియా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఒప్పంద పత్రం ముసాయిదాకు తమ వైపు నుంచి సమ్మతి తెలిపామని వివరించింది. శాంతి ప్రక్రియ పట్ల సంతృప్తితో ఉన్నామని అజర్‌బైజన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

రష్యా ఆయిల్‌కు చైనా కంపెనీలు దూరం!

న్యూఢిల్లీ, మార్చి 14: రష్యాపై అగ్రరాజ్యం అమెరికా ఇటీవల ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఆ దేశం నుంచి చమురును కొనుగోలు చేసే విషయంలో చైనా చమురు కంపెనీలు పునరాలోచనలో పడుతున్నాయి. అయితే ఈ నెలలో రెండు చైనా కంపెనీలు ముడిచమురు కొనుగోళ్లను నిలిపివేయగా మరో రెండు కంపెనీలు తమ కొనుగోలు పరిమాణాన్ని తగ్గించుకున్నట్లు ట్రేడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. మాస్కో చమురు రాబడిని దెబ్బతీసే చర్యల్లో భాగంగా రష్యా చమురు ఉత్పత్తిదారులు, బీమా సంస్థలు, ఓడలపై గత జనవరిలో అమెరికా ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో అతిపెద్ద కొనుగోలు దేశాలైన భారత్, చైనాలకు రష్యా ఆయిల్ సరఫరాలు తగ్గుముఖం పట్టాయి.

గాజాలో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడింది

▸ ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి నివేదిక

జెనీవా, మార్చి14: హమాస్‌పై ప్రతీకార దాడుల్లో భాగంగా గాజాలో పాలస్తీనా మహిళలపై ఇజ్రాయెల్ బలగాలు అత్యాచారం, లైంగిక హింసకు పాల్పడినట్లు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి నివేదికలో పేర్కొంది. క్రమపద్ధతిలో ఓ జాతిని అంతమొందించేందుకు ఇజ్రాయెల్ యత్నించిందని ఆరోపించింది. పౌరప్రాంతాలపై భారీ పేలుడు పదార్థాల వినియోగంతో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడిందని నివేదికలో పేర్కొంది. ఈ నివేదికపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మండిపడ్డారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఏకపక్షంగా ఇచ్చిన నివేదికగా పేర్కొన్నారు. ఉగ్రవాదులకు అనుకూలంగా ఇచ్చిన నివేదికగా ఆయన అభివర్ణించారు. ఐక్యరాజ్యసమితిలో అమెరికా ప్రతినిధి స్టెఫానిక్ కూడా మానవ హక్కుల మండలి నివేదికను తప్పుబట్టారు. ఇదిలా ఉండగా, పాలస్తీనాకు అనుకూలంగా గతేడాది నిరసనలకు దిగిన విద్యార్థులపై కొలంబియా యూనివర్సిటీ కొరడా ఝుళిపించింది. ఆందోళనల్లో భాగంగా వర్సిటీ క్యాంపస్ భవనాలను ఆక్రమించిన వారికి వివిధ రకాల శిక్షలు విధించినట్లు గురువారం తెలిపింది. సంవత్సరాల తరబడి సస్పెన్షన్లు, తాత్కాలికంగా డిగ్రీ రద్దు చేయడం, క్యాంపస్ నుంచి బహిష్కరణ తదితర ఆంక్షలు విధించినట్లు ప్రకటించింది.

ఐసిస్ అగ్ర నాయకుడు అబూ ఖదీజా హతం

బాగ్దాద్, మార్చి 14: ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థ అగ్రనాయకుడు అబ్దుల్లా ముకి ముస్లేహ్ అల్ రిఫాయ్ అలియాస్ అబూ ఖదీజా హతమయ్యాడు. అతడిని డిప్యూటీ ఖలీఫాగా కూడా వ్యవహరిస్తుంటారు. ఈ విషయాన్ని శుక్రవారం ఇరాక్ ప్రధాని మహమ్మద్ షియా అల్ సుదాని ప్రకటించారు. అమెరికా సాయంతో పనిచేస్తున్న ఇరాకీ దళాలు ఆయనను మట్టుపెట్టినట్టు తెలిపారు. అబూ ఖదీజా చాలా ప్రమాదకర ఉగ్రవాది అని, ఐసిస్ సంస్థ విదేశీ వ్యవహారాలను చూసేవాడని చెప్పారు. అతడి మరణం శాంతికాముకులకు పెద్ద విజయమని అభివర్ణించారు.

రన్యా రావుకు బెయిల్ నిరాకరణ

బెంగళూరు, మార్చి 14: బంగారం స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యా రావుకు ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు బెయిల్ నిరాకరించింది. కేసులో ఉన్న అభియోగాల తీవ్రత దృష్ట్యా బెయిల్ అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు పేర్కొంది. ఆమె జ్యుడీషియల్ కస్టడీలోనే ఉండాలన్న ప్రాసిక్యూషన్ వాదనను జడ్జి విశ్వనాథ్ గౌడార్ సమర్థించారు. మార్చి 4న బెంగళూరు ఎయిర్‌పోర్టులో 14.8 కిలోల అక్రమ బంగారంతో అరెస్టయిన తర్వాత రన్యా రావు బెయిల్ కోసం మొదట మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్కడ బెయిల్ తిరస్కరించడంతో ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో బెయిల్ కోసం పిటిషన్ వేశారు. ఇప్పుడు ఇక్కడ కూడా బెయిల్ రాకపోవడంతో ఆమె లాయర్లు సెషన్స్ కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారు.

పోక్సో కేసులో యడియూరప్పకు ఊరట

బెంగళూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసును ఎదుర్కొంటున్న బీజేపీ కీలకనేత, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు ఊరట లభించింది. విచారణకు శనివారం తప్పక హాజరు కావాలని బెంగళూరు ఒకటో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జారీ చేసిన సమన్లపై హైకోర్టు శుక్రవారం స్టే విధించింది. విచారణకు తప్పనిసరి హాజరు నుంచి యడియూరప్పకు మినహాయింపు ఇచ్చింది. సమస్యను చెప్పుకునేందుకు వెళ్లిన సమయంలో యడియూరప్ప తన కూతురితో అనుచితంగా ప్రవర్తించారని ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు 2024 ఫిబ్రవరి 2న యడియూరప్పపై పోక్సో కేసు నమోదైంది.

వలపు వలలో రక్షణ ఉద్యోగి..యూపీలో అరెస్టు

న్యూఢిల్లీ, మార్చి 14: ఓ మహిళ విసిరిన వలపు వలలో చిక్కిన రక్షణ శాఖ ఉద్యోగి ఒకరు పాకిస్థాన్‌కు గూఢచారిగా మారాడు. గమనించిన ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు అరెస్టు చేశారు. ఫిరోజాబాద్ సమీపంలోని హజ్రత్‌పూర్‌లో ఉన్న రక్షణ శాఖ పరిధిలోని ఆయుధ తయారీ కర్మాగారంలో ఛార్జ్‌మన్‌గా పనిచేస్తున్న రవీంద్ర కుమార్ పాక్‌కు కీలక సమాచారం అందించినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. అతడితో పాటు, ఆగ్రాలో ఉన్న స్నేహితుడిని కూడా అరెస్టు చేసినట్టు పేర్కొన్నాయి. అతడికి గత ఏడాది ఫేస్‌బుక్ ద్వారా నేహా శర్మ అనే మహిళతో పరిచయం ఏర్పడింది. తాను పాక్ గూఢచారి సంస్థ ఐఎస్‌ఐ తరఫున పనిచేసినట్టు ఆమె తెలిపింది కూడా. అయినా ఆమె విసిరిన వలపు వలలో చిక్కుకొని, డబ్బుకు ఆశపడి వాట్సప్ ద్వారా పలు పత్రాలు అందజేశాడు.

పెళ్లితో మగవాళ్లు లావెక్కుతారు!

'సింగిల్స్'తో పోలిస్తే వివాహమైన వాళ్లలో 62 శాతం అధిక బరువు ప్రమాదం

▸ ఇది మహిళల్లో 39 శాతం మాత్రమే

▸ వార్సా పరిశోధకుల అధ్యయనం వెల్లడి

▸ పెరిగే ఆహార పరిమాణం, శారీరక శ్రమ లేకపోవడమే కారణమంటున్న నిపుణులు



వార్సా, మార్చి 14: 'అరే ఏంట్రా.. పెళ్లికి ముందు సన్నగా ఉండే వాడివి.. ఇంత లావు అయ్యావు..?' ఇలాంటి మాటలను తరచుగా వింటుంటాం. మనలోనే చాలా మందికి ఈ ప్రశ్న ఎదురై ఉంటుంది. ఇది వాస్తవమేనని అంటున్నారు శాస్త్రవేత్తలు. వివాహం కాని వారితో పోలిస్తే.. పెళ్లయిన పురుషుల్లో అధిక బరువు ప్రమాదం 62 శాతం ఎక్కువగా ఉంటుందని పొలాండ్‌లోని వార్సాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ పరిశోధకులు వెల్లడించారు. మహిళల్లో 39 శాతం మాత్రమే ఉంటుందని అధ్యయనంలో పేర్కొన్నారు. పెళ్లి పురుషుల్లో ఊబకాయం సమస్యను మూడు రెట్లు పెంచుతుందని అధ్యయనం వెల్లడించింది. అధిక బరువు అనేది వయస్సుతో ప్రభావితమవుతుందని గుర్తించారు.

వివాహంతో 3 రెట్ల ఊబకాయం రిస్క్!

పరిశోధకులు మల్టీ-సెంటర్ నేషనల్ పాపులేషన్ హెల్త్ ఎగ్జామినేషన్ సర్వే నుంచి 2,405 మంది డేటాను పరిశీలించారు. వారి 50 ఏళ్ల వయస్సులో 35.3 శాతం మంది సాధారణ బరువు కలిగి ఉన్నారు. 38.3 శాతం మంది అధిక బరువు, 26.4 శాతం మంది ఊబకాయంతో ఉన్నారు. అధిక బరువు, వయస్సు, వైవాహిక స్థితి, మానసిక ఆరోగ్యం ఇతర అంశాల మధ్య సంబంధం ఉన్నట్లు గుర్తించారు. వివాహమైన మగవాళ్లు సింగిల్‌గా ఉన్న పురుషుల కంటే ఊబకాయం బారిన పడే ప్రమాదం 3.2 రెట్లు ఎక్కువగా ఉందని, వివాహిత మహిళలకు ఊబకాయం వచ్చే సమస్య ఎక్కువగా లేదని వెల్లడించారు. 'ఒబెసిటీ హెల్త్ అలయెన్స్' డైరెక్టర్ కాథరిన్ జెన్నెర్ మాట్లాడుతూ పురుషులు పెళ్లయిన తర్వాత తినే ఆహార పరిమాణం పెరగడం, బయట తినడం, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో బరువు పెరుగుతారని పేర్కొన్నారు. అయితే సామాజికంగా ఉన్న కొన్ని ఒత్తిళ్లకు కారణంగా మహిళలు శరీర బరువు విషయంలో జాగ్రత్తగా ఉంటారని అభిప్రాయపడ్డారు.

250 కోట్ల మంది

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల మందిపైగా పెద్దలు, పిల్లలు అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడుతున్నారని, 1990 నుంచి ఊబకాయం రేటు రెట్టింపు కంటే ఎక్కువగా ఉంటోందని పలు అధ్యయనాలు పేర్కొన్నాయి. 2050 నాటికి, పిల్లల్లో మూడో వంతు మంది, వయోజనుల్లో సగానికి పైగా అధిక బరువు లేదా ఊబకాయం బారిన పడతారని లాన్సెట్ అధ్యయనం అంచనా వేసింది. వివాహం తర్వాత పురుషుల్లో అధికంగా కెలోరీలు తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం ఫలితంగా మొదటి ఐదేళ్లలో శరీర ద్రవ్యరాశి సూచిక (బీఎంఐ) పెరుగుతుందని గత ఏడాది ఒక చైనా అధ్యయనం వెల్లడించింది. పెళ్లయిన పురుషులు సాధారంగా ఒంటరి వాళ్ల కంటే 1.4 కేజీల బరువు ఎక్కువగా ఉంటారని యూనివర్సిటీ ఆఫ్ బాత్ అధ్యయనం పేర్కొంది. పురుషులు గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి కారణాలతో అకాల మరణానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఈ పరిస్థితుల్లో బరువు అనేది ఒక కీలక అంశమని మెన్స్ హెల్త్ ఫోరం కన్సల్టెంట్ జొమ్ పోలార్డ్ అన్నారు. ఊబకాయం సమస్యను ఎదుర్కొనేందుకు మరింత లక్ష్యంతో కూడిన విధానం అవసరమని పేర్కొన్నారు.

భూమిపై ఏలియన్స్!

1940ల నుంచి అంతరిక్షనౌక వచ్చి వెళ్తోంది

▸ మన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిని గ్రహాంతర వాసులు పరిశీలిస్తున్నారు

▸ వెల్లడించిన అమెరికా నిఘా అధికారులు



న్యూఢిల్లీ, మార్చి 14: ఇప్పటి వరకు గ్రహాంతర వాసులు (ఏలియన్స్) ఉన్నారని, లేరని ఎడతెగని వాదనలు జరుగుతూనే ఉన్నాయి. కానీ ఇప్పుడు భూమిపైనే వారి ఉనికి ఉందంటూ అమెరికా నిఘా విభాగం అధికారులు సంచలన విషయం వెల్లడించారు. 'ది ఏజ్ ఆఫ్ డిస్‌క్లోజర్' పేరుతో కొత్తగా విడుదలైన ఓ డాక్యుమెంటరీలో విశ్వంలో మనతో పాటు మరో గ్రహంలోనూ జీవుల ఉనికి ఉందని వివరించారు. ఇతర గ్రహం నుంచి భూమిపైకి వచ్చే అంతరిక్ష నౌకలు (యూఏపీ) ఉన్నాయని, వాటి గురించి తమకు స్పష్టంగా తెలుసని ఆ డాక్యుమెంటరీలో 34 మంది మిలిటరీ, నిఘా అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం భూమిపైనే గ్రహాంతరవాసుల ఉంటున్నారని వారు కుండబద్దలు కొట్టారు. ఈ విషయంపై తమకు నేరుగానే అవగాహన ఉందని ఆ డాక్యుమెంటరీలో కొంత మంది వెటరన్ అధికారులు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞాన పరంగా మనం ఎంత అభివృద్ధి సాధించామో పరిశీలించడానికి 1940ల నుంచి ఏలియన్స్ అంతరిక్ష నౌక భూమిపైకి వచ్చి వెళుతోందని తెలిపారు. ఈ విషయాలు తెలిసి కూడా అమెరికా ప్రభుత్వం గోప్యత పాటిస్తోందంటూ విమర్శించారు. దేశ భద్రతకే ఇది పెద్ద ముప్పుగా పరిణమించబోతోందని అభిప్రాయపడ్డారు. గ్రహాంతర వాసుల యూఏపీల వేగం మన అత్యంత వేగవంతమైన ఎయిర్‌క్రాఫ్ట్‌ల కన్నా 10 రెట్లు ఎక్కువగా ఉంటుందని, వాటి వేగం గంటకు 50 వేల మైళ్లు దాటి ఉంటుందని వారు వెల్లడించారు. ఆ డాక్యుమెంటరీలో సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో, న్యూయార్క్ సెనేటర్ కిర్‌స్టెన్ గిల్లిబ్రాండ్ కూడా తమ అభిప్రాయాలు వెల్లడించారు. నిఘా అధికారుల వాదనను వారు కొట్టిపారేశారు. ఆ యూఏపీలు ఖండాంతర ప్రయోగాలకు సంబంధించినవి కావచ్చని గిల్లిబ్రాండ్ అన్నారు. చైనా, రష్యా లేదా వేరే శత్రుదేశాలకు చెందినవి అయ్యిండవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రపంచ మిలిటరీ శక్తి సామర్థ్యాలను గ్రహంతర వాసులు పరిశీస్తున్నారని నమ్ముతున్నట్లు మాజీ మిలిటరీ అధికారి ఎలిజోండో చెప్పారు.



మహారాష్ట్రలో పోటీ పరీక్షలన్నీ ఇక మరాఠీలోనే

▸ మాతృభాషలోనే ఇంజనీరింగ్ పాఠ్యపుస్తకాలు కూడా: ఫడణవీస్



ముంబై, మార్చి 14: మహారాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఎంపీఎస్‌సీ) నిర్వహించే పోటీ పరీక్షలన్నీ ఇకపై మరాఠీలోనే జరుగుతాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. ఇంగ్లిష్‌లో పోటీ పరీక్షలు రాసేందుకు మరాఠీ భాష విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శాసనమండలిలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయాన్ని వెల్లడించారు. కొన్ని ఇంజినీరింగ్, అగ్రికల్చర్ పరీక్షలను ఎందుకు మరాఠీలో నిర్వహించడం లేదంటూ శివసేన (ఠాక్రే) సభ్యుడు మిళింద్ నర్వేకర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఇకపై అన్ని పరీక్షలు మాతృభాషలోనే జరుగుతాయని చెప్పారు. ఎంపీఎస్‌సీ నిర్వహించే చాలా పరీక్షలు ఇంగ్లిష్, మరాఠీ ఉభయ భాషల్లో నిర్వహిస్తుంటారని తెలిపారు. కానీ కొన్ని టెక్నికల్ అంశాలపై మరాఠీలో పుస్తకాలు లభ్యంకానందున వాటిని ఇంగ్లిష్‌లోనే జరపాలని గతంలో కోర్టులు ఆదేశాలు ఇచ్చాయని గుర్తు చేశారు. టెక్నికల్ సబ్జెక్టులకు కూడా మరాఠీలో పుస్తకాలు లభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నూతన విద్యావిధానం ప్రకారం మరాఠీలో కూడా ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించేందుకు అవకాశం ఉందని చెప్పారు. నిర్దేశిత గడువులోగా ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంపీఎస్‌సీని ఆదేశించినట్టు తెలిపారు.

గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన శాశ్వత నివాసం లభించదు

▸ ఆ విషయాన్ని అమెరికన్లమైన మేం నిర్ణయిస్తాం: జేడీ వాన్స్



న్యూఢిల్లీ, మార్చి 14: గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన వలసదారులకు అమెరికాలో శాశ్వతంగా నివసించే హక్కు లభించదని ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. గురువారం ఫాక్స్ న్యూస్ మీడియా చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. గ్రీన్‌కార్డుదారులకు అమెరికాలో నిరవధికంగా ఉండే హక్కు లేదని తెలిపారు. 'ఇది భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన అంశం కాదు. నా ఉద్దేశం ప్రకారం ఇది జాతీయ భద్రతకు సంబంధించినది. అన్నిటికంటే ముఖ్యంగా మా సమాజంలోకి ఎవరిని కలుపుకోవాలనే విషయాన్ని అమెరికా పౌరులుగా మేము నిర్ణయిస్తాం. ఒక వ్యక్తి అమెరికాలో ఉండకూడదని, ఇక్కడ ఉండటానికి వారికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కు లేదని దేశాధ్యక్షుడే నిర్ణయం తీసుకుంటే.. ఇక ఇందులో రెండో ఆలోచనే లేదు' అని వాన్స్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి వ్యతిరేకంగా గతంలో జరిగిన నిరసనల్లో పాల్గొన్నందుకు గ్రీన్‌కార్డుదారుడైన కొలంబియా వర్సిటీ విద్యార్థి మహమూద్ ఖలీల్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఖలీల్ గ్రీన్‌కార్డును ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు.

జన్మత: పౌరసత్వంపై సుప్రీంకోర్టుకు ట్రంప్ ప్రభుత్వం

వాషింగ్టన్, మార్చి14: జన్మత: పౌరసత్వంపై ఆంక్షలను పాక్షికంగానైనా అమలు చేయడానికి అనుమతించాల్సిందిగా అమెరికా సుప్రీంకోర్టును ట్రంప్ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ట్రంప్ సర్కారు సుప్రీంకోర్టులో గురువారం అత్యవసర పిటిషన్లు వేసింది. జన్మత: పౌరసత్వాన్ని నిషేధిస్తూ ట్రంప్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై ఇప్పటికే మేరీల్యాండ్, మసాచుసెట్స్, వాషింగ్టన్ జిల్లా జడ్జీలు నిలుపుదల ఉత్తర్వులు ఇచ్చారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు

▸ కచ్చితంగా ద్విభాషా విధానం అమలు

▸ తమిళనాడు ఆర్థిక మంత్రి తెన్నరసు



తమిళనాడు సీఎం స్టాలిన్‌తో ఆర్థిక మంత్రి తెన్నరసు

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్లస్ టూ(ఇంటర్) చదివే విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు లేదా ట్యాబ్‌లు అందజేయనున్నట్టు స్టాలిన్ ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం ఉదయం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థికమంత్రి తంగం తెన్నరసు ఈమేరకు ప్రకటించారు. అదేవిధంగా తల్లిదండ్రులు లేని పిల్లలకు 18 ఏళ్లు నిండేవరకు ప్రతి నెలా రూ. 2 వేలు అందించనున్నట్టు ప్రకటించారు. చెన్నై సమీపంలో 2 వేల ఎకరాల్లో కొత్త నగరం కడతామని, సుప్రసిద్ధ ఆధ్యాత్మిక నగరమైన రామేశ్వరంలో విమానాశ్రయం నిర్మించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో 'కలైంజర్ కనవు ఇల్లమ్ పథకం' కింద రూ.3500 కోట్లతో లక్ష గృహాల నిర్మాణం చేపట్టనున్నట్టు ప్రకటించారు. తమిళ 'తిరుక్కురళ్'ను 45 భాషల్లోకి అనువదించనున్నట్టు ప్రకటించిన మంత్రి.. కేంద్రప్రభుత్వం ఇవ్వబోమని చెప్పిన నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుకుంటుందని, ఖచ్చితంగా ద్విభాషా విధానాన్నే అమలు చేస్తుందని కూడా తేల్చిచెప్పారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 1-5 విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ఇప్పటి వరకు చెన్నై, తిరువళ్లూరు జిల్లాల్లో అమలు చేస్తుండగా...ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం ప్రభుత్వపాఠశాలల్లో ప్లస్-2 దాకా చదివి ఉన్నత విద్యా కోర్సుల్లో చేరే విద్యార్థినులకు ప్రతినెలా రూ.1000 చెల్లించే పుదుమైపెణ్, విద్యార్థులకు ఆర్థికసాయం అందించే తమిళ్‌పుదల్వన్ పథకాలను హిజ్రాలకు కూడా విస్తరింపజేయనున్నామని మంత్రి చెప్పారు.

యుద్ధం వచ్చినా బంకర్‌లో సేఫ్

యుద్ధాలు, ప్రకృతి విపత్తుల వేళ ప్రాణరక్షణ కోసం బంకర్లు.. ఒక్కో దాని ఖరీదు 2 కోట్ల డాలర్లు

▸ దుర్భేద్యమైన భద్రత, అత్యాధునిక సదుపాయాలు

▸ అమెరికా కంపెనీ 'సేఫ్' ప్రాజెక్టు



భూగర్భంలో సురక్షితంగా..



న్యూయార్క్, మార్చి 14: దేశాల మధ్య యుద్ధాలు జరిగినప్పుడు, ప్రకృతి ప్రకోపించి భారీ విపత్తులు సంభవించినప్పుడు ఎవరి ప్రాణాలకూ గ్యారెంటీ ఉండదు. సరిగ్గా.. ఇదే పాయింట్‌ను పట్టుకొని ఓ అమెరికా కంపెనీ కొత్త వ్యాపారం మొదలుపెట్టింది. అణుయుద్ధాలు జరిగినా, భయంకరమైన విపత్తులు సంభవించినా.. ప్రాణాలకు ప్రమాదం లేని అత్యంత దుర్భేద్యమైన బంకర్లను నిర్మిస్తామని, వాటిల్లో సురక్షితంగా ఉండవచ్చని ప్రకటించింది. అయితే, ఇవి సాధారణ ప్రజల కోసం కాదు.. సంపన్నులు, సెలబ్రిటీల కోసం. ఒక్కో బంకర్ ఖరీదు 2 కోట్ల డాలర్లు (రూ.172 కోట్లు). ఈ బంకర్లలో అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌కు ఉన్నంతటి రక్షణ ఉంటుందని సదరు కంపెనీ.. 'స్ట్రాటెజికల్లీ ఆర్మర్డ్ ఫోర్టిఫైడ్ ఎన్విరాన్‌మెంట్స్' (సేఫ్) చెబుతోంది. అమెరికాలోని 50 నగరాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా వెయ్యి ప్రాంతాల్లో ఈ అత్యాధునిక లగ్జరీ బంకర్లను నిర్మించబోతున్నామని ప్రకటించింది. ఈ ప్రాజెక్టుకు ఏరీ అని పేరు పెట్టింది. మొట్టమొదట అమెరికాలోని వర్జీనియాలో 625 మందికి సరిపోయే బంకర్లను వచ్చే ఏడాది నిర్మిస్తామని సేఫ్ అధిపతి అల్ కోర్బి తెలిపారు. 'వీటిలో ఉండే వారికి దేశాధినేతలకు ఉండే భద్రత కన్నా ఎక్కువ భద్రత ఉంటుంది. అత్యంత సురక్షితమైన ప్రదేశంలో ఉన్నామన్న భావన వారికి కలుగుతుంది. విపత్కర సమయాల్లో వారు తమ ఇళ్లను వదిలిపెట్టి ఇక్కడ ఎటువంటి ఆందోళన లేకుండా గడపవచ్చు' అని వివరించారు. సేఫ్ నిర్మించబోయే బంకర్లు భూమికి 200 అడుగుల దిగువన ఉంటాయి. పేలుడు పదార్థాలు, బాంబులు కూడా ఏమీ చేయలేని దృఢత్వంతో వీటి గోడలను నిర్మిస్తారు. బంకర్లలో సురక్షితమైన హైస్పీడ్ లిఫ్టులను ఉపయోగిస్తారు. ఇక సదుపాయాల విషయానికొస్తే.. కృత్రిమమేధతో కూడిన ఆరోగ్య సదుపాయాలు, స్విమ్మింగ్ పూల్స్, డైనింగ్ సౌకర్యాలు, బయోమెట్రిక్ వ్యవస్థలు, ఇంటరాక్టివ్ టెక్నాలజీతో కూడిన గోడలు, పైకప్పు, లైటింగ్ వంటివి ఉంటాయి. ఖరీదును బట్టి సదుపాయాలు కూడా మారుతాయి. రెండు వేల అడుగుల విస్తీర్ణం నుంచి 20 వేల అడుగుల విస్తీర్ణం వరకూ రకరకాల సైజుల్లో బంకర్లు ఉంటాయి. ఏరీ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఫోర్బ్స్ వెబ్‌సైట్.. 'డూమ్స్‌డే బంకర్ల' పేరుతో వెల్లడించింది.

విదేశీ ఉపగ్రహాల ప్రయోగాలతో 1,243 కోట్ల ఆర్జన

న్యూఢిల్లీ, మార్చి 14: అంతరిక్ష ప్రయోగాల్లో వరుస విజయాలు సాధిస్తున్న భారత్... వాణిజ్యపరంగానూ భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జిస్తోంది. గత పదేళ్ల కాలంలో 34 దేశాలకు చెందిన విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా రూ.1243 కోట్ల (143 మిలియన్ డాలర్లు) విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించినట్టు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. 2015 జనవరి నుంచి 2024 డిసెంబరు వరకు వాణిజ్య ప్రాతిపదికను మొత్తం 393 విదేశీ ఉపగ్రహాలు, 3 భారత కస్టమర్ ఉపగ్రహాలను ప్రయోగించినట్టు లోక్‌సభలో తెలిపారు. భారత్ ప్రయోగించిన విదేశీ ఉపగ్రహాల్లో అభివృద్ధి చెందిన దేశాలకు చెందినవి కూడా ఉన్నాయని వివరించారు. అత్యధికంగా అమెరికాకు చెందిన 232 ఉపగ్రహాలను పంపగా, ఆ తర్వాత ఇంగ్లండ్ (83), సింగపూర్ (19) దేశాలకు చెందిన ఉపగ్రహాలు ఉన్నాయి. ప్రస్తుతం 61 దేశాలు, 5 బహుళ జాతి సంస్థలతో భారత్ అంతరిక్ష సహకార ఒప్పందాలు చేసుకుంది.

కాంట్రాక్టు పద్ధతిలో సైంటిస్టుల నియామకాలొద్దు

న్యూఢిల్లీ, మార్చి 14: కేంద్ర ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్‌ఆర్)లో పరిశోధక పదవులు దీర్ఘకాలంగా ఖాళీగా ఉండడంపై పార్లమెంటరీ స్థాయీసంఘం ఆగ్రహం వ్యక్తంచేసింది. నిపుణులు, సుశిక్షితులైన భారతీయ వృత్తి నిపుణులు అభివృద్ధి చెందిన దేశాల బాట పట్టడంపై ఆందోళన వ్యక్తంచేసింది. మేధో వలసలను అడ్డుకునేందుకు.. మొదట పరిశోధక పదవుల్లో కాంట్రాక్టు నియామకాలను ఆపాలని స్పష్టం చేస్తూ కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమంపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ రాజ్యసభకు ఇటీవల నివేదిక సమర్పించింది.

షార్‌కు చేరిన 'ప్రొపల్లెంట్ మిక్సర్'

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇస్రో ఇటీవల 10 టన్నుల ఇంధన సామర్థ్యంతో అభివృద్ధి చేసిన 'ప్రొపల్లెంట్ మిక్సర్' షార్‌కు చేరింది. రాకెట్ల తయారీలో ఘన ఇంధన దశల కోసం దీన్ని వినియోగిస్తారు. ఈ ప్రొపల్లెంట్ మిక్సర్‌ను బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ శుక్రవారం తెల్లవారుజామున షార్‌కు తీసుకొచ్చారు. రాకెట్ జీరో దశలో ఉన్న స్ట్రాపాన్లు మొదటి దశలోని ఘన ఇంధన మోటార్లకు ఇంధనం సరఫరా చేసేందుకు ఈ భారీ ప్రొపల్లెంట్ మిక్సర్ ఉపయోగపడుతుంది. ఈ మిక్సర్ వెడల్పు 3.3 మీటర్లు, ఎత్తు 8.7 మీటర్లు. సుమారు 150 టన్నుల బరువు ఉంటుంది. దేశంలో 10 టన్నుల ప్రొపల్లెంట్ మిక్సర్‌ను అభివృద్ధి చేయడం ఇదే తొలిసారి.

హోలీ వేడుకల్లో గంజాయి కుల్ఫీ, బర్ఫీ

- హైదరాబాద్ దూల్‌పేటలో కలకలం
- 100 కుల్ఫీలు, 72 బర్ఫీలు స్వాధీనం
- ముత్తంగిలో 84 చాక్లెట్ల పట్టివేత

హైదరాబాద్ సిటీ, పటాన్‌చెరు, మార్చి 14(ఆంధ్ర జ్యోతి): గంజాయి వ్యాపారులు జనాన్ని మత్తుకు బానిసలను చేసేందుకు రకరకాల మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇన్నాళ్లు హష్‌ఆయిల్, చాక్లెట్ల రూపంలో గంజాయిని విక్రయించిన ఆయా ముఠాలు.. ఇప్పుడు ఏకంగా గంజాయితో కుల్ఫీలు, బర్ఫీలను తయారు చేసి వాటిని గుట్టుగా జనంలోకి వదిలేస్తున్నాయి. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన హోలీ వేడుకల్లో ఈ గంజాయి కుల్ఫీ ఐస్‌క్రీములు, బర్ఫీల గుట్టు బయటపడింది. హోలీ వేడుకల ముసుగులో కొందరు మత్తు పదార్థాలను వినియోగిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్) పోలీసులు లోయర్ దూల్‌పేట్‌లోని మల్చీపురాలో జరిగిన హోలీ వేడుకలపై దాడి చేశారు. ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి నేతృత్వంలో దాడి చేసిన ఎక్సైజ్ పోలీసులు గంజాయి కలిపి తయారు చేసిన కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు, బర్ఫీ వంటాయిలను గుర్తించారు. బర్ఫీ స్వీట్లను సిల్వర్ పేపర్‌తో చుట్టి బంతుల్లా తయారు చేసి ఉండడాన్ని గమనించారు. గంజాయి కలిపిన 100 కుల్ఫీలు, 72 బర్ఫీలను ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నారు. ఇక, సత్యనారాయణ సింగ్ అనే వ్యక్తి ఈ ఐస్‌క్రీమ్‌లను తయారు చేసి విక్రయిస్తున్నట్టు తేలడంతో అతనిపై కేసు నమోదు చేశారు. సత్యనారాయణ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఇక, గంజాయి కుల్ఫీలు, బర్ఫీలను పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అభినందించారు. కాగా, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలోని ఓ ఇంట్లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది శుక్రవారం సాయంత్రం దాడి చేసి పట్టుకున్నారు. అతని నుంచి 465 గ్రాముల బరువున్న 84 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని అంచనా. ఈ గంజాయి చాక్లెట్ల విక్రయానికి సంబంధించి బిహార్‌కు చెందిన నితీష్‌కుమార్ (25)ను అరెస్టు చేశారు. ముత్తంగిలోని ఓ హోటల్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్న నితీష్ కుమార్ బిహార్ నుంచి గంజాయి చాక్లెట్లు తెప్పించి స్థానికంగా విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది.


గంజాయి కలిపి తయారు చేసిన కుల్ఫీ ఐస్‌క్రీమ్

మా సిఫారసు లేఖలు తీసుకోవాలి

- లేకుంటే ప్రజా ప్రతినిధులందరం తిరుమల వస్తాం
- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): "తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాల కోసం మా సిఫారసు లేఖలు తీసుకోకుంటే తెలంగాణ ప్రజా ప్రతినిధులందరం కలిసి ఒక రోజు తిరుమలకు వస్తాం. టీటీడీ ఏం చేస్తుందో ఆ రోజు చూసుకుంటాం. తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీల సిఫారసు లేఖలను రేపటి నుంచి తీసుకోవాలి" అని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజా ప్రతినిధులు పంపిస్తున్న లేఖలను ఫిబ్రవరి 1 నుంచి తీసుకుంటామని టీటీడీ బోర్డు తీర్మానం చేసిందని.. అయితే మార్చి వచ్చినా స్పందన లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 294 మంది ఎమ్మెల్యేల లేఖలను తీసుకున్న టీటీడీ.. ప్రస్తుతం 153 మందికి మాత్రమే పరిమితం కావడం బాధాకరమన్నారు. సీఎం ఆదేశించినా, బోర్డు తీర్మానం చేసినా తమ సిఫారసు లేఖలను తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై వెంటనే టీటీడీ బోర్డు అత్యవసర సమావేశాన్ని నిర్వహించాలన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై సీఎం చంద్రబాబు కూడా స్పందించాలన్నారు.

ప్రభుత్వం అంగీకరించినా స్పందన లేదు: ఆది శ్రీనివాస్

శ్రీవారి దర్శనం కోసం తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి రాసిన లేఖకు ఏపీ సీఎం చంద్రబాబు స్పందించి.. అంగీకారం తెలిపినప్పటికీ టీటీడీ అధికార యంత్రాంగం తమ లేఖలను తీసుకోవడం లేదని తెలంగాణ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖలను తీసుకునేలా టీటీడీ చైర్మన్, ఈవో స్పందించాలన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌తో బాలికలకు గాలం

- మాయమాటలు చెప్పి స్నేహం
- కార్లలో తిప్పుతూ డ్రగ్స్, గంజాయి అలవాటు
- ఆపై వ్యభిచారం రొంపిలోకి దింపుతున్న వైనం
- వరంగల్ నగరంలో కలకలం రేపిన కిలాడీ లేడీ ముఠా ఆగడాలు
- పోలీసుల అదుపులో యువతి, ఆమె ప్రియుడు

వరంగల్ క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాల్లో చదువుతున్న విద్యార్థినులకు వల వేసి వారికి డ్రగ్స్ ఇచ్చి వ్యభిచారం చేయిస్తున్న ఓ కిలాడీ లేడీ ముఠా వ్యవహారం వెలుగులోకి రావడంతో వరంగల్ నగరంలో కలకలం రేపుతోంది. అయితే ఈ కిలేడీ అమాయక బాలికలను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ట్రాప్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీని ద్వారా కార్పొరేట్ పాఠశాలల్లో చదివే బాలికలతో పరిచయం పెంచుకుంటుంది. ఆ తర్వాత డ్రగ్స్ అలవాటు చేసి వ్యభిచారం రొంపిలోకి దింపుతున్నట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లుగా తెలుస్తోంది.

అయితే కొన్నిరోజుల కిందట ఈమె ముఠా మాయలో వరంగల్ లేబర్ కాలనీకి చెందిన 9వ తరగతి బాలిక పడగా.. తమ కూతురు అదృశ్యమైందని తల్లితండ్రులు మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఏనుమాముల మార్కెట్ ప్రాంతంలో యువతితో కలిసి ఉన్న బాలికను మిల్స్‌కాలనీ పోలీసులు కనుకొన్నారు. గురువారం రాత్రి కిడ్నాప్ కేసు నమోదు చేసి కిలాడీ లేడీని అదుపులోకి తీసుకున్నారు. అయితే విచారణలో ఆ యువతి నోరు మెదపడం లేదని తెలుస్తోంది. గంజాయి ఎక్కడి నుంచి వస్తోందని ఆరా తీయగా తన బాయ్‌ఫ్రెండ్ ఇచ్చాడని చెబుతోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఉన్న తన ప్రియుడిని మిల్స్‌కాలనీ పోలీసులు అదుపులోకి తీసుకోగా, నార్కోటిక్, టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులు విచారిస్తున్నట్లుగా తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు సదరు కిలాడీ లేడీ వివరాలు ఇలా ఉన్నాయి..దామెర మండలానికి చెందిన సుమారు 20 ఏళ్ల ఓ యువతి తల్లితండ్రులు చిన్నప్పుడే మరణించడంతో కరీమాబాద్ ఉర్సులో తన చిన్నమ్మ దగ్గర ఉంటోంది. డ్రగ్స్‌కు బానిసైన యువతి.. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పాఠశాల విద్యనభ్యసించే బాలికలను పరిచయం చేసుకొని బహుమతుల పేరిట ఆకర్షించుకుంటోంది. ఆ తర్వాత విలాసవంతమైన జీవితానికి అలవాటు చేసి తమ గ్యాంగ్‌తో మైనర్లను కార్లలో తిప్పుతూ సిగరెట్లలో గంజాయి పెట్టి తాగమనడం.. లేదంటే కూల్‌డ్రింక్స్‌లో మత్తు పదార్థాలు కలిపి ఇవ్వడం చేస్తుంటోంది. మైనర్లను కారులో ఎక్కించుకున్న తర్వాత మార్గమధ్యమంలో తన ముఠా సభ్యులైన మరో మహిళ, ముగ్గురు యువకులను కారులో ఎక్కించుకుంటూ లాంగ్ డ్రైవ్ వెళ్తా మైనర్లకు గంజాయి ఇస్తుంటుంది. అలా ఇప్పటికే పాకాల, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలకు కారులోనే గంజాయి ఇప్పిస్తూ తీసుకెళ్లినట్లుగా సమాచారం. ఇలా.. బాలికలను గంజాయికి బానిసలుగా చేసి తమ ఆధీనంలోకి వచ్చిన తర్వాత వ్యభిచార కూపంలోకి తరలించే పనిలో ముఠా సభ్యులు ఉన్నట్లుగా విశ్వసనీయమైన సమాచారం. ఉర్సులో ఉన్న తన చిన్నమ్మ ఇంటికి బాలికలను సదరు యువతి తరచుగా తీసుకెళ్తుందని, బాలికలు తమ చెప్పుచేతుల్లో ఉండే విధంగా తన చిన్నమ్మ వ్యవహరిస్తుందని అదృశ్యమైన బాలిక వరంగల్ మిల్స్‌కాలనీ పోలీసుల ముందు చెప్పినట్లుగా సమాచారం. ఇప్పటికే ఒక బాలికను ముఠా సభ్యులు విశాఖపట్నంకు రవాణా చేయగా, మరో బాలికను వ్యభిచారం కూపంలోకి నెట్టేందుకు ప్రయత్నం జరుగుతున్నట్లుగా సమాచారం. ఈ వ్యవహారంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

డిస్కమ్‌ల వద్ద విద్యుత్తు.. 30% మిగులు సరికాదు

- డిమాండ్‌ను బట్టి కొనుగోలు ఒప్పందాలు ఉండాలి
- ఏఆర్ఆర్‌పై విద్యుత్తు నిపుణుల అభ్యంతరం

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్ర జ్యోతి): అవసరమైన దానికన్నా డిస్కమ్‌లు ఎక్కువ విద్యుత్తును కొనుగోలు చేస్తున్నాయని, ఫలితంగా వాటి వద్ద మిగులు విద్యుత్తు అసాధారణంగా ఉంటోందని విద్యుత్ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ)లో డిస్కమ్‌లు దాఖలు చేసిన వార్షిక ఆదాయ అవసరాల(ఏఆర్ఆర్)పై విద్యుత్తు రంగ నిపుణుడు వేణుగోపాల్‌రావుతో పాటు పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రెండు డిస్కమ్(ఉత్తర, దక్షిణ)ల పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 95,127 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరం కాగా.. ఏఆర్ఆర్ ప్రకారం డిస్కమ్‌ల వద్ద 1,23,631 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉందని వేణుగోపాల్‌రావు తెలిపారు. డిస్కమ్‌లకు అవసరమైన దానికన్నా ఏకంగా 30%(28,504మిలియన్ యూనిట్లు) ఎక్కువ విద్యుత్ ఉండటం ఏమాత్రం సహేతుకం కాదని, 5% మిగులు విద్యుత్ ఆమోదయోగ్యమని వివరించారు. డిమాండ్‌లో మార్పులను బట్టి డిస్కమ్‌లు విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు(పీపీఎం) చేసుకోవాల్సి ఉందన్నారు. డిస్కమ్‌ల నష్టాలు, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన బకాయిలు గణనీయంగా పెరిగాయని కూడా నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) నష్టాలు రూ.47,239 కోట్లు, ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్-వరంగల్) నష్టాలు రూ.20,036 కోట్లుగా ఉన్నాయని గుర్తు చేశారు. రెండు డిస్కమ్‌లకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన బకాయిలు 2024 సెప్టెంబరు 30నాటికి రూ.30,777కోట్లుగా ఉన్నాయని తెలిపారు. ఇక ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్రాజెక్టు నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుపై డిస్కమ్‌లు ఏఆర్ఆర్‌లో ఎలాంటి ప్రస్తావన చేయలేదని నిపుణులు పేర్కొన్నారు. అయితే, విద్యుత్తు బకాయిల వివాదం వల్ల ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంట్ కొనుగోళ్లు చేయడం లేదని డిస్కమ్‌లు బదులిచ్చాయి.

రైతువేదికల నిర్వహణకు నిధులేవి?

30 నెలలుగా విడుదల చేయని ప్రభుత్వం .. కనీస సదుపాయాలు లేక రైతులకు ఇబ్బందులు

- కొన్ని చోట్ల సొంతడబ్బులతో నిర్వహిస్తున్న అధికారులు
- రాష్ట్రవ్యాప్తంగా 2,600 రైతువేదికలు
- పేరుకుపోయిన కరెంటు బిల్లుల బకాయిలు

పెద్దపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రైతువేదికల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వాటి నిర్వహణకు ప్రభుత్వం గత 30 నెలలుగా ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో వ్యవసాయ విస్తీర్ణాధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస సదుపాయాలు లేకపోవటంతో రైతు వేదికలకు వచ్చే రైతులు సైతం అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరు అధికారులు తమ సొంత డబ్బులతో రైతు వేదికలను నిర్వహిస్తున్నారు. రెండున్నరేళ్లుగా విద్యుత్ బిల్లులు పేరుకుపోవడంతో.. విద్యుత్ కనెక్షన్లను కట్ చేస్తారేమో అన్న ఆందోళన నెలకొంది.

ఉన్నత లక్ష్యాలతో ఏర్పాటు

నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. పంటల సాగుపై రైతులకు సూచనలు, సలహాలు, శిక్షణ తరగతుల నిర్వహణ, నూతన వంగడాలు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా? లేదా? అన్నది పరిశీలించటం తదితర లక్ష్యాల కోసం వీటిని నెలకొల్పారు. పంటలకు లభించే ధరల విషయమై రైతులు కూర్చొని చర్చించుకునేందుకు, సంఘటితం అయ్యేందుకు ఒక వేదికగా ఇవి తోడ్పడతాయని ప్రభుత్వం భావించింది. ప్రతీ 5 వేల మంది రైతులకు, రెండు నుంచి నాలుగు గ్రామాలకు కలిపి ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి.. ఆ క్లస్టర్‌లో ఒక రైతు వేదికను నిర్మించాలని ప్రతిపాదించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాలో నిర్మించేందుకుగాను ఒక్కో రైతు వేదికకు రూ.22 లక్షల వ్యయంతో అంచనాలు రూపొందించారు. వ్యవసాయశాఖ ద్వారా రూ.12 లక్షలు, గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేశారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో 2,600 క్లస్టర్లలో రైతు వేదికలను నిర్మించారు. ఉదాహరణకు, పెద్దపల్లి జిల్లాలో 54 క్లస్టర్లు ఉండగా 54 రైతువేదికల నిర్మాణం జరిగింది. 2020 ఏప్రిల్, మే నెలల్లో పనులు మొదలుపెట్టి యుద్ధప్రాతిపాదికన డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేశారు. 2021 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికలు అందుబాటులోకి వచ్చాయి. చాలా గ్రామాల్లో రైతు వేదికలను గ్రామాలకు దూరంగా నిర్మించారు. ప్రతీ క్లస్టర్‌కు ఒక వ్యవసాయ విస్తీర్ణాధికారిని (ఏఈఓను) నియమించారు. ఉదయం 9 నుంచి 10 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు. పంటల సాగుపై శిక్షణ తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. అయితే, రైతు వేదికల నిర్వహణకు గత ప్రభుత్వం హయాం నుంచీ తగిన నిధులను కేటాయించకపోవటంతో వాటి నిర్వహణ సమస్యగా మారింది.



పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారంలోని రైతువేదిక

కనీస సదుపాయాలు కరవు

చాలా రైతు వేదికల్లో మంచి నీటి సదుపాయం లేదు. వేదికను శుభ్రంగా ఉంచటానికి వీలుగా స్వీపర్లను నియమించలేదు. తాగునీటి సౌకర్యం, విద్యుత్ చార్జీలు, మరుగుదొడ్ల నిర్వహణకు నిధులు అవసరమవుతాయి. ఆరంభంలో ప్రభుత్వం నెలకు రూ.3 వేలు కేటాయించింది. ఇవి సరిపోవని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రూ.7,500 ఇస్తామని, ఆ తర్వాత రూ.9 వేలు ఇస్తామని ప్రకటించింది. మధ్యలో ఆరు నెలలకుగాను బడ్జెట్ విడుదల చేసింది. మొత్తమ్మీద, 2022 ఆగస్టు వరకు నిధులు వచ్చాయి. ఆ తర్వాత నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారుతుందని భావించారు. కానీ, ఇప్పటి వరకు నిధులు రాలేదని ఏఈఓలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే, కొందరు అధికారులు సొంతంగా డబ్బులు పెట్టి కార్యాలయాన్ని శుభ్రం చేయిస్తున్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించినప్పుడు తాగునీటిని కూడా సొంతడబ్బులతోనే తెప్పిస్తున్నారు. కాగా, విద్యుత్ బిల్లులు పెండింగులో ఉన్నాయని.. విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తే తమ విధులు నిర్వహించటం కూడా సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. నిత్యం ఆన్‌లైన్ ద్వారానే పంటలు, రైతులకు సంబంధించిన వివరాలను కంప్యూటర్లలో నమోదు చేసి రిపోర్టులు పంపించాల్సి ఉంటుందని.. కరెంటు లేకపోతే అది నిలిచిపోతుందని గుర్తు చేస్తున్నారు. నిధులు లేక రైతువేదికల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డబ్బులు విడుదల చేయాలని రైతులు, అధికారులు కోరుతున్నారు.


శిల్పాలను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకులు శివనాగి రెడ్డి, రామ్‌మోహన్

బాసరలో వెయ్యేళ్ల నాటి శిల్పాలు

బాసర, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రంలో వెయ్యేళ్ల నాటి పురాతన శిల్పాలను పురావస్తు పరిశోధకులు గుర్తించారు. శుక్రవారం బాసర పుణ్యక్షేత్రంలో వారు పర్యటించి పురాతన ఆలయాలను సందర్శించారు. ఆలయాల వద్ద ఉన్న శిల్పాలను పరిశీలించగా.. అవి ప్రాచీన కాలం నాటి శిల్పాలని గుర్తించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు, బాసర నివాసి బలగం రామ్‌మోహన్ ఇచ్చిన సమాచారం మేరకు పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈ. శివనాగి రెడ్డి బాసరలో పర్యటించారు. చారిత్రక ఆనవాళ్లు, శిథిల ఆలయాలు, శాసనాలను పరిశీలించారు. ఆంజనేయ స్వామి ఆలయం ముందు క్రీస్తు శకం 11వ శతాబ్ధంలో జైన శాసనాన్ని, గణేశాలయంలో క్రీస్తు శకం 8వ శతాబ్ధం నాటి 5 అడుగుల ఎత్తు గల చాళుక్య గణేశ శిల్పం చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉందని పురావస్తు పరిశోధకులు తెలిపారు. పాపహరేశ్వర ఆలయం ముందున్న క్రీస్తు శకం 9, 12 శతాబ్ధాలకు చెందిన జైన యక్షిణి, భైరవ, శివలింగం, నంది, గణేశ, సతి శిలలు, దాన శాసనాలతో పాటు శిలా తోరణాలను గుర్తించారు.

పల్లెలనూ వదలని జీవనశైలి జబ్బులు

కష్టజీవుల్లోనూ మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలు

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో రక్తహీనత, ఎదుగుదల లోపాలు
- హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ నివేదిక

హైదరాబాద్ సిటీ, మార్చి14(ఆంధ్రజ్యోతి): మధుమేహం, రక్తపోటు, మూత్రపిండాల సమస్యలు, గుండెజబ్బులు, ఊబకాయం వంటి జీవనశైలి జబ్బులు నగర, పట్టణ వాసులనే కాదు పల్లె ప్రజలను వదలడం లేదు. నిత్యం శ్రమిస్తూ ఉండే గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా ఈ జబ్బుల బారిన పడడం ఆందోళనకరంగా మారింది. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్(హెచ్‌హెచ్ఎఫ్)2024 వార్షిక నివేదికలో ఈ విషయం బయటపడింది. హైదరాబాద్‌లోని పలు బస్తీలు, మహేశ్వరం మండలంలోని 17గ్రామాల్లో 2024లో నిర్వహించిన ఆరోగ్య పరీక్షల ఆధారంగా హెచ్‌హెచ్ఎఫ్ ఓ నివేదిక విడుదల చేసింది. దాని ప్రకారం.. మహేశ్వరం మండల పరిధిలోని గ్రామాల్లో మొత్తం 10వేలమందికి గతేడాది హెచ్‌హెచ్ఎఫ్ వైద్య పరీక్షలు నిర్వహించగా, అందులో 22శాతంమంది మధుమేహం, అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. ఇక, నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ మూడు కుటుంబాల్లో ఒక ఇంట్లో జీవనశైలి జబ్బుల బాధితులు ఉన్నారు. ఇక, హైదరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో 3 నుంచి 8ఏళ్ల లోపు వయస్సు ఉన్న 5,000 మందిని పరీక్షించగా వారిలో 30 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. 28 శాతం మంది పోషకాహార లోపం వల్ల ఉండాల్సిన ఎత్తు కన్నా తక్కువ ఎత్తు ఉన్నారు. హైదరాబాద్‌లోని పాతనగరంలో నోటి క్యాన్సర్ బాధితులు అధికంగా ఉన్నారు. హెచ్‌హెచ్ఎఫ్ 2024లో పాతనగరానికి చెందిన 300 మంది రోగులకు ఆర్థిక సాయం అందించగా వారిలో 25 శాతం మంది నోటి క్యాన్సర్ బాధితులు ఉన్నారు. వీరిలో అత్యధికులు 35 ఏళ్ల లోపు వయస్సు వారు ఉండడం ఆందోళనకరం. అలాగే, హైదరాబాద్‌లో 25నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు వారిలో పక్షవాతం కేసులు కూడా పెరిగాయి. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ నగర, శివారు గ్రామాల్లోని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఆరోగ్య సేవలు అందిస్తుందని అందువల్ల తమ నివేదిక ఆ వర్గాలకే పరిమితం అని ఆ సంస్థ వ్యవస్థాపకులు ముజ్తబా హసన్ అస్కరి పేర్కొన్నారు.



కత్తితో పొడిచి యువకుడి హత్య

- జనగామ జిల్లా తీగారంలో దారుణం
- వివాహేతర సంబంధం వల్లేనని అనుమానం

జఫర్‌గడ్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ వేళ జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. విచక్షణారహితంగా కత్తితో పొడవడంతో మృతిచెందాడు. బాధిత కుటుంబం, స్థానికుల కథనం ప్రకారం.. తీగారంలో నివాసం ఉండే గోనె యాదగిరి చిన్న కుమారుడు ప్రవీణ్(28) పదో తరగతి వరకు చదువుకుని వ్యవసాయం చేస్తూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. శుక్రవారం గడ్డి కోసుకొస్తానని తండ్రికి చెప్పి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అక్కడ పనులు చేసుకుంటుండగా సాయంత్రం 4 గంటల సమయంలో మూడు బైకులపై సుమారు ఐదుగురు యువకులు అక్కడికి వచ్చారు. ప్రవీణ్‌తో ఏదో మాట్లాడుతూ.. అకస్మాత్తుగా గొడవపడ్డారు. ఇంతలోనే ఒకరు కత్తితో పలుమార్లు ప్రవీణ్‌ను పొడిచారు. దీనిని గమనించిన చుట్టు పక్కల రైతులు కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. రక్తపు మడుగులో ఉన్న ప్రవీణ్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. దాడికి పాల్పడిన వారు ఇదే మండలం తమ్మడపల్లి(ఐ) గ్రామానికి చెందిన వారుగా అనుమానిస్తున్నారు. కాగా, హత్యకు గురైన ప్రవీణ్ అవివాహితుడు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని అనుమానిస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.


ప్రవీణ్ (ఫైల్)

ఎస్ఎల్‌బీసీలో కొనసాగుతున్న ఆపరేషన్

- సొరంగంలోకి 30 హెచ్‌పీ లిక్విడ్ వాక్యూమ్ పంపు, ట్యాంక్

దోమలపెంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు చేపట్టిన సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. సహాయక చర్యలపై డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూలు కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ ఆధ్వర్యంలో వివిధ రెస్క్యూ బృందాలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. గత నెల 22న ప్రమాదం జరిగిన నాటి నుంచి రెస్క్యూ బృందాలు నిర్విరామంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. శుక్రవారం నాటికి 21 రోజులైనా ఇంకా ఏడుగురు కార్మికుల జాడ గుర్తించడం కష్టంగా మారింది. ప్రస్తుతం అత్యంత ప్రమాదకరంగా ఉన్న డీ1, డీ2, ప్రాంతాల్లో రెస్క్యూ బృందాలు పనులు చేపడుతున్నాయి. టీబీఎం మిషన్ ఎర్త్ కట్టర్ ఉన్న ప్రాంతం పూర్తిగా 30 అడుగుల వరకు కూరుకుపోయింది. అక్కడి వరకు మనుషులు వెళ్లి పనులు చేయడం చాలా ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ టీబీఎంకు సంబంధించిన విడిభాగాలు కటింగ్ చేసి తొలగిస్తున్నారు. అక్కడ సిమెంట్ సెగ్మెంట్ కూడా పడిపోయే పరిస్థితి ఉన్నందున సింగరేణి గనుల్లో ఉపయోగించే టైగర్ క్లాగ్స్‌ను సపోర్టుగా చేసుకుంటూ తవ్వకాలు జరుపుతున్నారు. సొరంగంలో మనుషులు వెళ్లలేని ప్రమాదకరమైన ప్రాంతాల్లో రోబోలతో సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం హైదరాబాద్‌కు చెందిన అన్వి రోబోలను తెప్పించింది. కానీ ఇప్పటివరకు వాటి సేవలు అందుబాటులోకి రాలేదు. అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోలకు అనుసంధానంగా ప్రత్యేకంగా ఉపయోగించేందుకు 30 హెచ్‌పీ సామర్థ్యం గల పంపు మోటారు, వాక్యూమ్ ట్యాంకుతో కూడిన మిషన్‌ను సొరంగంలోకి పంపారు. రోబోతో తవ్వకాలతో పనులు వేగంగా జరుగుతాయని, వాక్యూమ్ ట్యాంకు ద్వారా గంటకు 620 క్యూబిక్ మీటర్ల బురద మట్టిని కన్వేయర్, బెల్ట్‌పై బయటకు తరలించవచ్చని అధికారులు భావిస్తున్నారు.



నాగారంలోని ఆ 50 ఎకరాలు భూదాన్ భూములు కావు

- లావాదేవీలకు అనుమతిచ్చి.. ఎలా వెనక్కి తీసుకుంటారు?
- కాంపిటెంట్ అథారిటీ ఉత్తర్వులపై హైకోర్టులో సవాల్



హైదరాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నెంబర్ 181లో ఉన్న 50 ఎకరాల భూములపై మరో వివాదం తలెత్తింది. అవి భూదాన్ యజ్ఞబోర్డు భూములే అని కాంపిటెంట్ అథారిటీ కం రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలయింది. ఈఐపీఎల్ కన్‌స్ట్రక్షన్స్, ఆ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీధర్‌రెడ్డి ఈ పిటిషన్ వేశారు. అవి ప్రస్తుతం భూదాన్ భూములు కావని, వాటిపై గతంలో లావాదేవీలు జరిపి, ఇప్పుడు ఎలా వెనక్కి తీసుకుంటారని ప్రశ్నించారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. భూదానం ద్వారా వచ్చిన భూములను వ్యవసాయం కోసం ఇస్తారని, అవి వారసులకు వెళ్తాయే తప్ప ఇతరులకు బదిలీచేయడానికి వీల్లేదని పేర్కొంది. వివాదంలో ఉన్న భూముల్లో ఇతరత్రా లావాదేవీలు జరిపేందుకు ప్రభుత్వమే అనుమతి ఇచ్చి.. ఇప్పుడు వెనక్కి తీసుకుంటామని చెప్పడాన్ని పిటిషనర్ ప్రశ్నిస్తున్నారని తెలిపింది. ఆ భూములపై యథాతథ స్థితిని కొనసాగించాలని పేర్కొంటూ తదుపరి విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వెంటాడిన నేరం...!

ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో అరెస్టయి, ప్రత్యేక విమానంలో నెదర్లాండ్స్‌కు తరలిన ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రోడ్రిగో దుతర్తే శుక్రవారం హేగ్‌లోని అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు-ఐసిసి) ముందు హాజరైనారు. అలసిపోయి ఉంటారు, ప్రత్యక్షంగా రానక్కరలేదు అంటూ న్యాయమూర్తులు ఇచ్చిన మినహాయింపు మేరకు, సమీపంలో ఉన్న డిటెన్షన్ సెంటర్‌నుంచి ఆయన వీడియోలింకు ద్వారా తొలిసారిగా విచారణకు హాజరైనారు. మాదకద్రవ్యాలమీద యుద్ధం పేరిట తన ఏలుబడిలో వేలాదిమందిని చంపిన నేరానికి ఐసిసి ఆయనను విచారిస్తోంది. దశాబ్దంన్నరకు పైగా ఐసిసి తనను వెంటాడుతున్నకాలంలో, అడపాదడపా ఆ న్యాయస్థానాన్ని అవమానిస్తూ, నన్ను నువ్వేం చేయలేవంటూ అసభ్యపదజాలంతో చేసిన వ్యాఖ్యలన్నీ ఈ సందర్భంగా ఆయనకు గుర్తుకొచ్చివుంటాయి.

దేవుడు క్షమించడు, పాపులను శిక్షించేవరకూ విశ్రమించడు అని దుతర్తే హయాంలో ఆయన తుపాకీగుళ్ళకు బలైన వారి కుటుంబీకులు సంతోషిస్తున్నారు. ఒక వదరు,పొగరుబోతుకు తగినశాస్తి జరిగిందని అంటున్నారు. తన నేరాలూ ఘోరాలమీద ఆయనకు పశ్చాత్తాపమేమీ లేదు. మాదకద్రవ్యాల వ్యాపారాన్ని అణచివేయడం తప్పుకాదని వాదిస్తూ, ఆ ముసుగులో తాను నిబంధనలను ఉల్లంఘించిన నేరాన్ని కప్పిపుచ్చుకుంటున్నాడు. వీధులను శుభ్రం చేస్తున్నప్పుడు కొన్ని జీవులు సహజంగానే చస్తాయంటూ డ్రగ్స్‌తో సంబంధం ఉన్న నేరంమీద అమాయకులను సైతం కాల్చిపారేసిన గతాన్ని నిజం కాదంటున్నాడు. ఇప్పుడు ఆయన లాయర్ ఈ అరెస్టు అక్రమమంటున్నాడు కానీ, దేశ పాలకుడుగా తాను ఎంతటి అమానుషత్వానికైనా ఒడిగట్టవచ్చునని దుతర్తే స్వయంగా గతంలో పలుమార్లు చెప్పుకున్నాడు. 2016లో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు కావడానికి ముందు, దావౌనగర మేయర్‌గా ఉన్న కాలంలో డెత్‌స్క్వాడ్‌లను రహస్యంగా నిర్వహించాడు. కేసులు, విచారణలు, ఆధారాలతో నిమిత్తం లేకుండా, ఈ ప్రైవేటు సైన్యమే నేరగాళ్ళకు మరణశిక్ష విధించేది. తన హయాంలో నేరాలు తగ్గుముఖం పట్టాయని ప్రజలకు చూపించి, దేశాన్ని ప్రక్షాళించడానికి తనలాంటి హీరో అవసరమని ప్రజలను నమ్మించి అధ్యక్షుడైనాడు. దేశం మొత్తం తన అధీనంలోకి రావడంతో ముసుగులు కూడా అవసరం లేకపోయింది. మరిన్ని డెత్‌స్క్వాడ్‌లు తయారైనాయి. పోలీసులకు సర్వాధికారాలు ఇచ్చి, ప్రాణానికి ఇంత అంటూ వెలగట్టడంతో వారు అడ్డూఆపూ లేకుండా రెచ్చిపోయారు. అనుమానితులను తిరగబడేట్టుగా చేసి కాల్చిపారేయమని తానే చెప్పానని ఒక దశలో దుతర్తే గొప్పలకు పోయాడు. ఆయన ఆధ్వర్యంలో సాగిన మాదకద్రవ్యాలమీద యుద్ధంలో కనీసం ముప్పైవేలమంది మరణించారని అంచనా.

మానవహక్కుల ఉల్లంఘనలు, హత్యలపై ఐసిసి దర్యాప్తు ఆరంభించడంతో ఆయన 2019లో తన దేశాన్ని రోమ్ ఒప్పందంనుంచి బయటకు తెచ్చేశారు. ఐసిసికి విచారణార్హతలేదనో, పరిధి కాదనో ఆయన ప్రభుత్వం అడ్డుకుంటూ వచ్చింది. 2022 ఎన్నికల్లో కొత్తప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ మార్గాన్ని సుగమం చేయడంతో ఐసిసికి మళ్ళీ 2023జులైనుంచి దర్యాప్తు కొనసాగించే అవకాశం వచ్చింది. ఫిలిప్పీన్స్ అంతర్గత రాజకీయవైరాలు ఈ మాజీ అధ్యక్షుడి అరెస్టులో కీలకపాత్ర పోషించినమాట వాస్తవం. ప్రస్తుత అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్, దుతర్తే కుమార్తె సారా దుతర్తే కలసి 2022 ఎన్నికల్లో ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చారు. ఇటీవల ఈ రెండు కుటుంబాల మధ్యా చెడింది. అధ్యక్షుడినే హత్యచేయించడానికి ప్రయత్నించారన్న ఆరోపణతో సహా పలు అభియోగాలతో ఉపాధ్యక్షురాలిని అభిశంసించే ప్రక్రియసాగుతోంది. యుద్ధాలు చేస్తున్న పుతిన్, నెతన్యాహూలమీద కూడా అరెస్టువారెంట్లు జారీ చేసినా, వారిని పట్టితేలేకపోయిన ఐసిసికి దుతర్తే రాక కాస్తంత ఉపశమనం. గాజాలో మానవహననానికి పాల్పడిన నెతన్యాహూమీద అరెస్టువారెంట్ జారీచేయించినందుకు ఐసిసి చీఫ్ ప్రాసిక్యూటర్ కరీంఖాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలురకాల ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. దుతర్తేమీద విచారణ ఎన్ని సంవత్సరాలు సాగుతుందో, ఆయనకు ఏ శిక్షపడుతుందో తెలియదు కానీ, ప్రజల ప్రాణాలంటే విలువలేని, మానవహక్కులమీద గౌరవం లేని పాలకులకు ఇది ఒక హెచ్చరిక. అధికారంలో ఉండగా తిరుగులేదని, ఎదురులేదని విర్రవీగుతూ, చట్టవ్యతిరేకంగా వ్యవహరించేవారికి గుణపాఠం.

ఆ దోస్తీ భారత్‌కు మేలు చేసేనా?

ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి హక్కుల పత్రం మాగ్నాకార్టా అని విశ్వసిస్తారు. క్రీ.శ. 1215లో ఇంగ్లాండ్ రాజు దాన్ని అంగీకరించారు. ప్రపంచంలో మొట్టమొదటి పార్లమెంటుగా ఐస్‌లాండ్ దేశపు అల్థింగ్ అని భావిస్తారు. క్రీ.శ.1262లో ఈ తొలి పార్లమెంటు నేర్పాటు చేశారు. ప్రథమ ద్విసభీయ శాసన వ్యవస్థ చరిత్ర బ్రిటన్‌లో క్రీ.శ.1341లో ప్రారంభమయింది. ప్రథమ లిఖిత రాజ్యాంగం శాన్‌మరినో రిపబ్లిక్‌ది. క్రీ.శ.1600 సంవత్సరం నుంచి ఇది అమల్లో ఉంది. అధికారాల విభజనకు ప్రేరణ 'స్పిరిట్ ఆఫ్ లాస్'. ఫ్రెంచ్ తాత్వికుడు మోంటెస్క్యూ (1889–1775) రాసిన ఈ ఉద్గ్రంథం అమెరికా రాజ్యాంగ నిర్మాతలకు స్ఫూర్తినిచ్చింది. ఒక దేశ న్యాయ అధికారాలను మొట్టమొదట ఒక సుప్రీంకోర్టుకు అధీనం చేసిన దేశం అమెరికా. సెప్టెంబర్ 24, 1789న సమస్త న్యాయ అధికారాలను సుప్రీంకోర్టుకు అప్పగించారు.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

రాజ్యాంగబద్ధమైన చరిత్ర ఉన్నతమైన, ప్రశంసనీయమైన పాఠాలు అన్నీ అమెరికా రాజ్యాంగంలో నిర్దిష్టంగా పొందుపరిచారు. భారత రాజ్యాంగ నిర్మాతలతో సహా అనేక దేశాలలో అమెరికా రాజ్యాంగాన్ని అనుకరించారు. యుద్ధాలు, పేదరికం, వ్యాధుల ముప్పుకు ఆస్కారం లేని కొత్త ప్రపంచ వ్యవస్థను నిర్మించేందుకు అమెరికా నాయకత్వంలో స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక దేశాలు మానవాళికి వాగ్దానం చేశాయి. ఆ లక్ష్య పరిపూర్తిలో అవి చాలవరకు సఫలమయ్యాయి.

ఈ నేపథ్యంలో గత మూడు సంవత్సరాలలో, ముఖ్యంగా జనవరి 20, 2025 నుంచి సంభవించిన, సంభవిస్తున్న పరిణామాలు ప్రపంచ ప్రజలను దిగ్భ్రాంతి పరిచాయి. భావావేశాలకు లోను చేస్తున్నాయి. సహేతుకమైన ప్రతిస్పందనలవి. ఎందుకంటే గత మూడేళ్ల పరిణామాలు ప్రపంచానికి ఎనలేని ముప్పు కలిగించేవిగా ఉన్నాయి. స్వార్థపరత్వం రాజ్యమేలే, నిరంకుశాధికార వ్యవస్థలు ప్రబలిపోయేందుకు ఆ పరిణామాలు దోహదం చేసేవిగా ఉన్నాయి.

అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్ష పదవి మహాశక్తిమంతమైనది. నిర్దిష్టమైన అధికారాలు, ప్రత్యేక అధికారాలతో పాటు అనిర్ణీత అధికారాలు కూడా ఆ పదవికి ఉన్నాయి. పైగా అమెరికా ప్రపంచ అగ్రగామి సంపన్న దేశం అనే వాస్తవం ఆ పదవికి మరింత ప్రాధాన్యాన్ని కల్పిస్తుంది. ఆ అధికారాలను ఉపయోగించుకుని 19వ శతాబ్దిలో అధ్యక్షుడు విలియం మెక్ కిల్లే అమెరికాను భౌగోళికంగా విస్తరింపచేశాడు. ప్యూరిటోరికో, గువామ్, ఫిలిప్పీన్స్, హవాయిలను అమెరికాకు అనుసంధించాడు. ఇరవయో శతాబ్దిలో ఉడ్రో విల్సన్, ఫ్రాంక్లిన్ డి రూజ్వెల్ట్ లు వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేశారు. తమ కార్యనిర్వాహక అధికారాలను ఉపయోగించి విదేశీయులను నిర్బంధంలోకి తీసుకున్నారు. అలా అరెస్ట్ చేసిన వారిని బలవంతంగా స్వదేశాలకు పంపించివేశారు. రాజకీయ అసమ్మతివాదులను సైతం తీవ్రంగా అణచివేశారు. 21వ శతాబ్దిలో బరాక్ ఒబామా అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండానే లిబియాలో యుద్ధాన్ని ప్రారంభించాడు. యుద్ధ అధికారాల చట్టం–1973 కింద ఆయన స్వతంత్ర నిర్ణయం తీసుకున్నాడు ఇతర అధ్యక్షులు సైతం తమ పదవీ అధికారాల పరిమితులను తమ స్వతంత్ర నిర్ణయాలతో పరీక్షించారు. రాజ్యాంగ విరుద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం, చర్యలు చేపడుతూనే కాంగ్రెస్ అభిశంసన నుంచి తప్పించుకోగలిగారు.

అమెరికా అధ్యక్ష పదవి అధికారాలను మరే అధ్యక్షుడు కంటే ఎక్కువగా ఉపయోగించుకున్నది 47వ అధ్యక్షుడు డోనాల్డ్ జె ట్రంప్. గత ఎనిమిది దశాబ్దాలలో అమెరికా ఎన్నిమార్లు తన మామూలు విధానాలకు భిన్నంగా వ్యవహరించినప్పటికీ, ఎన్నిసార్లు దుస్సాహసాలకు పాల్పడినప్పటికీ స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక దేశాల నాయకుడుగా గౌరవాదరాలు పొందింది. సకల దేశాల ప్రజలు, ప్రభుత్వాలు ప్రపంచ వ్యవహారాలలో అమెరికా అధ్యక్షుడి మాటను, ఆమోదించినా, ఆమోదించకపోయినా, ప్రాధాన్యమిచ్చారు. ప్రపంచ వ్యవస్థ భద్రతకు హామీపడ్డ దేశం అమెరికా. ప్రపంచ శాంతి సంరక్షణకు, విద్యావ్యాసంగాల వికాసానికి, ఆరోగ్య భద్రతకు, మానవ హక్కుల పరిరక్షణకు అమెరికా ప్రభుత్వం ఎన్నో అంతర్జాతీయ సంస్థలను నెలకొల్పి, నిర్వహించింది. అయితే డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అధికారానికి వచ్చిన రెండు నెలల లోగానే అమెరికా ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలిగింది; ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సమితికి, యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీకి నిధులు నిలిపివేస్తామని, అసలు ఆ సంస్థ నుంచి ఉపసంహరించుకుంటామని అమెరికా బెదిరిస్తోంది. ట్రంప్ ఆదేశాల మేరకు ఇప్పటికే యుఎస్ ఎయిడ్‌ను మూసివేశారు. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సహాయ కార్యక్రమాల అమలు పూర్తిగా నిలిచిపోయింది. అలాగే నాటో నుంచి కూడా వైదొలుగుతామని, యూరోపియన్ మిత్ర దేశాలకు గతంలో వలే ఎటువంటి సహాయ సహకారాలు అందించే ప్రసక్తి లేదని ట్రంప్ మహాశయుడే స్వయంగా ప్రకటించాడు.

డోనాల్డ్ ట్రంప్ విచిత్రమైన వ్యక్తి. స్నేహితుడు శత్రువు అయిపోయాడు (ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ), శత్రువు మిత్రుడు కావచ్చు (రష్యా అధ్యక్షుడు పుతిన్). పొరుగు దేశం సువిశాల కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండాలని ఆయన ప్రగాఢంగా అభిలషిస్తున్నాడు. అమెరికాలో చేరమని గ్రీన్ ల్యాండ్‌కు బహిరంగంగా ఆహ్వానం పలికాడు. అంతటితో ఆగకుండా 'ఏదో ఒక విధంగా గ్రీన్ ల్యాండ్‌ను తమ దేశంలో కలుపుకుంటామని' నర్మగర్భితమైన హెచ్చరికను ట్రంప్ జారీ చేశాడు.

డోనాల్డ్ ట్రంప్‌కు అమెరికా ప్రయోజనాలే ముఖ్యం. శత్రువు (చైనా), మిత్రుడు (భారత్) మధ్య ఎటువంటి భేదాన్ని చూపరు. 'నేను నా జీవితమంతా ఎన్నో ఒప్పందాలు చేసుకున్నాను' అని ఆయన ఘనంగా చెప్పుకున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడిని చర్చలకు ఆహ్వానించి, అవమానపరిచి, పంపించివేసిన ట్రంప్ 'ఒప్పందానికి సిద్ధమయినప్పుడే మళ్లీ వైట్‌హౌజ్‌కు రండి' అని జెలెన్ స్కీని ఆహ్వానించాడు బహుశా, ఉక్రెయిన్‌లో లభించే అరుదైన ఖనిజ సంపద విషయమై ఒప్పందం కుదుర్చుకునేందుకు కాబోలు! రష్యాతో యుద్ధంలో సహాయపడుతున్నందుకు ఉక్రెయిన్ తన ఖనిజ సంపదను అమెరికాకు ఇవ్వాలన్నది ట్రంప్ వాదన మరి.



అమెరికా, రష్యా, చైనాలు ప్రపంచాన్ని 'ప్రభావ ప్రాంతాలు'గా విభజించి తమ ప్రాబల్యంలో ఉన్న ప్రాంతాలలోని సహజవనరులను దోపిడీ చేస్తాయి. ట్రంప్ సుంకాల సమరంతో నియమబద్ధ ప్రపంచ వాణిజ్యం తలకిందులవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ ధ్వంసమవుతుంది. స్వార్థపరుడు, అహంభావి అయిన ట్రంప్ తన విధానాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూలిపోయినా లెక్కచేయడు. మరో నాలుగు సంవత్సరాల పాటు ప్రపంచానికి అన్నీ కష్టాలే.

రాజనీతిజ్ఞతను వ్యాపార లావాదేవీగా మార్చి వేసిన ఘనత ట్రంప్‌దే అనడంలో సందేహం లేదు. అత్యంత శక్తిమంతమైన పదవిలో ఉన్న ఇటువంటి వ్యక్తితో ప్రపంచం ఏమవనున్నది? ట్రంప్ విధానాల పర్యవసానాలు మన దేశం విషయంలో ఎలా ఉంటాయి? ప్రపంచ స్థాయిలో చూస్తే నిరంకుశ పాలకులు అయిన ట్రంప్, పుతిన్, క్సీ జిన్‌పింగ్‌లు తమ ప్రయోజనాలకు ఏకమయ్యే అవకాశమున్నది. వారు తాము కోరుకుంటున్న ఇరుగు పొరుగు దేశాలను స్వాధీనం చేసుకునేందుకు తప్పక ప్రయత్నిస్తారు. ట్రంప్ ఇప్పటికే పనామా కాలువ, కెనడా, గ్రీన్‌ల్యాండ్, గాజాపై కన్ను వేశారు; ఇప్పటికే క్రిమియా, అబ్కాజియా, దక్షిణ ఒస్సెటియాను కలిపివేసుకున్న రష్యా ఉక్రెయిన్‌ను కైవశం చేసుకోవడానికే యుద్ధానికి దిగింది. బహుశా జార్జియాను కలిపివేసుకోవడానికి కూడా ప్రయత్నించవచ్చు. ఇక చైనా టిబెట్, హాంకాంగ్‌లను బలవంతంగా కలిపివేసుకుని ఇప్పుడు తైవాన్, భారత్‌లోని కొన్ని హిమాలయ ప్రాంతాలు, దక్షిణ చైనా సముద్రంలోని దీవులను కలిపివేసుకోవాలని ప్రగాఢంగా ఆకాంక్షిస్తోంది. దీన్ని ఆ దేశం ఏ మాత్రం దాచుకోవడం లేదు.

అమెరికా, రష్యా, చైనాలు ప్రపంచాన్ని 'ప్రభావ ప్రాంతాలు'గా విభజించి తమ ప్రాబల్యంలో ఉన్న ప్రాంతాలలోని సహజవనరులను ఉపయోగించుకుని ఆర్థికంగా బలోపేతమవుతాయి. ఈ దృష్ట్యా భారత్, చైనా దాడికి గురయ్యే అవకాశమున్నది. అరుణాచల్ ప్రదేశ్, ఇతర హిమాలయ ప్రాంతాలను చైనా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తే అమెరికా గానీ, రష్యా గానీ మనకు ఎటువంటి సహాయ సహకారాలు అందించవు. అమెరికా నుంచి మన దేశం మరింత ఎక్కువగా సైనిక సామగ్రిని కొనుగోలు చేసుకోవల్సిన అనివార్యత ఏర్పడుతుంది. అలాగే అమెరికా నుంచి మరిన్ని వస్తూత్పత్తులను స్వల్ప సుంకాలతో దిగుమతి చేసుకోవడానికి అంగీకరించవలసివస్తుంది. అమెరికా, రష్యాల సామరస్యం నెలకొంటే రష్యన్ చమురు సంపద మనకు చౌక ధరలకు ఇంకెంత మాత్రం అందుబాటులో ఉండదు. బ్రిక్స్, క్వాడ్ కూటమి నుంచి మనకు పెద్దగా తోడ్పాటు లభించకపోవచ్చు. అమెరికా మద్దతుతో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు భారత్‌కు వ్యతిరేకంగా తమ ద్వైపాక్షిక సంబంధాలను పటిష్ఠం చేసుకుంటాయి. ట్రంప్ సుంకాల సమరాన్ని పూర్తి స్థాయిలో ప్రారంభిస్తే నియమబద్ధ ప్రపంచ వాణిజ్యం తలకిందులవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ ధ్వంసమవుతుంది. జర్మనీ, ఫ్రాన్స్‌లు ఇప్పటికే గ్రహించినట్టుగానే భారత్ కూడా తనను తానే కాపాడుకోవల్సి ఉంటుంది. డోనాల్డ్ ట్రంప్ స్నేహం (దోస్తీ) భారత్‌కు బహుదా ఉపకరిస్తుందని నరేంద్ర మోదీ భావిస్తున్నారేమో కానీ అందుకు ఏ మాత్రం ఆస్కారం లేదు. ట్రంప్ స్వార్థపరుడు, అహంభావి. తన విధానాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూలిపోయినా ఆయన లెక్కచేయడు. మరో నాలుగు సంవత్సరాల పాటు ప్రపంచానికి అన్నీ కష్టాలే, సందేహం లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

బహుజన రాజ్యాధికార పథనిర్దేశకుడు

బహుజనుల సకల సమస్యల పరిష్కారం లక్ష్యంగా మహోద్యమాన్ని నడిపిన యోధుడు కాన్షీరామ్. 'ఓట్ హమారా – రాజ్ తుమారా, నహీ చలేగా.. నహీ చలేగా' అనే డైనమేట్ వంటి నినాదంతో, జిస్‌కా జిన్‌కా సంఖ్య భారీ, ఉస్‌కి ఉత్‌ని భాగ్యధారి అనే నినాదంతో సమాజంలోని 85 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలకు రాజ్యాధికారం దక్కాలనే సిద్ధాంత భూమికలో ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన గొప్ప వ్యూహకర్త కాన్షీరామ్.

1934 మార్చి 15న పంజాబ్ రాష్ట్రం, రోపార్ జిల్లా ఖవాస్‌పూర్‌లో ఉన్న పీర్థిపూర్ బంగ్లా గ్రామంలో ఒక చమార్ కుటుంబంలో కాన్షీరామ్ జన్మించారు. ఆయిదో సిక్కు గురు రాందాస్ చమార్‌లను సిక్కు మతంలోకి తీసుకువచ్చారు. వారిని రాందాసియాలు అనేవారు. కబీర్, రవిదాస్‌ల వంటి దళిత సాధువులతో ప్రభావితమైన ఖల్సా పంథ్, ఆర్యసమాజ్ ఉద్యమాల ప్రభావం చిన్ననాడే కాన్షీరామ్‌పై పడింది. పూణేలోని (ఈఆర్‌డిఎల్) ఎక్స్‌ప్లోజివ్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబరేటరీలో సైంటిస్ట్‌గా పనిచేస్తున్నప్పుడు అధికారులు బుద్ధ జయంతి, అంబేడ్కర్ జయంతి సెలవులను రద్దు చేయడంపై దళిత ఉద్యోగులు నిరసన తెలుపడంతో, అందులో రాజస్థానీ షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిని సస్పెండ్ చేయడంపై కాన్షీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్షీరామ్ ఆయన పక్షాన నిలిచి పోరాడారు. అది ఆయన దళిత ఉద్యోగుల ఉద్యమాన్ని నిర్మించేందుకు కారణమైంది. ఈ ఉద్యమం తీవ్రతరమై కాన్షీరామ్ ఏకంగా రక్షణ మంత్రి వై.బి.చవాన్‌ను కలిసి పరిస్థితి వివరించారు. చవాన్ మొత్తం ఉదంతంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించి సస్పెండయిన ఉద్యోగికి న్యాయం జరిగేలా చేశారు. దీనితో కాన్షీరామ్ దళిత ఉద్యోగులకు ఒక హీరోగా మారారు. ఈ సంఘటనే కాన్షీరామ్ జీవితాన్ని మార్చివేసింది. తన జాతి జనుల కోసం పాటుపడ్డ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల్ని కొనసాగించాలని, ప్రస్తుత సామాజిక వ్యవస్థపై తిరుగుబాటు చేయక తప్పదని నిర్ణయించుకున్నారు.



ఈ దేశాన్ని పాలించడమే లక్ష్యంగా రాజ్యాధికారం వైపు వెళితేనే బహుజనులకు భవిష్యత్తు ఉంటుందని స్పష్టంగా వివరించినవారు కాన్షీరామ్. ఆయన మరణించినా ఆయన ఆశయం మరణించలేదు.

1965 నుంచి 1971 వరకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను బలోపేతం చేయడానికి రాత్రి పగలు అకుంఠిత దీక్షతో కృషి చేశాడు. ఆర్పీఐలో వచ్చిన విభేదాలతో ఆయన పార్టీ నుంచి బయటకు వచ్చి తన ఉద్యమాన్ని కొనసాగించారు. బోధించు, పోరాడు, సమీకరించు నినాదంతో 1978 డిసెంబర్ 6న 'వెనుకబడిన కులాల, మైనారిటీ ఉద్యోగుల సమాఖ్య' (బామ్‌సెఫ్) స్థాపించారు. తాము పుట్టిన కులంలోని అట్టడుగున ఉన్న తమ సోదరుల కోసం తాము కొంత పాటుపడాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ కృషితో వచ్చిన రిజర్వేషన్ల వల్ల లాభం పొందిన వారిని ఏకం చేశారు. బామ్‌సెఫ్ నిర్వహణకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం తీవ్రంగా శ్రమించాడు. 'పే బ్యాక్ టు ద సొసైటీ' అనే నినాదంతో రాజకీయేతర పునాదులను పటిష్ఠం చేయడానికి బామ్‌సెఫ్ పనిచేసింది. దోపిడీకి గురౌతున్న సమాజానికి విద్యావంతులైన ఉద్యోగులు మేధస్సు, డబ్బు, ప్రతిభ అందించాలని, బామ్‌సెఫ్ నిర్మాణానికి ఈ మూడే చోదక శక్తులని కాన్షీరామ్ ప్రకటించాడు. బామ్‌సెఫ్‌ను కాన్షీరామ్ నిజమైన అంబేడ్కర్ మిషన్‌గా తీర్చిదిద్దాడు.

సామాజిక పరివర్తన ధ్యేయంగా 1981లో డిసెంబర్ 6న దళిత అణగారిన వర్గాల పోరాట సమితి (డీఎస్ 4) స్థాపించారు. ఉత్తర భారతదేశంలో ఒక సంచలనాత్మక సామాజిక విప్లవాన్ని సృష్టించారు. ఇందులో యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరారు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు 'సమానత్వం కోసం' సైకిల్ ర్యాలీ నిర్వహించిన కాన్షీరామ్ 1982లో హర్యానా, ఢిల్లీ, పంజాబ్, జమ్మూకాశ్మీర్ ఎన్నికల్లో సంస్థ పోటీ చేసింది. పోటీ చేసిన పార్టీలలో 4వ స్థానాన్ని సాధించింది. ఈ ఉత్సాహంతో కాన్షీరామ్ ఉత్తర భారతదేశమంతా పర్యటించి బహుజనులకు ఒక రాజకీయ పార్టీ అవసరాన్ని తెలియజేస్తూ సభలు నిర్వహించాడు. 1930లో డా. బి.ఆర్. అంబేడ్కర్ తొలిసారిగా ఓటు హక్కు లభించాక "మీరు వెళ్ళి మీ ఇంటి గోడలపై రాయండి, ఈ దేశానికి మేము పాలకులం కాబోతున్నాం" అని పేర్కొన్నారు. ఈ నినాదాన్ని తీసుకుని. మేధావులతో చర్చించి కాన్షీరామ్ పార్టీ పేరు, ఎన్నికల గుర్తు గురించి చర్చించి, ఏప్రిల్ 14, 1984న బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించారు. కాన్షీరామ్ ఏ కొత్త కార్యక్రమం మొదలుపెట్టినా అది అంబేడ్కర్ పుట్టిన రోజున గానీ, మరణించిన రోజున గానీ చేస్తారు. ఎందుకంటే ఆ రెండు రోజులు బహుజనులకు ప్రధానమైనవని ఆయన భావించేవారు. పూలే ఉద్యమం నుండి బహుజన్ సమాజ్ పేరును, అంబేడ్కర్ ఉద్యమం నుండి నీలిజెండా, ఏనుగు గుర్తును తీసుకున్నట్లుగా కాన్షీరామ్ ప్రకటించారు.

బహుజన సమాజ్ పార్టీని జాతీయ పార్టీగా తీర్చిదిద్దడంలో కాన్షీరామ్ నిరంతరం శ్రమించాడు. విజయం సాధించాడు. దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ఒక సామాన్య మహిళా, 'చమార్ స్త్రీని మూడుసార్లు ముఖ్యమంత్రిని చేసిన ఘనత పూర్తిగా కాన్షీరామ్‌దే. ఓట్ల రాజకీయాలను నోట్లు కలుషితం చేస్తూ కార్పొరేట్ రాజకీయాలు కొనసాగుతున్న తరుణంలో 'ఒక ఓటు ఒక నోటు' అనే నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్ళి వారిచ్చే డబ్బుతో ప్రచారం చేస్తూ ఉత్తరప్రదేశ్‌లో అధికారాన్ని సాధించి దేశ రాజకీయాలకు సరికొత్త విలువలు నేర్పిన మార్గదర్శకుడు కాన్షీరామ్. పదవులు ముఖ్యం కాదు బహుజన సమాజ్ నిర్మాణమే నా కర్తవ్యం అని భావించేవారు. 1994లో కోనేరు రంగారావు ఉపముఖ్యమంత్రి కాగలిగారంటే అందుకు కాన్షీరామ్ హైదరాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించిన శక్తి ప్రదర్శన ప్రధాన కారణం. 2003లో మెదక్ అసెంబ్లీ ఉపఎన్నికలలో బీఎస్‌పీ అభ్యర్థి పోటీ చేసినపుడు బహుజనులు ఏకమైతేనే ఈ నిచ్చనమెట్ల కుల వ్యవస్థను కూలదోయవచ్చని పిలుపునిచ్చారు.

దేశ రాజకీయాల్లో కాన్షీరామ్ ప్రవేశం గొప్ప సంచలనం. అంబేడ్కర్ కలలు నిజం చేయడానికి ముందుకురికిన రాజనీతిజ్ఞుడు. అన్ని రాజకీయ పార్టీలు వారి వారి పార్టీ స్థాపకుల ఫోటోలను వేదిక మీద ప్రదర్శిస్తుంటే కాన్షీరామ్ మాత్రం జాతిని చైతన్యపరిచిన బుద్ధుడు, పూలే, నారాయణగురు, పెరియార్, అంబేడ్కర్‌ల వంటి సామాజిక విప్లవకారుల చిత్రపటాలను బహిరంగ సభల్లో ప్రదర్శించేవారు. ఈ దేశాన్ని పాలించడమే లక్ష్యంగా రాజ్యాధికారం వైపు వెళితేనే బహుజనులకు భవిష్యత్తు ఉంటుందని స్పష్టంగా వివరించినవారు కాన్షీరామ్. ఆయన మరణించినా ఆయన ఆశయం మరణించలేదు.

• డాక్టర్ బోనకుర్తి సోమేశ్వర్
'పునాది' సెంటర్ ఫర్ రిసెర్చ్

(నేడు కాన్షీరామ్ జయంతి)

వరంగల్ విమానాశ్రయానికి భూపతి కృష్ణమూర్తి పేరు

తెలంగాణ గాంధీగా ప్రజలు పిలుచుకునే గొప్ప పోరాటశీలి భూపతి కృష్ణమూర్తి. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో క్రియాశీలకంగా పనిచేశారు. స్వాతంత్ర్యం అనంతరం జరిగిన తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లోనూ పాల్గొని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కనులారా చూసిన పోరాటయోధుడు. తన ఆస్తులను ఉద్యమాలకే ధారపోసిన ధీరోదాత్తుడు. ఆయన జీవితం అంతా పోరాటమే... బతుకంతా ఉద్యమాలే.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే శ్వాసగా పనిచేశారు భూపతి కృష్ణమూర్తి. హయగ్రీవాచారితో కలిసి ఓరుగల్లు కోట మీద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అదే సమయంలో రజాకార్ల దాష్టీకాన్ని కూడా చవి చూశారు. హైదరాబాద్ విమోచన పోరాటంలో చురుకుగా పాల్గొని అజ్ఞాత జీవితం గడిపారు. ఇడ్లీ సాంబార్ వ్యతిరేక ఉద్యమంలో కూడా క్రియాశీలకంగా పనిచేశారు. 1953–54 సంవత్సరంలో ఫజల్ అలీ కమిషన్ వరంగల్ వచ్చినప్పుడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం డిమాండ్‌ను బలంగా వినిపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సాధ్యం కాదేమోనని నమ్మకం సన్నగిల్లుతున్న సమయంలో యువకులు, మేధావి వర్గాలతో కలిసి తెలంగాణ ప్రజా సమితి ఏర్పాటుతో మరోసారి తెలంగాణ వాదులలో ఆశను రేకెత్తించారు.

1996 నవంబర్ 1న భూపతి కృష్ణమూర్తి అధ్యక్షతన వరంగల్‌లో ఒక సదస్సు జరిగింది. ఈ సదస్సులో కాళోజీ నారాయణరావు, కొండా మాధవరెడ్డి, ఆచార్య జయశంకర్, మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణతోపాటు అనేక మంది మేధావులు పాల్గొన్నారు. చిన్న హాలులో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు పెద్ద సంఖ్యలో తెలంగాణ వాదులు హాజరయ్యారు. ఈ సదస్సులో ప్రముఖులు చేసిన ప్రసంగాలు, తీర్మానాలు ఆనాటి ప్రభుత్వాన్ని కలవరపెట్టాయి. ఈ సదస్సు తర్వాతనే తెలంగాణ ఐక్యవేదిక, తెలంగాణ జనసభ లాంటి అనేక ఉద్యమ సంస్థలు ఏర్పాడ్డాయి అంటే ఈ సదస్సు ప్రభావం ఎంత ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

భూపతి కృష్ణమూర్తి గాంధేయవాది. 1944లో మహాత్మాగాంధీ జన్మదినోత్సవం సందర్భంగా అక్టోబర్ 2న వార్ధాకు వెళ్లి గాంధీతో పాటు పదిరోజులు అక్కడే గడిపే అరుదైన అవకాశం పొందారు భూపతి కృష్ణమూర్తి. కాంగ్రెస్ సిద్ధాంతాలను పల్లెపల్లెనా ప్రచారం చేయడంలో కీలకపాత్ర పోషించారు. వరంగల్ మున్సిపల్ కౌన్సిలర్‌గా; ఖాదీ బోర్డు ప్రచార కమిటీ సభ్యుడిగా; దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ సర్కిల్ సలహా మండలి సభ్యునిగా; విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల ఉపాధ్యక్షుడిగా, కాకతీయ విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యుడిగా... ఇలా తను పనిచేసిన ప్రతి పదవికీ వన్నె తెచ్చారు తెలంగాణ గాంధీ. సమాజంలో ప్రతి ఒక్కరికి ఆర్థిక పరిపుష్టి కలగాలనే ఆలోచనతో ముల్కనూరు కోఆపరేటివ్ సొసైటీ స్థాపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంతటి గొప్ప ఘన చరిత్ర కలిగిన మహనీయుడిని గౌరవిస్తూ వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేయబోయే విమానాశ్రయానికి భూపతి కృష్ణమూర్తి పేరు పెట్టాలి. భూపతి కృష్ణమూర్తి జయంతి, వర్ధంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి గౌరవించాలి.

– బుద్దా ప్రవీణ్

విద్యా సంక్షోభాన్ని కనీసం గుర్తించండి!

రాబోయే బడ్జెట్‌లో తెలంగాణలో గ్రామ గ్రామాన, పట్టణాలలోని వివిధ బస్తీలలోను విద్యకు పెద్దపీట వేయాలని గత నెల రోజులుగా విద్యార్థులు, తల్లిదండ్రులు రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డుల రూపంలోను సంతకాల సేకరణ ద్వారాను ప్రజా అభిప్రాయాన్ని సమీకరిస్తున్నారు. మరోవైపు విద్యా ప్రేమికులు, బుద్ధిజీవులు, ప్రొఫెసర్లు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, బాలల హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు, తల్లుల సంఘాలు... వీరంతా సభలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అంతేగాక తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో కమిషన్ సభ్యులు ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా కలిసి విద్యా వ్యవస్థ మెరుగు కోసం నిధులను పెంచవలసిన ఆవశ్యకత గురించి ఒక నివేదికను సమర్పించిన విషయం తెలిసిందే. ఈ మధ్య జరిగిన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ మరియు కమిషన్ సభ్యుడు రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పెద్దలు విద్య మీద చేస్తున్న ప్రకటనలు చూస్తే రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభంపై వారికి పూర్తిగా అవగాహన ఉన్నట్లు కనిపించదు. ప్రభుత్వ విద్య నిర్వీర్యం కావడానికి గత కొన్నేళ్ళుగా బడ్జెట్లలో దానికి సరిపడా నిధులు కేటాయించకపోవడమే కారణం అని ప్రభుత్వం ఇకనైనా గుర్తించాలి.

ప్రభుత్వ విద్య బాగుపడే పరిస్థితి కానీ బాగుపరిచే రాజకీయ సంకల్పం కానీ కనుచూపు మేరలో కనిపించకనే పేద తల్లిదండ్రులు ప్రైవేటు బడుల బాట పట్టారనటానికి ప్రభుత్వ గణాంకాలే ఋజువు. 2023–24 యుడైస్ లెక్కల ప్రకారం ప్రభుత్వ బడిలో కేవలం 26 లక్షల మంది (43శాతం) విద్యార్థులు చదువుతుంటే, ప్రైవేటు బడులలో 34లక్షల మంది (57శాతం) చదువు"కొంటున్నారు". అదే ఏడాది ఒకటవ తరగతి చేరికలు చూసినట్లయితే దాదాపు 66శాతం మంది విద్యార్థులు ప్రైవేటు బడులలో చేరారు. ఇక పట్టణాలలో విపరీతంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ బడులను ఏర్పాటు చేయకపోవడం వల్ల హైదరాబాద్‌లో 81శాతం, మేడ్చల్‌లో 85శాతం, రంగారెడ్డిలో 70శాతం మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇలా ప్రైవేటు బడులకు పంపుతున్నవారిలో అధికశాతం ఆర్థికంగా బలంగా ఉన్న కుటుంబాలు కావు.

ఈ ధోరణి ఒక్క రోజులో మారింది కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నుండే మొదలైంది. రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా కొనసాగుతున్నది. దీనికి రుజువు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతి ఏటా తగ్గింపులే. తెలంగాణ ఏర్పడిన మొదటి సంవత్సరం విద్యకు 10శాతం కేటాయించారు. అలా మొదలైన తగ్గింపు, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ గత తొలి బడ్జెట్ వరకు కొనసాగుతూనే ఉన్నది. తక్కువ నిధుల వల్ల విద్యా ప్రమాణాలు మరింతగా దిగజారుతున్నాయి.

గత సంవత్సరం బడ్జెట్ (2024–25)లో విద్యకు రూ.21,292వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది బడ్జెట్‌లో 7.3శాతం మాత్రమే. ఇందులో పాఠశాల విద్యకు కేటాయించింది రూ.17,942వేల కోట్లు (6.2శాతం) మాత్రమే. ఇన్ని వేల కోట్లు కేటాయించినట్లు కనిపించినా అందులో దాదాపు రూ.15వేల కోట్లు సిబ్బంది జీతాలకే ఖర్చు అవుతున్నాయి. ఇక మౌలిక సదుపాయాల కల్పనకు, పర్యవేక్షణకు, పాఠశాలలో వినూత్న ప్రయోగాలకు, పోటీ ప్రపంచంలో అవసరమైన కంప్యూటర్‌లకు, కృత్రిమ మేధకు సంబంధించిన పాఠ్యాంశాల బోధనకు సరిపడా నిధుల కొరత స్పష్టంగా కనిపిస్తున్నది.

పోనీ ఇన్ని వేల కోట్ల జీతాలు చెల్లిస్తున్న ఉపాధ్యాయులతో కేవలం బోధనే చేయిస్తున్నారా అంటే అదీ లేదు. వారికి పలు బోధనేతర పనులు అప్పగిస్తున్నారు. ఇక పర్యవేక్షణ అధికారులు సంవత్సరాల తరబడి లేరు. ఉన్న ప్రధాన ఉపాధ్యాయులకు బోధన పని నుంచి ఉపశమనం కల్పించి పర్యవేక్షణ అధికారిగా అదనపు డ్యూటీ వేశారు. ఇవిగాక పదవీ విరమణ పొందిన టీచర్ల స్థానంలో మరో టీచర్ రావడంలో జాప్యం, వెనుకబడిన ప్రాంతాలలో ఉపాధ్యాయుల కొరత, గ్రామంలో ఉన్న విద్యార్థులకు అనుగుణంగా కాకుండా తగ్గిన విద్యార్థుల నమోదును బట్టి టీచర్ల నియామకం వంటి సమస్యలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో విద్య గురించి చర్చ జరిగినప్పుడల్లా రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చర్చను అటువైపు మళ్లించేది. ప్రస్తుత ప్రభుత్వం కూడా 20 ఎకరాలలో ఒక్కో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటిస్తున్నాయి. పనులు సాగుతున్నాయి కూడా. దాదాపు 1000 గురుకుల పాఠశాలలు కల్పించిన మాట వాస్తవమే. కానీ విద్యార్థులకు విద్యను అందించడానికి గురుకుల పాఠశాలలు ప్రత్యామ్నాయం కాదని పాలకులు గుర్తించాలి. కుటుంబంలో మొదటితరం చదువు వైపు వచ్చిన విద్యార్థులకు, ఆదరణ కరువైన పిల్లలకు గురుకులాలు నిర్వహించాలి. అంతే కానీ రాష్ట్రంలో ఉన్న 60 లక్షల మంది పిల్లలకు విద్యను అందించే సామర్థ్యం వాటికి లేదు.


అంతకంతకూ తగ్గుతున్న బడ్జెట్ కేటాయింపులను బట్టి ప్రభుత్వం తమ పిల్లలకు చదువు చెప్పదలచుకోవడం లేదన్న అభిప్రాయానికి సమాజం చేరుకున్నది. అందువల్ల ప్రైవేటు బడులవైపు మొగ్గుచూపక తప్పలేదు. స్తోమత ఉన్నవాళ్ళకు ప్రైవేటు బడులతో ఇబ్బంది లేదు. కానీ రోజు కూలీలు, చిన్న వ్యవసాయ కుటుంబాల వారు, కౌలు రైతులు, పట్టణాలలో పేద బస్తీలలో నివసించే అసంఘటిత రంగ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలలో ఉన్న అతి పేదలు తల తాకట్టు పెట్టి మరీ తమ పిల్లలను ప్రైవేటు బడులకు పంపిస్తున్నారు. జూన్ నెల రాగానే కుటుంబాలలో ఒక గుబులు. పోయిన సంవత్సరం ఫీజుల బాకీతో సహా ప్రస్తుత సంవత్సరం ఫీజులు కట్టాలనే ఒత్తిడి. అందరి ముందూ పిల్లలను అగౌరవపరిచే ప్రైవేటు బడుల దుస్సంప్రదాయాలు. ఇవన్నీ భరిస్తూ ఆ పేద కుటుంబాలు ఒక్కో విద్యార్థి మీద పెడుతున్న ఖర్చు లెక్కేస్తే ప్రభుత్వ విద్యా బడ్జెట్ కన్నా అధికంగానే ఉంటుంది. ఇన్ని కష్టాలు పడినా ప్రైవేట్ బడులలో నాణ్యమైన విద్య అందుతుందా అంటే అదీ లేదు!

జూన్ నెల రాగానే కుటుంబాలలో ఒక గుబులు. పోయిన సంవత్సరం ఫీజుల బాకీతో సహా ప్రస్తుత సంవత్సరం ఫీజులు కట్టాలనే ఒత్తిడి. అందరిముందూ పిల్లలను అగౌరవపరిచే ప్రైవేటు బడుల దుస్సంప్రదాయాలు. ఇవన్నీ భరిస్తూ ఆ పేద కుటుంబాలు ఒక్కో విద్యార్థి మీద పెడుతున్న ఖర్చు లెక్కేస్తే ప్రభుత్వ విద్యా బడ్జెట్ కన్నా అధికంగానే ఉంటుంది. ఇన్ని కష్టాలు పడినా ప్రైవేట్ బడులలో నాణ్యమైన విద్య అందుతుందా అంటే అదీ లేదు!



రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు బడ్జెట్లలో సరిపడా నిధులు కేటాయించకపోవటం వల్ల విద్యా వ్యవస్థ నేడు అతిపెద్ద సంక్షోభ దశకు చేరుకున్నది. ఈ సంక్షోభం నుండి బయటపడడానికి, తల్లిదండ్రులలో ప్రభుత్వ విద్య పట్ల సన్నగిల్లిన విశ్వాసాన్ని పెంచడానికి, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు 15శాతం బడ్జెట్‌ను కేటాయిస్తామన్న తమ హామీని నిలబెట్టుకోవాలి. 2025–26 బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేసి విద్య పట్ల రాజకీయ సంకల్పాన్ని ఋజువు చేసుకోవాలి.

▪ ఆర్. వెంకట్ రెడ్డి
జాతీయ కన్వీనర్, ఎం.వి. ఫౌండేషన్


పసుపు కుంకుమలతో భద్రకాళి అమ్మవారు


కేయూలో..


వరంగల్ నగరంలో

హోలీ వేడుకల్లో పోలీస్ కమిషనర్

వరంగల్‌లో

కేయూలో ..

హే.. రంగులే..

జిల్లాలో జాలీగా హోలీ

- ఊరూవాడా, కాలనీల్లో సంబరాలు
- ఉత్సాహంగా పాల్గొన్న యువత, చిన్నారులు
- వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, సీపీ, ఇతర శాఖల అధికారులు

పాల్గుణ శుద్ధ పౌర్ణమి వేళ శుక్రవారం వసంత కేళి హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. రంగుల పండుగను వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఎక్కడా చూసినా సప్తవర్ణాల శోభితమై సలక్షణ వసంత శోభ కొట్టొచ్చినట్లు కానవచ్చింది. మహిళలు, చిన్నారులు, యువత హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. పలు కాలనీల్లో ప్రజలు కేరింతలు కొడుతూ రంగులు చల్లుకున్నారు. వరంగల్ నగరంలో గురువారం అర్ధరాత్రి జరిగిన కామ దహనం అనంతరం హోలీ సంబరాలు ప్రారంభమయ్యాయి. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద జంక్షన్ల వద్ద, ఇళ్ల ముంగిట రహదారులపైన ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ వేడుకలు జరుపుకున్నారు.

- హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్

6


పూజలందుకుంటున్న కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి

నమో.. నారసింహా..

- వైభవంగా సాగుతున్న కొమ్మాల జాతర
- పోటెత్తిన భక్తులు.. పెద్దఎత్తున మొక్కులు
- పోటాపోటీగా రాజకీయ ప్రభ బండ్లు
- కోలాటం, లంబాడీల నృత్యంతో పరవశం
- గోవింద నామస్మరణతో ఉప్పొంగిన భక్తిభావం

7





తాళి చూపిస్తున్న అర్చకులు, ఉత్సవమూర్తిగా వెంకన్నస్వామి

వెంకన్న పెళ్లికొడుకాయెనే..

- కన్నుల పండువగా వెంకటేశ్వరస్వామి కల్యాణం
- వైభవంగా ప్రారంభమైన ఎర్రగట్టు జాతర
- ఊరేగింపుగా చేరిన ఉత్సవమూర్తుల ప్రతిమలు
- గోవింద నామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు.. కొనసాగిన మొక్కులు

7



నేటి నుంచి ఒంటిపూట బడులు

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు..

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో ఒంటి పూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు అనుగుణంగా జిల్లాల్లోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలను నిర్వహించనున్నారు. కాగా, విద్యార్థులకు 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందించిన తర్వాతనే వారికి ఇళ్లకు పంపిస్తారు. విద్యాసంవత్సరం చివరి రోజైన ఏప్రిల్ 23 వరకు ఒంటి పూట బడులే కొనసాగనున్నాయి. ఇక పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన తర్వాత పరీక్ష కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒంటి పూట బడులను అన్ని యాజమాన్య పాఠశాలలు తప్పక నిర్వహించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని వరంగల్, హనుమకొండ డీఈవోలు ఎం.జ్ఞానేశ్వర్, డి.వాసంతి హెచ్చరించారు.


బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ స్థలపరిశీలన చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రజతోత్సవ సభ కోసం స్థలాల పరిశీలన

నేతలకు సూచనలు చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు

హనుమకొండ టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 27న వరంగల్ నగరంలో నిర్వహించే బీఆర్ఎస్ 25 ఏళ్ల రజతోత్సవ భారీ బహిరంగ సభ ఏర్పాట్ల కోసం పలు స్థలాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు పరిశీలించారు. ముఖ్యంగా హనుమకొండలోని దేవన్నపేట శివారుతో పాటు ఉనికిచర్ల, భట్టుపల్లి స్థలాలను సభాస్థలి కోసం పరిశీలన చేశారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా చూడాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నాయకులకు, పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లపై పార్టీ నేతలతో చర్చించి బహిరంగ సభకు అవసరమైన మార్పులు చేర్పులు చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డి సస్పెన్షన్ అన్యాయం

- కాజీపేటలో బీఆర్ఎస్ నాయకుల నిరసన
- సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు


రోడ్డుపై ఆందోళన చేస్తున్న నాయకులు

కాజీపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడానికి బీఆర్ఎస్ నాయకులు యత్నించారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు శివకుమార్, నవీన్‌కుమార్‌లు బీఆర్ఎస్ నాయకుల ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం నాయకులను అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నార్లగిరి రమేశ్, జనార్ధన్ గౌడ్‌లు మాట్లాడుతూ.. అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా ఉండేందుకు జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను రాష్ట్రంలో 90శాతం ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రజలికిచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రజాపోరాటం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ అర్బన్‌జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.డి. అఫ్జల్, పాలడుగుల శివకుమార్, కాటాపూర్ రాజు, బరిగెల వినయ్, ఎస్కే మహమూద్, కుమ్మరి కోటిలింగం, తేలు సారంగపాణి, ఎం.డి. సోని, సుంచు రఘురాం, దువ్వ కిట్టు, నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు.

ఎల్ఆర్ఎస్.. ఎంతో ఆలస్యం..

రాయితీ ప్రకటనతో పెరుగుతున్న దరఖాస్తులు

- హెల్ప్‌డెస్క్‌లో సరిపడా సిబ్బంది లేక ఇబ్బందులు
- సర్వర్ బిజీతో సాగని దరఖాస్తుల పరిశీలన
- అవగాహన కల్పించడంలో బల్దియా విఫలం
- ఇంకా 84,404 పెండింగ్‌లో దరఖాస్తులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 14: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31 వరకు 25శాతం ఫీజులో రాయితీతో ఇటీవల మున్సిపాలిటీలలో ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీం) దరఖాస్తుదారుల స్వీకరణ వరంగల్ బల్దియాలో అంతంత మాత్రంగానే ఉంది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన 12 హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినప్పటికీ మోక్షం కలగడం లేదు. అక్కడ సరిపడా సిబ్బందిని నియమించకపోవడంతో దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరుగుతోంది. ఆన్‌లైన్‌లో వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు బల్దియా కార్యాలయంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా ప్రజలు బల్దియాలోని హెల్ప్ డెస్క్ ముందు బారులు తీరుతున్నారు. ఇప్పటి వరకు 25,285 దరఖాస్తులు పరిశీలించినట్టు టౌన్‌ప్లానింగ్ అధికారులు వెల్లడించారు. ఇంకా 84,404 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి.

మూడు శాఖల ఆధ్వర్యంలో..

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం మూడు శాఖలను సమన్వయం చేస్తోంది. ఎల్-1లో బల్దియా, రెవెన్యూ, ఇ రిగేషన్ సిబ్బంది పని చేస్తుండగా ఎల్-2 లో ఏసీపీ, టీపీవోలు, టీపీబీవోలు పనిచేస్తున్నారు. ఎల్-3లో ఫైనల్‌గా కమిషనర్ అప్రూవ్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం బల్దియా పరిధిలో 12 టీములు పని చేస్తున్నాయి. 7 హనుమకొండ, 5 వరంగల్ ప్రాంతంలో పని చేస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న భూమి పట్టా, ప్రభుత్వ భూమా? లేక చెరువు శిఖం, కెనాల్ కింద ఉందా? అని అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేసి అనుమతులు ఆమోదం తెలుపాల్సి ఉంటుంది.



హెల్ప్ డెస్క్ ముందు బారులు తీరిన ప్రజలు

సాంకేతిక లోపంతో పనులకు బ్రేక్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు మూడు స్థాయిలలో పరిశీలన జరిపిన తర్వాత ఫీజు చెల్లించేందుకు గ్రీన్‌సిగ్నల్ వస్తుంది. కానీ బల్దియా పరిధిలోని బల్దియా, కాజీపేట, నక్కలగుట్ట, కాశిబుగ్గ, నయీంనగర్‌లో హెల్ప్‌డెస్క్ నుంచి అధికారుల వరకు అందరి కంప్యూటర్లలో సైట్ రాకుండా సాంకేతిక సమస్య వస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక అప్లికేషన్ పరిశీలించాలంటే కనీసం పది నిమిషాలు పడుతుందని, సర్వర్ బిజీగా ఉండడంతో ఇబ్బంది ఎదురవుతోందని నిర్లిప్తత వ్యక్తం చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వం కోట్ల రూపాయలు వసూలు చేసి ఖజానా నింపుతున్నా.. కనీసం ఐటీ నిపుణులు సైట్ సమస్యను పరిశలించకపోతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. అయితే దరఖాస్తులలో ఇప్పటి వరకు కనీసం పది శాతం కూడా పరిశీలన పూర్తి కాకుండానే ముగింపు గడువు ప్రకటించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సుమారు 99 వేలకు పైగా దరఖాస్తులు పరిశీలించాలంటే కనీసం మరో రెండేళ్లు పడుతుందని, ఫీజు రాయితీతో పాటు గడువును పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ఎంపికైన క్రీడాకారులతో కేయూ స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

ఇంటర్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మార్చి 14 నుంచి 16 వరకు కర్ణాటకలోని బెంగళూరు నార్త్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రీడాపోటీలకు కేయూ పురుషుల బాల్ బ్యాడ్మింటన్ జట్టును 2024-25 ఏడాదికి ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఫిజికల్ డైరెక్టర్ పి. మధు వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి. రామచంద్రం, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి14(ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16తేదీల్లో హనుమకొండ జేఎన్ఎస్‌లో రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలను నిర్వహించనున్నట్లు టెన్నికాయిట్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు అల్వాల రాజ్‌కుమార్, గోకారపు శ్యామ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో నిర్వహించనున్న టెన్నికాయిట్ పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 300మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు వారు వెల్లడించారు. ఈ క్రీడా పోటీలను హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీ పసునూరి దయాకర్‌లు ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

హైదరాబాద్‌లో రోజా క్రియేషన్స్ వేడుకలు

హనుమకొండ కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కళా సంస్థల్లో పేరున్న రోజా క్రియేషన్స్ ఈసారి తన వేడుకలను హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు రోజా క్రియేషన్స్ డైరెక్టర్ ఆలేటి శ్యామ్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించే ఈ వేడుకల్లో భిన్న రంగాలకు చెందిన పలువురిని అవార్డులతో సత్కరించనున్నట్లు చెప్పారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె.అరుణ, బీజేపీ స్పోక్ పర్సన్ బండారు విజయలక్ష్మి, డాక్టర్ శిల్పారెడ్డి, డాక్టర్ సతమ, ఖిలారి నీలిమా తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి..

విద్యుదాఘాతంతో రైతు మృతి



సురేష్ (ఫైల్)

సంగెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. గ్రామస్థులు, ఎస్సై నరేష్ అందించిన వివరాల ప్రకారం.. మండలంలోని వీఆర్ఎన్ తండాకు చెందిన గుగులోత్ సురేష్ (28) తన ఎకరం భూమిలో మొక్కజొన్న వేశాడు. పంటకు నీరు పెడుతుండగా విద్యుత్ మోటారు ఆగిపోయింది. ఫ్యూజులను తనిఖీ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో పడిపోయాడు. గమనించిన తోటి రైతులు సురేష్‌ను చికిత్స కోసం 108 వాహనంలో ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. సురేష్ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

హోలీ.. రంగుల కేళీ

అంబరాన్నంటిన రంగుల సంబరం

- ఆనందోత్సవాల మధ్య వేడుకలు
- రంగులతో చిందేసిన యువత, చిన్నారులు
- హోలీ వేడుకల్లో పాల్గొన్న అధికారులు



బ్రాహ్మణవాడలో హోలీ వేడుకలు



హోలీ వేడుకల్లో మహిళలు





హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వసంతం వేళ హోలీ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారుల నుంచి మొదలుకొని పెద్దల వరకు వయసు తారతమ్యం లేకుండా ఆనందోత్సవాల మధ్య రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొని హోలీ వేడుకలను జరుపుకున్నారు. ప్రెస్‌క్లబ్‌లో జరిగిన వేడుకల్లో రాష్ట్ర ఆర్థిక కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పాల్గొని నృత్యాలు చేశారు. అలాగే పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి పాత్రికేయులు హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు పరస్పరం రంగులు చల్లుకోవడమే కాక పోలీసు బ్యాండ్ మేళ నృత్యాల మధ్య కమిషనరేట్ ప్రాంగణం హోలీ వేడుకలతో దద్దరిల్లింది. అనేక మంది పోలీసు అధికారులు సీపీకి రంగులు చల్లి స్వీట్లు తినిపించారు. జిల్లా కలెక్టర్ అధికార నివాసంలో కలెక్టర్ ప్రావీణ్య తనను కలిసేందుకు వచ్చిన అధికారులతో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని 273ప్లాట్లు ఉన్న జీఎంఆర్ఎ బృందావన్ అపార్ట్‌మెంట్‌తో పాటుతో నగరంలోని అన్ని అపార్ట్‌మెంట్లలో హోలీ వేడుకలను ఉల్లాసంగా జరుపుకున్నారు. అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, కార్యదర్శి స్వర్ణకుమార్, నవీన్ కుమార్‌తోపాటు మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.అనితారెడ్డి బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రం ఆనంద నిలయం పిల్లలతో హోలీ వేడుకల్లో పాల్గొని స్వీట్లు పంపిణీ చేశారు. వరంగల్ నగరంలోని కళాకారులు ఈసారి ఐక్యంగా హోలీ వేడుకల్లో పాల్గొనడం విశేషం. జేబీ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు జడల శివ, తదితర కళాకారులంతా హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నగర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో, ప్రసిద్ధ సిద్దేశ్వరాలయంలో సప్తవర్ణాలతో అలంకరించిన రుద్రేశ్వరుడు, సిద్ధేశ్వరుడు భక్తులకు కనువిందు చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం, నిట్‌లలో పెద్దఎత్తున హోలీ వేడుకలు జరిగాయి.

- వరంగల్ జిల్లా వ్యాప్తంగా పాల్గుణ పౌర్ణమి శుక్రవారం హోలీ పర్వదినం సందర్భంగా ప్రజలందరూ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. పలు డివిజన్లలో ప్రధాన ప్రాంతాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. వరంగల్ స్టేషన్ రోడ్డులోని బ్రహ్మకుమారి సమాజ్ పక్కన ఖాళీ స్థలంలో మార్వాడీలు వేడుకలు నిర్వహించుకున్నారు. వరంగల్ పిన్నవారివీధి, ఎల్లంబజార్, జేపీఎన్‌రోడ్డు, దుర్గేశ్వరాలయం వీధి, వరంగల్ చౌరస్తా, పాత బీట్ బజార్, శ్రీకృష్ణ కాలనీ, స్టేషన్‌రోడ్డు, కూరగాయల మార్కెట్, ఓసిటీ, కాశిబుగ్గ, ఎల్బీనగర్, తిలక్‌రోడ్డు, పోచమ్మ మైదాన్, కొత్తవాడ, బ్యాంకు కాలనీ, మట్టెవాడ, చమన్, రాజీవ్‌కాలనీ, రామన్నపేట, పాపయ్యపేట, బట్టల బజార్, శివనగర్, ఎస్ఆర్ఆర్‌తోట, కరీమాబాద్, ఉర్సు, రంగశాయిపేట, ఖిలా వరంగల్, లేబర్ కాలనీ, అన్ని ప్రాంతాల్లో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. యువత చిందులేస్తూ రంగులు నింపిన పైపులతో రంగులు చల్లుకున్నారు. యువతీ, యువకులు స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. రంగుల అమ్మకాలతో వ్యాపారాలు కళకళలాడాయి.

మంత్రిని కలిసిన కార్యకర్తలు

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగులు వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ వేడుకల్లో కలెక్టర్ సత్యశారద కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. పలు డివిజన్లలో కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వేడుకలు జరుపుకున్నారు. పండుగ సెలవు దినం కావడంతో వ్యాపార సంస్థలు మూసివేయడంతో నగరంలోని దారులన్నీ బోసిపోయి కనిపించాయి.హోలీ సందర్భంగా నగరంలోని దేవాలయాల్లో పౌర్ణమి ప్రత్యేక పూజలు జరిగాయి. దత్తక్షేత్రంలో హోమం, కుంకుమ పూజలు నిర్వహించి దేవతామూర్తులకు బిస్కెట్ల దండలు వేశారు.





నయీంనగర్‌లో హోలీ ఆడుతున్న మహిళలు, కాకతీయ యూనివర్సిటీలో హోలీ వేడుకలు జరుపుకుంటున్న యువతులు

యువకుడి దారుణ హత్య

- కత్తితో పొడిచిన దుండగులు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- హత్యకు వివాహేతర సంబంధమే కారణమా?
- పోలీసుల అదుపులో నిందితులు
- జనగామ జిల్లా తీగారంలో ఘటన
- హోలి పండుగ వేళ విషాదం



ప్రవీణ్ (ఫైల్)

జఫర్‌గడ్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలంలోని శుక్రవారం యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. విచక్షణారహితంగా కత్తితో దాడి చేయడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. దాంతో పండుగవేళ జిల్లాలో పెనువిషాదం నెలకొంది. బాధిత కుటుంబం, స్థానికుల కథనం ప్రకారం. గోనె యాదగిరికి ఇద్దరు కుమారులు. భార్య ఎనిమిదేళ్ల క్రితం చనిపోయింది. చిన్న కుమారుడు గోనె ప్రవీణ్(28) టెన్త్ వరకు చదువుకుని వ్యవసాయం చేసుకుంటూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. శుక్రవారం గడ్డి కోసుకువస్తానని తండ్రికి చెప్పి మధ్యాహ్నం శివారులోని తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. వ్యవసాయ పనులు చేసుకుంటుండగా సాయంత్రం 4గంటల సమయంలో మూడు బైకులపై సుమారు ఐదుగురు యువకులు అక్కడికి వచ్చారు. ప్రవీణ్‌తో ఏదో మాట్లాడుతూ.. అకస్మాత్తుగా గొడవపడ్డారు. ఇంతలోనే ఒకరు కత్తితో శరీరంపై పలు చోట్ల పొడిచాడు. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల రైతులు కేకలు వేయడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. పోట్లతో తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో ఉన్న ప్రవీణ్‌ను హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతిచెందాడు. దాడికి పాల్పడిన వారు ఇదే మండలం తమ్మడపల్లి(ఐ) గ్రామానికి చెందిన వారుగా అనుమానిస్తున్నారు.

వివాహేతర సంబంధమే కారణమా?

హత్యకు గురైన గోనె ప్రవీణ్ అవివాహితుడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బానోత్ రాంచరణ్‌నాయక్ నేతృత్వంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వివాహేతర సంబంధమే కారణంగా అనుమానిస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు విచారణలో తేలుతాయని పోలీసులు వెల్లడిస్తున్నారు.

చేపల వల చుట్టుకొని..

చెరువులో మునిగి మత్స్యకారుడి మృతి




చెరువు నుంచి వెంకన్న మృతదేహాన్ని బయటకు తీస్తున్న మత్స్యకారులు

రాయపర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. ఎస్సై శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మత్స్యకారుడు బాద వెంకన్న(39) గురువారం రాత్రి గ్రామ శివారులో సర్వాలకుంటలో చేపలు పట్టేందుకు మిత్రులతో కలిసి వెళ్లాడు. చెరువులో వల వేసి బయటకు వచ్చే క్రమంలో వల చుట్టుకొని నీళ్లలో మునిగిపోయాడు. ఒడ్డుకు చేరుకున్న మిత్రులు వెంకన్న బయటికి రాకపోవడంతో చెరువులో గాలించగా ఆయన మృతదేహం దొరికింది. వెంకన్న భార్య అనిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈ రవీందర్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి

మరొకరికి గాయాలు



బాబు మృతదేహం

సంగెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బొలెరో వాహనం ఢీకొని ఒకరు మృతి, మరొకరికి గాయాలైన సంఘటన శుక్రవారం మండల కేంద్రం సమీపంలో జరిగింది. మండల కేంద్రంలో నివసిస్తున్న తాపీ మేస్త్రీ తన మిత్రుడితో కలిసి మండలంలోని తిమ్మాపురంలో పని ముగించుకొని బైక్‌పై సంగెంకు వస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వరంగల్ నుంచి తిమ్మాపురం వైపు వెళ్తున్న వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామానికి చెందిన కోయ బండారు బాబు(34) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదే జిల్లా ఉలవపాడు గ్రామానికి చెందిన పులగర శివమణికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు శివమణిని 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. ఎస్సై నరేష్ బండారు బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎంజీఎంకు తరలించారు. బాబు భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సీసీ పుటేజీల ద్వారా బొలెరో వాహనాన్ని గుర్తించినట్లు ఎస్సై చెప్పారు. బాబుకు ఇద్దరు పిల్లలున్నారు.

అటల్ జీ యాదిలో ఆత్మీయ సమ్మేళనం

హనుమకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 16వ తేదీన ఉదయం 11 గంటలకు హనుమకొండ హంటర్‌రోడ్డులోని డి కన్వెన్షన్ హాల్‌లో 'అటల్ జీ యాదిలో' ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ హాజరవుతారని ఆయన తెలిపారు. వాజ్‌పేయి సుదీర్ఘ రాజకీయ, పరిపాలనలో ఆయనతో కలిసి ప్రయాణించినవారు, ఆయన ఆశయాలను కొనసాగిస్తున్నవారు, ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారని తెలిపారు. ఆరు జిల్లాల బీజేపీ అధ్యక్షులు, ఈ కార్యక్రమ జిల్లా కన్వీనర్లు, కో కన్వీనర్లు కూడా పాల్గొంటారని చెప్పారు. వాజ్‌పేయి వరంగల్‌ను సందర్శించిన సందర్భంగా తీసిన నాటి ఫొటోలు, అయనతో జిల్లాలోని బీజేపీ నేతలు దిగిన ఫొటోలు, నాటి గుర్తులను తెలియచేసే ఇతర ఛాయాచిత్రాలను ఈ సందర్భంగా ప్రదర్శిస్తారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, డీసీపీ

సీఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు

- సభకు 50వేల మంది వచ్చే చాన్స్
- భారీ పోలీసు బందోబస్తు నిర్వహించాలి..
- ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలి..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- కలెక్టర్, డీసీపీతో కలిసి సభాస్థలి పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారని, పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ మండల పరిధిలోని పాలకుర్తి రోడ్డులో సీఎం సభాస్థలిని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌లతో కలిసి కడియం పరిశీలించారు. సభా వేదిక, హెలీప్యాడ్‌ను పరిశీలించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ దుమ్ముతో ప్రజలు ఇబ్బందులు పడకుండా కార్పెట్‌లు వేయాలని, ఆరు చోట్లలో వాటర్ ప్యాకెట్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 12వేల మంది కూర్చునేలా కుర్చీలు వేయాలన్నారు. తాగునీరు సౌకర్యం, మజ్జిగ ప్యాకెట్ల అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. పార్కింగ్ స్థలాలతో పాటు మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. 50వేలకు పైగా ప్రజలు వచ్చే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఎలాంటి అవాంచనీయఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీబందోస్తు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో, ఆర్డీవోలు ధరంసోత్ వెంకన్న, ఏసీపీలు భీమాశర్మ, నర్సయ్య, సీఐలు వేణు, శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, నాయకులు నరేందర్ రెడ్డి, రాపోలు మధుసూదన్ రెడ్డి, అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, లింగనబోయిన శ్రీనివాస్, నాగరబోయిన శ్రీరాములు, రాజేష్‌నాయక్, బూర్ల శంకర్, కొంతం శ్రీనివాస్, తెల్లాకుల రామకృష్ణ, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

21 నుంచి కేయూ డిగ్రీ ఇయర్ వైజ్ సప్లిమెంటరీ పరీక్షలు

పరీక్షల కేంద్రాల వెల్లడి.. 17 నుంచి హాల్ టికెట్ల జారీ

కేయూ క్యాంపస్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ ఇయర్ వైజ్ బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఎం, బీఏ లాంగ్వేజీ కోర్సుల సప్లిమెంటరీ పరీక్షల టైంటేబుల్‌ను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ పి.వెంకటయ్యలు విడుదల చేశారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పరిధిలో డిగ్రీ కోర్సుల్లో ఇయర్ వైజ్ సబ్జెక్టులు మిగిలిన అభ్యర్థులకు పరీక్షల నిర్వహించనున్నారు.

- బీఏ, బీకామ్, బీఎస్సీ మొదటి ఏడాది పరీక్షలు మార్చి 21, 24, 26, 28, ఏప్రిల్ 4, 8, 10 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు.
- బీఏ, బీకామ్, బీఎస్సీ రెండో ఏడాది పరీక్షలు మార్చి 22, 25, 27, 29, ఏప్రిల్ 3, 7, 9, 11 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు.
- బీఏ, బీకామ్, బీఎస్సీ ఫైనల్ ఏడాది పరీక్షలు మార్చి 21, 22, 24, 25, 26, 27, 28, 29, ఏప్రిల్ 3, 4, 7, 8, 10 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు.

పరీక్షల కేంద్రాల వెల్లడి

ఇయర్ వైజ్ డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల కేంద్రాలను పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. వరంగల్ పరిధిలో



హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మం పరిధిలో ఖమ్మంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, (ఆర్ట్స్, కామర్స్)లను ఎంపిక చేశారు. అయితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఇయర్‌వైజ్ అభ్యర్థులందరికీ హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లోనే పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

17 నుంచి హాల్‌టికెట్ల జారీ

ఇయర్ వైజ్ డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులందరికీ మార్చి 17 సోమవారం నుంచి హాల్ టికెట్లు జారీ చేయనున్నారు. ఇప్పటికే అభ్యర్థుల వివరాలను క్రోడీకరించిన పరీక్షల నియంత్రణాధికారులు జారీ ప్రక్రియ పనుల్లో బిజీగా ఉన్నారు. ఫీజులు చెల్లించిన కళాశాలలో, కేయూ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను అందుబాటులోకి తెస్తారు.

హక్కులతో.. మోసాలకు చెక్

- మోసాలమయంగా మార్కెట్.. అడుగడుగునా దగా
- ప్రజలను ఆకట్టుకునేందుకు వ్యాపారుల ఎత్తులు
- నేడు జాతీయ వినియోగదారుల హక్కుల రక్షణ దినం



హనుమకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ఇప్పుడంతా మార్కెట్ మాయాజా లం నడుస్తోంది. చాలామంది వ్యాపారులు స్వార్థం కోసం మోసాలకు పాల్పడుతున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు రకరకాల ఎత్తులు వేస్తున్నారు. లాభార్జనే ధ్యేయంగా అనేక అడ్డదారులు తొక్కుతున్నారు. తూకాల్లో మోసం.. కొలతల్లో దగా. నాణ్యతలేని వస్తువులు అంటగడట్టం లాంటివి చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇవన్నీ తెలియని వినియోగదారుడు ఆర్థికంగా నష్టపోతున్నాడు. కల్తీ ఆహారపదార్థాలతో ఆరోగ్యాన్ని కోల్పోతున్నాడు. తనకు జరిగిన మోసంపై వినియోగదారుల ఫోరంలలో ఫిర్యాదులు చేయకపోవడం వల్ల వ్యాపారుల అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఇలాంటి మోసాలకు తమకున్న హక్కులతో చెక్‌పెట్టొచ్చన్న విషయాన్నితెలుసుకోవాలి. ఈ క్రమంలో ప్రతీ వినియోగదారుడు తన హక్కుల గురించి సరైన అవగాహన పెంచుకోవాలి. 1962 మార్చి 15న అమెరికా దిగువ సభలో వినియోగదారుల హక్కుల బిల్లును ప్రతిపాదించగా అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడి అమెరికా ప్రజలకు మొదటిసారిగా నాలుగు వినియోగదారుల హక్కులను ప్రకటించారు.

1982లో చేసిన తీర్మానం మేరకు ప్రతీ సంవత్సరం మార్చి 15ను ప్రపంచ వినియోగ దారుల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



ఎనిమిది హక్కులు ఏంటంటే..

వినియోగదారుల కోసం చట్టబద్ధంగా ఎనిమిది హక్కులను కల్పించారు. తొలుత నాలుగు హక్కులనే కల్పించారు. ఆ తర్వాత మరో రెండు హక్కులను జత చేశారు. తదనంతర కాలంలో వినియోగదారుల సంఘాల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకు అదనంగా మరో రెండు హక్కులను కూడా జాబితాలో చేర్చారు. ప్రస్తుతం ఒక్క భారత దేశంలో తప్ప ప్రపంచంలోని మిగతా అన్ని దేశాల్లో ఈ ఎనిమిది హక్కులు అమలవుతున్నాయి. భారత దేశంలో ఇప్పటికీ ఆరు హక్కులు మాత్రమే అమలులో ఉన్నాయి. మిగతా ఈ రెండు హక్కులను కూడా కల్పించాలని చాలా కాలంగా వినియోగదారుల సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

వినియోగదారుల హక్కుల ఇలా...

సమాచార హక్కు : వినియోగదారులు కొనే వస్తువులు, పొందే నాణ్యత పరిణామం, ధరల గురించి సంపూర్ణ సమచారం పొందడం కూడా ఒక హక్కే. నిర్ణయం తీసుకునే ముందు ఈ సమాచారాన్ని తప్పకుండా తెలుసుకోవాలి. అలాగే అనేక రకాల వస్తువులు, సేవలను తగిన, సరసమైన ధరలలో పొందటం వినియోగదారుల హక్కు. లభిస్తున్న వస్తువులు, సేవలలో ఏది పొందాలనే ఎంపిక హక్కు కూడా ఉంది.

ప్రాతినిధ్యం హక్కు : వినియోగదారుల సంక్షేమా ర్థం వినియోగదారులు ఎవరైనా సరే వినియోగదా రుల వేదికలపై అభిప్రాయాన్ని వినిపించవచ్చు. ప్రభుత్వం ఇతర సంస్థలు ఏర్పాటు చేసే పలు సంఘాల్లో ప్రాతినిధ్యం పొందగల రాజకీయేతర, వాణిజ్యేతర వినియోగదారుల సంఘాలను ఏర్పరుచుకోవడం ప్రాథమిక హక్కు. అలాగే అన్ని విషయాలు తెలిసినవారు కావడానికి తగిన విజ్ఞానం, నైపుణ్యం, జీవన పర్యంతం పొందడం కూడా హక్కే.

న్యాయం పొందే హక్కు : అన్యాయమైన వాణిజ్య విధానాలు, మోసపూరిత పద్ధతుల నుంచి న్యాయబద్ధమైన రక్షణ పొందవచ్చు. న్యాయ సమ్మతమైన ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ఫిర్యాదు ధనపరంగా చిన్న మొత్తానికో లేదా అంశానికో కావచ్చు. అయినా సమాజంపై దాని ప్రభావం అసమానం కావచ్చు. అలాగే పర్యావరణానికి హాని కలగకుండా ఉండే వస్తువులను సేవలను పొందటం వినియోగదారుల హక్కు. దీనిపై ప్రశ్నించడానికి సర్వ హక్కులు కల్పించారు.


హక్కుల రక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలి



ప్రపంచ వినియోగదారుల దినోత్సవానికి సంబంధించి ఈ సంవత్సరం థీమ్ సుస్థిరమైన జీవనశైలికి ఒక సరళమైన పరివర్తన. ఈ థీమ్ అమలులోకి రావాలంటే ఆరోగ్యకరమైన వస్తు వినియోగం తప్పనిసరి. ఈ క్రమంలోనే ఆర్థిక, పర్యావరణ రీత్యా సుస్థిరమైన జీవనశైలి సాధ్యమవుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామీణ వినియోగదారులు 67 శాతం ఉన్నారు. వినియోగదారుల హక్కుల రక్షణకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఆహార సలహా సంఘాలను, వినియోగదారుల హక్కుల రక్షణ కమిటీలను, ఆహార భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలి.

- సాంబరాజు చక్రపాణి, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి

చైతన్యంతులైతేనే అక్రమాలు అరికట్టవచ్చు



ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా వినియోగదారులు చైతన్యవంతులు అయితేనే అక్రమాలను అరికట్టవచ్చు. వినియోగదారులు ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలి. ఏ వస్తువు కొనుగోలు చేసినా ఒరిజినల్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. ఉత్పత్తిదారుడు ఇచ్చే వారంటీ, గ్యారంటీ కార్డులను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి. వస్తువులో నాణ్యతా లోపం ఉన్నప్పుడు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందాలి. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ లావాదేవీలు, ఎలక్ట్రానిక్, టెలీషాపింగ్, మార్కెటింగ్ ద్వారా జరిగే మోసాలకు కూడా చట్టం వర్తిస్తుంది.

- డాక్టర్ పల్లెపాడు దామోదర్, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు

భద్రత హక్కు: వినియోగదారులు తమ ప్రాణాలకు, ఆస్తికి హాని కలిగించే వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందడానికి హక్కు కలిగి ఉన్నాడు.

సమాచార హక్కు: వస్తువుల నాణ్యత, పరిణామం, శక్తి, స్వచ్ఛత, ప్రమాణం, ధర గురించి తెలుసుకునే హక్కు. వస్తు వుల ప్యాకింగ్‌పై దానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఉత్పత్తిదారుడు విధిగా ముద్రించాలి. వస్తువు ఎప్పుడు? ఎక్కడ ? ఎలా? తయారైంది. వస్తువు తయారీకి వాడిన పదార్థాలు, ఎక్స్‌పయరీ తేదీ తదితర సమాచారాన్ని ముద్రించకపోతే తయారీదారున్ని, విక్రయదారున్ని నిలదీసే హక్కు వినియోగదారుడికి ఉంది.

వినియోగదారుల విద్య: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకునే, నైపుణ్యాలను పెంపొందించుకునే క్రమంలో అందుకు సంబంధించిన సమాచారం, విద్యను పొందే హక్కు కలిగి ఉన్నాడు. అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి రక్షణ పొందేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలుసుకునేందుకు అవసరమైన జ్ఞానాన్ని పొందే హక్కు వినియోగదారుడికి ఉంది.

కనీస అవసరాల హక్కు : వినియోగదారుడి హక్కుల్లో ఇది కీలకమైంది. తాను, తన కుటుంబం జీవించడానికి కనీస అవసరాలను కల్పించే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వాలకు పన్నులు చెల్లించే పౌరుడిగా తన కనీస అవసరాలను తీర్చని ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు.

సరైన వాతావరణంలో జీవించే హక్కు : ప్రజలు వినియోగదారుడు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించాలని కోరుకుంటాడు. కాలుష్య రహితమైన, ప్రమాద రహితమైన, స్వేచ్ఛాయుతమైన వాతావరణం కల్పించే బాధ్యత ప్రభుత్వానిది. ఈ విషయంలో విఫలమైతే బాధ్యులను నిలదీసే హక్కు వినియోగదారుడికి ఉంది.

ఈ చివరి రెండు హక్కులు మన దేశంలో అమలు కావడం లేదు



వినియోగదారుల రక్షణ చట్టం : వినియోగించుకునే వారికి కొన్ని హక్కులున్నాయి. ఈ హక్కుల పరిరక్షణకు నిబంధనలు, చట్టాలున్నాయి. వివాదం ఏర్పడితే పరిష్కరించడానికి ప్రత్యేకంగా వినియోగదారుల కమిషన్లు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉన్నాయి. కనుక ప్రతీ వినియోగదారుడు తన హక్కులకు నష్టం కలిగినప్పుడు, తాను మోసపోయినప్పుడు చట్టం పరిధిలో పోరాడేందుకు తగిన వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం 1986లో వినియోగదారుల రక్షణకు విప్లవాత్మకమైన చట్టాన్ని తీసుకువచ్చింది. అదే వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం. ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రతీ జిల్లా కేంద్రంలో వినియోగదారుల ఫోరాలను జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి ఫోరానికి రిటైర్డ్ జిల్లా జడ్జి అధ్యక్షుడిగా, మరో ఇద్దరు సభ్యులుగా ఉంటారు. మెజారిటీ సభ్యుల ఆమోదంతో ఫోరంలోని కేసులపై తీర్పులు ఇస్తారు. వస్తువు లేదా సేవ విలువ, కోరే నష్ట పరిహారం, రూ.లక్ష వరకు అయితే కోర్టు ఫీజు రూ.100, రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు రూ.200, రూ.10లక్షల వరకు రూ.400, రూ.10లక్షలు ఆపైన అయితే రూ.500 నామమాత్రపు కోర్టు ఫీజు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. కొనే వస్తువు, పొందే సేవలు వినియోగదారుల రక్షణ అవసరాలు తీర్చడమే కాకుండా అవి సుదీర్ఘ కాలం మన్నేలా ఉండాలి. అవి వినియోగదారుల జీవితాలకు, ఆస్తులకు నష్టం కలిగించే విధంగా ఉండకూడదు. ఈ భద్రత పొందటానికి వినియోగదారులు కొనే వస్తువుల నాణ్యతను నిర్ధారించుకోవలసి ఉంటుంది. వీలైనంత వరకు ఐఎస్ఐ, అగ్‌మార్క్, హాల్ మార్క్ వంటి నాణ్యతా చిహ్నాలు గల వస్తువులనే కొనుగోలు చేయాలి.

ఫిర్యాదు ఎలా చేయాలి?

ఫిర్యాదు చేసే విధానం చాలా సులభం. అలాగే దానిపై స్పందన కూడా త్వరగా ఉంటుంది. తెల్లకాగితంపై ఫిర్యాదు వివరాలు రాసి పంపవచ్చు. న్యాయవాది అవసరం లేదు. ఫిర్యాదుదారుడైనా, అతని ఏజెంట్ అయినా ఫోరంలో స్వయంగా ఫిర్యాదు ఇవ్వవచ్చు. అలా వీలుకాకపోతే పోస్టు ద్వారా కూడా పంపవచ్చు. ఫిర్యాదారు పూర్తి పేరు, చిరునామా, ఇతర వివరాలు ఎవైనా ఉంటే ఇవ్వాలి. అవతలి పార్టీ పూర్తి పేరు, చిరునామా, ఫిర్యాదు చేయడానికి గల కారణాలు, ఏ విధంగా నష్టపోయారనే విషయాలు తెలుపుతూ డాక్యుమెంట్లు, రసీదులు, ఇతర వివరాలు ఏవైనా ఉంటే ఫిర్యాదుకు జతచేయాలి. ఫిర్యాదుదారుడు ఏ విధంగా నష్ట పరిహారం అడుగుతున్నాడో వివరణ ఇవ్వాలి.



హసన్‌పర్తి పెద్ద రథచక్రాల బండి తాడు లాగి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

వెంకన్న పెళ్లికొడుకాయెనే..

- కన్నుల పండువగా వెంకటేశ్వరస్వామి కల్యాణం
- వైభవంగా ప్రారంభమైన ఎర్రగట్టు జాతర

హసన్‌పర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రగట్టు వెంకన్న పెళ్లి కన్నులపండువగా జరిగింది. హసన్‌పర్తి మండలం అంబాల రోడ్డులోని ఎర్రగట్టు జాతర శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. హసన్‌పర్తి నుంచి పెద్ద రథచక్రాల బండి, భీమారం నుంచి చిన్న రథచక్రాల బండి మీద శ్రీ అలివేలు మంగమ్మ పద్మావతి సమేత శ్రీనివాసుడి ఉత్సవమూర్తుల ప్రతిమలు రాత్రి గుట్టకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఇరుగ్రామాల రథచక్రాల బండ్లను తాడు లాగి ప్రారంభించారు. ఉత్సవమూర్తులను ఆయా గ్రామాల పురవీధుల నుంచి డప్పుచప్పుళ్లతో మంగళవాయిద్యాలతో డీజే సౌండ్ సిస్టంతో ఎర్రగట్టుగుట్టకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఉత్సవమూర్తుల ప్రతిమలకు మంగళహారతులతో స్వాగతం పలికారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

ఎర్రగట్టుగుట్ట విశ్వక్‌సేనా సేవా సమితి కల్యాణ మండపంలో హసన్‌పర్తి - భీమారం ఉత్సవమూర్తుల ప్రతిమలకు స్వస్తి క్రోధినామ సంవత్సరం ఉత్తర ఫాల్గుణి నక్షత్రం శుక్ల పౌర్ణమి శుక్రవారం రాత్రి 11-48 గంటలకు హస్త నక్షత్రయుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశ సుముహూర్తమున కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వెంకట్రావ్‌తో పాటు 14 మంది ధర్మకర్తలు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు వేదాంతం పార్థసారథాచార్యులు, ఆరుట్ల శ్రీధరాచార్యులు వేదమంత్రోచ్చరణలతో స్వామివారికి కల్యాణం జరిపించడంతో శుక్రవారం నుంచి మంగళవారం వరకు ఐదురోజుల పాటు జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ నిర్వాహణ కమిటీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఎర్రగట్టు జాతర ఉత్సవకమిటీ ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, శీలం రమేష్, కనపర్తి రాజు, పోలరాజు శ్యామల, చింతల రమేష్, బిగుళ్ల సురేష్, మానుపాటి విజేందర్, శాగంటి సదానందం, తోట శ్రీనివాస్, కొండమీది సంతోష్, ఆటికం శ్రీనాథ్ గౌడ్, సంగాల ప్రశాంత్‌కుమార్‌తో పాటు కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, జక్కుల రజితవెంకటేశ్వర్లుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు, తలంబ్రాలు

యేటా శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణానికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించే చింతగట్టు వాసి, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి ఈ యేడు కూడా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో వెంకట్రావ్ ఆధ్వర్యంలో శుక్రవారం కుటుంబసభ్యులతో కలిసి నరహరి స్వామివారికి తీసుకువచ్చిన పట్టువస్త్రాలు, తలంబ్రాలను అందించారు. అనంతరం నరహరి స్వామివారి స్వాగత తోరణాన్ని తన సొంత ఖర్చుతో నిర్మిస్తానని హామీ ఇచ్చారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తున్న మధ్యప్రదేశ్ సీనియర్ ఐఏఎస్ అధికారి నరహరి

నమో.. నారసింహా..

- వైభవంగా సాగుతున్న కొమ్మాల జాతర
- పోటెత్తిన భక్తులు.. పెద్దఎత్తున మొక్కులు
- పోటాపోటీగా రాజకీయ ప్రభ బండ్లు



కొమ్మాల జాతరలో వెలసిన గుడారాలు



ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

గీసుగొండ, మార్చి 14 ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం భక్తులు పెద్దఎత్తున పోటెత్తారు. ఉదయం హోలీ జరుపుకున్న అనంతరం సాయంత్రం స్వామివారి దర్శించుకునేందుకు భక్తులు ఎడ్లబండ్లు, వివిధ వాహనాల్లో జాతరకు తరలివచ్చారు. నిండు పౌర్ణమిన ఉప్పొంగిన భక్తితో భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావటంతో ఒక్కసారిగా జాతర జనసంద్రంగా మారింది. కొమ్మాల నరసింహుడిని (ఉత్సవమూర్తులు) చూసి తరించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ వాహనాలు, ఎడ్లబండ్లపై ఒంటె, ఏనుగు, గుర్రం, మేక వంటి ప్రభలను అందంగా ముస్తాబు చేసుకొని కోలాటం, నృత్యంతో కోలాహలంగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయం గుట్ట చుట్టూ ఎడ్లబండ్లు తిరిగే ఘట్టం వైభవంగా జరిగింది. ఎడ్ల బండ్లు తిరిగే సమయంలో భక్తులు చేసిన గోవింద నామస్మరణ మిన్నంటింది. గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, సంగెం, చెన్నారావుపేట మండలాల్లోని గ్రామాలతో పాటు గ్రేటర్ వరంగల్ నుంచి పెద్ద సంఖ్యలో ఎడ్లబండ్లపై తరలివచ్చారు. వరంగల్- నర్సంపేట, కొమ్మాలకు వచ్చే రోడ్లు ఎడ్లబండ్లు, వాహనాలతో రద్దీగా మారాయి. ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారం నుంచి ఆలయం వరకు భక్తుల రద్దీ పెరగడంతో భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. దైవదర్శనం కోసం భక్తులు క్యూలో బారులు తీరారు. ప్రత్యేక, శీఘ్ర దర్శనాల ద్వారా భక్తులు దైవదర్శనం చేసుకున్నారు.

గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో ప్రభబండ్లు తిరగడానికి ముందు ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటీ చైర్మన్ కదారి రాజు, అర్చకులు రామాచార్యులు, విష్ణు, ఫణీంద్రచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

హోరెత్తిన రాజకీయ ప్రభల జోరు

కాంగ్రెస్‌లో రెండు వర్గాలుగా ఏర్పడి భారీ ఎత్తులో రాజకీయ ప్రభలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రేవూరి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ వర్గాలుగా ఏర్పడిన నాయకులు ప్రభలను పోటీపడి నిర్మించారు. ఆలయం గుట్ట చుట్టూ ప్రభబండిని తిప్పేందుకు మొదట రేవూరి వర్గానికి, తరువాత కొండా వర్గానికి అనంతరం బీఆర్‌ఎస్, ఇతర పార్టీల ప్రభబండ్లను అనుమతిచ్చారు. కాగా, తొలుత పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రభ బండిని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు దొమ్మాటి సాంబయ్య, గన్నోజు శ్రీనివాసచారి, చాడా కొమురారెడ్డి, శ్రీనివాస్, సౌజన్య పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బీఆర్‌ఎస్ ప్రభ బండిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో కొమ్మాల జాతర ప్రశాంతంగా జరిగేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో వర్గపోరు సాగుతోందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ బండిని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాళీప్రసాద్ ప్రారంభించారు. చివరగా అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభబండిని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రడం భరత్, వీరగోని రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు. కొమ్మాల బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన ప్రభల వద్ద ఆయా వర్గాల, పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో చేరడంతో సందడిగా మారింది. పార్టీ ప్రభల ముందు అభిమానులు బాణసంచా కాల్చి, కోలాటం ఆడి, నృత్యం చేశారు. ఈ సందర్భంగా వరంగల్- నర్సంపేట మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు 3గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్‌లో ఓ అంబులెన్స్ ఇరుక్కుపోయింది.



ప్రభ బండి నుండి అభివాదం చేస్తున్న కొండా మురళి



ప్రభ బండిపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



బీఆర్ఎస్ ప్రభ బండిపై మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

భారీ పోలీస్ బందోబస్తు

కొమ్మాల జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. డీసీపీ అంకిత్‌కుమార్, ఏసీపీ తిరుపతి, సీఐ మహేందర్ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. 500మంది పోలీసులతో బందోబస్త్‌ను నిర్వహించారు. రాజకీయ ప్రభల ముందు డీజేలను పోలీసులు నిషేధించినా డీజేలు జోరు ఆగలేదు. కాగా సాయంత్రం 4 గంటలకు కోనాయిమాకుల వైన్‌షాపు ఎదుట కొంతమంది యువకులు భారీ సంఖ్యలో చేరి ఘర్షణ పడి కర్రలతో కొట్టుకున్నారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లడంతో యువకులు పారిపోయారు.

వంద పడకల ఆస్పత్రికి అడుగులు

రూ.45.50కోట్లతో స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్మాణం

రేపు ఆస్పత్రి నిర్మాణానికి సీఎం శంకుస్థాపన

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి అప్‌గ్రేడ్‌తో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి. ఎమ్మెల్యే కడియం శ్రీహరి వంద పడకల ఏరియా ఆస్పత్రిని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఈ ఆస్పత్రి కోసం తొలుత బస్సు డిపోకు కేటాయించిన 4ఎకరాల స్థలాన్ని చూశారు. ఆర్టీసీ అధికారులను ఎమ్మెల్యే కడియం ఒప్పించి స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి బదిలీ చేయించారు. అనంతరం ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వానికి నివేదించడంతో గత జనవరి 20న రూ45.50 కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం జీవోను జారీ చేసింది.



వంద పడకల ఆస్పత్రి నమూనా భవనం

ఆస్పత్రి ఏర్పాటుతో ప్రయోజనాలు

వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుతో డివిజన్ ప్రజలకు అనేక సేవలు అందుబాటులోకి రానున్నాయి. వివిధ విభాగలకు చెందిన వైద్యుల సేవలు వినియోగంలోకి రానున్నాయి.

గైనిక్, ఫిజీషియన్స్, సర్జన్, ఆర్థోపెడిక్, పిడియాట్రిషన్, ఫిజియోథెరపీ, న్యూరో, డెంటల్, అనస్థీషియా వైద్యుల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రతీ విభాగంలో వైద్యుల సంఖ్య నలుగురు నుంచి ఐదుగురు ఉంటారు. అత్యవసర సేవల విభాగం అందుబాటులోకి వస్తుంది. జాతీయ రహదారి పైన రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సమీపంలో ఆస్పత్రి ఉండడంతో అనేక మంది ప్రాణాలను బతికించుకునే అవకాశం ఉంటుంది. ఆస్పత్రిలో ఏర్పాటుతో ట్రామాకేర్ సెంటర్, బ్లడ్ బ్యాంకు ఏర్పాటు, 24గంటల పాటు వైద్య సేవలు, అంబులెన్స్ సేవలు, ఆపరేషన్ థియేటర్స్ పోస్టుమార్టం సేవలు, ఎస్ఎన్‌సీయూ సేవలు అందుబాటులోకి వస్తాయి.



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం, పీడీఎస్‌యూ నేతలు

17న కేయూలో పీడీఎస్‌యూ రాష్ట్ర సదస్సు

కేయూ క్యాంపస్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 17న నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను శుక్రవారం కేయూ పరిపాలన భవనం ఎదుట రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పీడీఎస్‌యూ నేతలు డాక్టర్ సుత్రావు అనిల్, హనుమకొండ అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, రాచకొండ రంజిత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు పవన్‌కల్యాణ్, విజయ్, దీక్షిత్, ప్రశాంత్, పవన్, నవీన్, రాహుల్, సాత్విక్, సాయి, మిత్రిన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ బయాలజిస్ట్, జి.మాధవరెడ్డి



ముఖాముఖి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆంధ్రజ్యోతి : గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్లలో దోమల వృద్ధిని ఎలా నివారిస్తారు?

బయాలజిస్ట్ : దోమల నివారణ కోసం ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సిబ్బంది షిఫ్ట్ వైజ్‌గా విధులు నిర్వర్తిస్తారు. గుడ్డు దశలో ఉన్న దోమలు కాల్వల్లో వృద్ధి చెందకుండా ఉండేందుకు యాంటి లార్వల్ స్ప్రే చేస్తాం.

ఆంధ్రజ్యోతి : దోమలు ఎన్ని రకాలు? ఏ ప్రాంతంలో ఎక్కువగా సంచరిస్తాయి?

బయాలజిస్ట్ : దోమలు నాలుగు రకాలుగా ఉంటాయి. మనకు దోమ అని మాత్రమే తెలుసు. అందులో గుడ్డు , లార్వా, ప్యూపా దశ, అడల్ట్ స్టేజీలుంటాయి. ప్రధానంగా మురుగునీరు, ఖాళీస్థలాల్లోఎక్కువగా నివసిస్తాయి.

ఆంధ్రజ్యోతి : దోమల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

బయాలజిస్ట్ : మురుగు కాల్వల్లో టిమోపాస్ పిచికారీ చేస్తాం. ఎంఎల్‌వో ఆయిల్‌బాల్స్ వేస్తాం. కాలనీల్లో ఫాగింగ్ చేస్తున్నాం. ఫాగింగ్‌లో మలాథిన్ మందును కలిపి పొగకొట్టడం వల్ల దోమల నివారణ జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి : దోమలు ఎక్కడెక్కడ నివసిస్తుంటాయి.. ఎప్పుడు సంచరిస్తుంటాయి?

బయాలజిస్ట్ : ఎండాకాలం కావడంతో చాలా చోట్ల మురుగు కాల్వలో నీరు నిలిచి ఉండడంతో పాటు ఇంటి పరిసరాల్లో కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నీరు నిలిచి ఉండకుండా చూడాలి. ఏ ప్రదేశంలోనైనా రెండు రోజుల కంటే ఎక్కువ సమయం నీరు నిల్వ ఉండకుండా చూడాలి.

ఆంధ్రజ్యోతి : ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

బయాలజిస్ట్ : వరంగల్ నగరంలో చాలా మంది ప్రజలు చదువుకున్న వారే ఉంటారు. దోమలు, క్రిమికీటకాలు ఇంట్లోకిరాకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. దోమల సమస్యఉన్న ప్రాంతాల ప్రజలు సమాచారమిస్తే పరిష్కరిస్తాం.

- వరంగల్ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

అప్పుల బాధతో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

హసన్‌పర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ట్రాక్టర్ ఓనర్ కం డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం బైరాన్‌పల్లిలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన కల్లెబోయిన మల్లయ్య(50), విమల దంపతులకు వివాహమై చాలా ఏళ్లు గడిచినా సంతానం లేదు. దీంతో ఓ అమ్మాయిని దత్తత తీసుకొని వివాహం జరిపించారు. మల్లయ్య కుటుంబం గడవడం కోసం అప్పు చేసి ఓ ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈక్రమంలో చేసిన అప్పులు తీర్చలేక తనలో తానే మథనపడేవాడు. కుటుంబంతో తరచూ గొడవ పడేవాడు. ఈక్రమంలోనే భార్య పుట్టింటికి వెళ్లడంతో ఈనెల 13న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో స్థానికులు 108లో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

- ధ్వంసమైన ఇల్లు.. తప్పిన ప్రమాదం



ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

హసన్‌పర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి అజాగ్రత్తగా కారు నడపడంతో ఇంట్లోకి దూసుకెళ్లిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రేటర్ 66వ డివిజన్ హసన్‌పర్తి పాత మార్కెట్ వీధిలో శుక్రవారం మద్యం మత్తులో ఓ వ్యక్తి కారును అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ కందుకూరి ప్రభాకర్ ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో ఇల్లు ముందుభాగం పూర్తిగా కూలి పెను ప్రమాదం తప్పింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. కారు డ్రైవర్ మత్తులో అతివేగంగా నడపడం వల్లే కారు అదుపు తప్పి ఇంట్లోకి దూసుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఇంటి యజమాని కందుకూరి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

కానరాని ఆహ్లాదం

- హరిత వనంపై పట్టింపేదీ?
- హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో కనబడని మొక్కలు, చెట్లు

బాలసముద్రం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ కాలుష్యాన్ని అరికట్టి ప్రజలకు ఆహ్లాదం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏ గ్రామంలో చూసినా రోడ్ల వెంట విరివిగా మొక్కలు నాటడంతో పాటు ప్రతీ పల్లెలో ప్రకృతి వనాలను పెంచి పోషిస్తున్నారు. గ్రామాల్లో కంటే పట్టణాల్లో కాలుష్యం అధికంగా ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నచోట ప్రకృతి వనాలను ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వరంగల్ మహా నగరంలో నూతనంగా వెలుస్తున్న కాలనీలలో హరిత వనాలు (పార్కులు) ఏర్పాటు కోసం స్థలాలను కేటాయిస్తున్నారు. హనుమకొండ నడిబొడ్డున ఇల్లులేని నిరుపేదలు మధ్య తరగతి నివాసం కోసం జీప్లస్‌టు అంతస్థులో హౌసింగ్ బోర్డు కాలనీ పేరుతో 750 క్వార్టర్లను ప్రభుత్వం నిర్మించి అవసరార్థులకు కేటాయించింది. నగరంలోని 51వ డివిజన్‌లో గల ఈ ప్రాంతంలో హౌసింగ్ బోర్డు కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో నివసించే కుటుంబాల కోసం పార్కును ఏర్పాటు చేశారు. పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు కోసం స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి గేటును ఏర్పాటు చేశారు. ఎంతో ఆర్భాటంగా పట్టణ ప్రకృతి వనం పేరుతో బోర్డును కూడా పెట్టారు. అందులో ఒక చెట్టు, మొక్క గానీ కనిపించడం లేదు. జనాభా అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో ప్రకృతి వనాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టణప్రకృతివనం ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.



హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్కు

సంబురంగా రంగుల పండుగ



హనుమకొండలోని 5వ డివిజన్ జ్యోతిరావుపూలే కాలనీలో హోలీ వేడుకలు జరుపుకుంటున్న కాలనీ వాసులు

నగరంలో ఉత్సాహంగా హోలీ వేడుకలు

హనుమకొండ టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని బాలసముద్రంతో పాటు పలు డివిజన్లలో శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. 5వ డివిజన్‌లోని జ్యోతిరావుపూలే కాలనీలో కాలనీ వాసులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హనుమకొండలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

బల్దియా క్యాంపు ఆఫీసులో..

వరంగల్ కార్పొరేషన్: హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ కమిషనర్ క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన హోలీ వేడుకల్లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కుటుంబ సభ్యులతో పాటు బల్దియా సిబ్బంది పాల్గొన్నారు. శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, హార్టికల్చర్, పరిపాలనా విభాగం సిబ్బంది కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌కు రంగులు చల్లి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్లు నరేందర్, ఎస్ఐలు పోలెపాల అనిల్‌కుమార్, చెన్నూరి శ్యాంరాజ్, కరుణాకర్, సంపత్‌రెడ్డి, ధర్మనాయక్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరెడ్డి, ఈఈ మహేందర్, రవికుమార్,శ్రీనివాస్, డీఈ రంగారావు, కృష్ణమూర్తి, సూపరింటెండెంట్లు రావుల ఆనంద్, రామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యాలయంలో..

రాంనగర్:హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో హోలీ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, మహిళా మోర్చా నాయకురాలు ఉషారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ తోపుచర్ల మధు, నాయకులు అరణ్యరెడ్డి, ఉడుతల మురళి, రుత్విక్, వినీత్, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.



కమిషనరేట్‌లో డప్పు వాయిద్యాలకు స్టెప్పులు వేస్తున్న సీపీ, డీసీపీ, ఏఎస్పీ

పోలీస్ కమిషనరేట్‌లో..

వరంగల్ క్రైం: హోలీ వేడుకలను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆవరణలో శుక్రవారం సీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీలు, సిబ్బంది ఒకరికొకరు రంగులు పూసుకొని డప్పు వాయిద్యాలకు నృత్యాలు చేశారు. జర్నలిస్టులు సీపీకి రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టులతో కలిసి సీపీ డ్యాన్స్ వేశారు. కార్యక్రమంలో డీసీపీ అంకిత్‌కుమార్, ఏఎస్పీ మనన్‌భట్, అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన హోలీ వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్‌తో కలిసి నృత్యాలు చేశారు. హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు.

- హనుమకొండ(ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్ క్యాంపస్‌లో హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. కేరింతలు కొడుతూ రంగుల్లో మునిగి తేలారు. దీనితో నిట్ క్యాంపస్ రంగుల మయంగా మారింది. కేరింతలతో సందడిగా కనిపించింది
- మడికొండ: మడికొండలో శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా, వృద్ధులు అనే తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకుని హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఉదయం నుంచే చిన్నారులు రంగులు చేతబూని తమ మిత్రుల ఇళ్ల వద్దకు చేరి వారి మిత్రులకు రంగులు పూసి సంబరాలు చేసుకున్నారు. స్థానిక గ్రీన్ హిల్స్ అపార్ట్‌మెంట్స్‌లో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.





వరంగల్ నిట్‌లో హోలీ ఆడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, మడికొండలోని మణికంఠ గ్రీన్ హోమ్స్‌లో వేడుకల్లో చిన్నారులు



కమిషనరేట్‌లో హోలీ వేడుకల్లో సీపీ సన్‌ప్రీత్ సింగ్, ఎమ్మెల్యే నాయిని, ఎర్రబెల్లి స్వర్ణ, తదితరులు



హోలీ వేడుకల్లో పాల్గొన్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సంతోష్‌రెడ్డికి బొట్టు పెడుతున్న సంద్ర మధు



మడికొండలో హోలీ వేడుకలు జరుపుకుంటున్న యువకులు

సీకేఎంలో ఉచితంగా సంతాన సాఫల్య వైద్యసేవలు

గిర్మాజిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సంతానలేమితో బాధపడుతున్న జంటలకు ముఖ్యంగా పేద, దిగువ మధ్య తరగతి వర్గాలకు శుభవార్త. ప్రయివేట్ ఇన్‌ఫెర్టిలిటీ సెంటర్లలో వేల రూపాయల వ్యయం అయ్యే వైద్య పరీక్షలు శనివారం నుంచి వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఉచితంగా అందుబాటులోకి రానున్నాయి. లక్షల రుపాయల వ్యయమయ్యే సంతాన సాఫల్య వైద్య చికిత్సలను రాష్ట్ర ప్రభుత్వం పేద వర్గాలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా కేంద్రానికి మంజూరైన సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో పురోగతిలో ఉంది. ఈ నేపథ్యంలో సంతాన సాఫల్య కేంద్రం ఓపీ సేవలను సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ప్రారంభించాలని నిర్ణయించారు.

ఇందులో భాగంగా శనివారం నుంచి సీకేఎం ప్రసూతి ఆస్పత్రిలో ఓపీ సేవలను ప్రారంభించనున్నారు. ఆస్పత్రి అవుట్‌పేషంట్ బ్లాక్‌లోని మొదటి అంతస్థులోని రెండు గదులను ఇందుకు కేటాయించారు. వరంగల్ జిల్లా సంతాన సాఫల్య కేంద్రం నోడల్ అధికారి, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరిండెంట్, సీనియర్ గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి.షర్మిల సంతాన సాఫల్య కేంద్రం ఓపీ సేవలను చూడనున్నారు. ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు డాక్టర్ షర్మిల ఆధ్వర్యంలో వైద్యులు, పీజీ వైద్యులు సంతానంలేని జంటలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగానే అందించనున్నారు. అలాగే సంతాన సాఫల్య వైద్య చికిత్సలపై అవగాహన, కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. సంతానం లేక బాధపడుతున్న దంపతులు సీకేఎం ఆస్పత్రిలోని సంతాన సాఫల్య కేంద్రం అవుట్‌పేషెంట్ విభాగంలో ఉచితంగా ఓపీ సేవలు అవసరమైన మందులు పొందవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ షర్మిల తెలిపారు.



వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రి (ఫైల్)

అధ్వానంగా మరుగుదొడ్లు

- ప్రభుత్వ కార్యాలయాల్లో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

హనుమకొండ టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. అధికారులు పట్టించుకోక పోవడంతో డోర్లు ఊడిపోయి నీటి సరఫరా నిలిచిపోయి ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. హనుమకొండలోని నీటిపారుదల శాఖ సర్కిల్ కార్యాలయంలో మరుగుదొడ్లు అధ్వానంగా మారి డోర్లు ఊడిపోతున్నాయి. నీటి సరఫరా లేక మూత్రశాలలు దుర్వాసనతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. మహిళా ఉద్యోగులు అత్యవసరానికి వాడే మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో అనారోగ్యం పాలవుతున్నట్లు వాపోతు న్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. మెయింటెనెన్స్ కింద నిధులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని మహిళా ఉద్యోగులు కోరుతున్నారు.



నీటిపారుదల శాఖలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి

సమస్యల వలయంలో శివారు కాలనీలు

- రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యం
- తాగునీటికి తండ్లాట.. చీకట్లోనే పలు కాలనీలు



రోడ్లు సక్రమంగా లేని పరిమళ కాలనీ

వడ్డెపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సమస్యల వలయంలో శివారు కాలనీలో మగ్గుతున్నాయి. రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యమయ్యాయి. తాగునీటి సమస్య తాండవిస్తోంది. చీకట్లోనే పలు కాలనీల వాసులు మనుగడ కొనసాగిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని శివారులో ఉన్న ఉషోదయ కాలనీ, వినాయకకాలనీ, సురేంద్రపురి కాలనీ, మారుతి కాలనీ, పరిమళ కాలనీలలో రోడ్లు డ్రెయినేజీలు అన్ని వీధులలో మచ్చుకైనా కనిపించవు. వర్షాకాలంలో కాలనీ వాసుల వెతలు వర్ణనా తీతం. నివాస గృహాల నుంచి వెలువడే నీటితోపాటు వర్షం నీరు సైతం రోడ్లపైనే పారడంతో దుర్గంధంతో పాటు దోమలు వృద్ధి చెంది కాలనీల వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు.



ఉషోదయ కాలనీలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు..

తాగునీటికి తండ్లాట..

దినదినం డివిజన్‌లో విస్తరిస్తున్న ఉషోదయ, సురేంద్రపురి, వినాయక, శ్రీసాయి నగర్‌లలో తాగునీటి సమస్య తాండవిస్తోంది. డివిజన్‌లోని అన్ని కాలనీలలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు ఏర్పాటు చేయలేదు. ఫలితంగా నీటి ఎద్దడి నిత్యకృత్యమవుతోంది. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా తాగునీటిని సరఫరా చేయాలని వివిధ కాలనీల ప్రజలు మహా నగర పాలక సంస్థ అధికారులను కోరుతున్నారు.

ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు

డివిజన్‌లోని ఉషోదయ కాలనీ, పరిమళ కాలనీలో ఖాళీ ప్లాట్లల్లో పిచ్చిమొక్కలు, నిరుపయోగమైన చెట్లు ఏపుగా పెరిగాయి. పిచ్చిమొక్కలు ఖాళీ ప్లాట్లల్లో ఉండడం వలన పాములు, తేళ్లు, క్రిమికీటకాలకు విడిదిగా మారాయి. పందులు, పశువులు, కుక్కలు రేయింబవళ్లు సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

చీకట్లోనే శివారు కాలనీలు

డివిజన్‌లోని ఉషోదయ, వినాయక, శ్రీసాయినగర్‌తో పాటు పోలీసు కాలనీలలో వీధి దీపాలు లేక ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. అభివృద్ధి చెందుతున్న ఉషోదయ, వినాయక తదితర కాలనీలలో విద్యుత్ స్తంభాలు లేక నివాస గృహాల ప్రజలు భారీ వైర్లతో విద్యుత్ అవసరాలను తీర్చుకుంటున్నారు. అన్ని కాలనీలలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలను అమర్చాల్సి ఉంది.



పక్కారోడ్డు, డ్రెయినేజీ లేని వినాయక కాలనీ

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

బానోత్ వెంకన్న, వినాయక కాలనీ



56వ డివిజన్‌లోని పరిమళ కాలనీ, సురేంద్రపురి కాలనీ, ఉషోదయ కాలనీ, వినాయక కాలనీలలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి. వినాయక, శ్రీసాయి నగర్, ఉషోదయ కాలనీలలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలను ఏర్పాటు చేయాలి. ఈ కాలనీలలోనే మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసి తాగునీటిని నిత్యం సరఫరా చేయాలి. ఖాళీ ప్లాట్లల్లో ఉన్న పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించాలి.

ఐసీఏఐ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

మట్టెవాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ చైర్మన్‌గా చార్టెడ్ అకౌంటెంట్ సత్యనారాయణ పూజారి, కమిటీ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం వరంగల్ హంటర్‌రోడ్‌లోని ఐసీఏఐ భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఐసీఏఐ సీఏ ప్రసన్నకుమార్, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్స్ ముప్పాల శ్రీధర్, రీజినల్ కౌన్సిల్ చైర్మన్ రేవతి రఘునాథన్, రీజినల్ కౌన్సిల్ కోశాధికారి భానునారాయణరావు, రీజినల్ కౌన్సిల్ మెంబర్ మండల సునీల్, రీజినల్ కౌన్సిల్ మెంబర్ ఎర్ర తిరుపతయ్య అతిథులుగా విచ్చేశారు. అనంతరం ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ నూతన కమిటీ పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ వరంగల్ బ్రాంచ్ అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. విద్యార్థులకు, సీఏ మెంబర్స్‌కు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం చైర్మన్ సీఏ సత్యనారాయణ పూజారి మాట్లాడుతూ సీఏ మెంబర్స్, సీఏ విద్యార్థులకు, ప్రజలకు ఇనిస్టిట్యూట్ తరుపునఉత్తమ సేవలను అందిస్తానని తెలిపారు. వైస్ చైర్మన్‌గా మదరపు సుజిత్, కార్యదర్శిగా ఎస్. వినీల్‌రావు కోశాధికారిగా జి.నిఖిత, స్టూడెంట్స్ అసోసియేషన్ చైర్మన్‌గా భగవాన్, ఎంసీ మెంబర్‌గా హెచ్.భరత్‌రాజ్ బాధ్యతలు చేపట్టారు.

కంపెనీ సీఎండీ పేరిట సైబర్ నేరగాళ్ల వల

- రూ.1.95 కోట్లు పంపాలంటూ వాట్సాప్‌లో సందేశం
- డబ్బు పంపిన సదరు కంపెనీ అకౌంట్స్ ఆఫీసర్
- లావాదేవీ ఎస్ఎంఎస్‌తో అప్రమత్తమైన సీఎండీ
- నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదు..

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ బ్యూరో అప్రమత్తతతో భారీ సైబర్ మోసం నుంచి ఓ కంపెనీ బయటపడింది. సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాకు ఓ కంపెనీ అధికారి రూ.1.95 కోట్లు పంపాక జరిగిన మోసాన్ని గుర్తించి సైబర్ సెక్యూరిటీ బృందానికి ఫిర్యాదు చేయడంతో ఆ డబ్బును సైబర్ నేరగాళ్లు విత్‌డ్రా చేయకుండా నిలువరించగలిగారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షికా గోయల్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ ఫోన్ నంబర్‌కు గుర్తు తెలియని నంబర్ నుంచి ఓ వాట్సాప్ సందేశం వచ్చింది. ఆ నంబరు వాట్సాప్ డీపీలో తమ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ఫొటో ఉండటంతో సీఎండీ నుంచి ఆదేశాలు వచ్చినట్లు సదరు అకౌంట్స్ అధికారి భావించారు. కంపెనీకి సంబంధించిన ఒక ప్రాజెక్టు అవసరం నిమిత్తం తాను సూచించిన బ్యాంకు ఖాతాకు రూ.1.95 కోట్లు బదిలీ చేయాలని మెసేజ్ ఉండటంతో అకౌంట్స్ అధికారి డబ్బు బదిలీ చేశారు. ఈ లావాదేవీకి సంబంధించిన మెసేజ్ కంపెనీ సీఎండీ ఫోన్ వచ్చింది. వెంటనే ఆయన అకౌంట్స్ విభాగంతో మాట్లాడగా అసలు విషయం తెలిసింది. కంపెనీ సీఎండీ వెంటనే విషయాన్ని నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేశారు. రంగంలో దిగిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు బ్యాంకు అధికారులను సంప్రదించి బదిలీ అయిన రూ.1.95 కోట్లను సైబర్ నేరగాళ్లు విత్‌డ్రా చేయకుండా చర్యలు తీసుకున్నారు.

మయన్మార్ బాధితుల ఫిర్యాదులతో 9 కేసులు

- 15 మంది ఏజెంట్ల పాత్ర గుర్తింపు.. 8 మంది అరెస్టు
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ షికా గోయల్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మయన్మార్‌లోని సైబర్ ముఠాల నుంచి తప్పించుకుని తెలంగాణ చేరుకున్న 24మంది బాధిత యువకుల నుంచి పోలీసులు వాంగ్మూలాలు సేకరించారు. మయన్మార్ బాధితుల ఫిర్యాదుల ఆధారంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఇప్పటి వరకు 9 కేసులు నమోదయ్యాయి. గత రెండు రోజుల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో 4 కేసులు నమోదు చేయగా.. ఆర్మూర్, సిరిసిల్ల, జగిత్యాల, మానకొండూర్, హైదరాబాద్‌లో 5 కేసులు నమోదయ్యాయి. 10 మంది బాధితులు ఇచ్చిన ఫిర్యాదులతో ఈ కేసులు నమోదు చేసినట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ షికా గోయల్ తెలిపారు. 24 మంది బాధితులు రెండు విడతలుగా హైదరాబాద్ చేరుకున్నారని ఆమె వివరించారు. దర్యాప్తులో 15 మంది జాబ్ రిక్రూట్‌మెంట్ ఏజెంట్ల పాత్రను గుర్తించామని, వీరిలో 8మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఇద్దరు పరారీలో, మరో ఐదుగురు ఏజెంట్లు మయన్మార్‌లోనే ఉన్నారని, వీరిని రప్పించేందుకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు.

భద్రాచలంలో వైభవంగా డోలోత్సవం

భద్రాచలం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామి వారికి హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని డోలోత్సవం, వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమైన కార్యక్రమంలో రామచంద్రమూర్తికి విశేష స్నపనం నిర్వహించారు. ఏప్రిల్ 6వ తేదీననిర్వహించే స్వామి వారి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఉత్తరద్వారం వద్ద పసుపు కొమ్ములను రోటిలో వేసి దంచారు. తలంబ్రాలను కలిపారు. తొలి రోజున 25 క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేయగా మొత్తంగా 300 క్వింటాలను తయారు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

గ్రూప్-3లో పురుషుల హవా

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. పరీక్ష రాసిన అభ్యర్థుల మాస్టర్ క్వశ్చన్ పేపర్‌తోపాటు ఓఎంఆర్ షీట్లను వ్యక్తిగత లాగిన్‌లో అందుబాటులో ఉంచామని, వీటిని ఏప్రిల్ 12 వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు. వెబ్‌సైట్‌లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే కార్యాలయ పనివేళల్లో ఫోన్ 040-23542185, 23542187 నంబర్లలో సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.



టాప్-10 ర్యాంకర్ల మార్కులు	
ర్యాంకు	మార్కులు
1	339.239
2	331.299
3	330.427
4	329.279
5	327.245
6	326.272
7	326.225
8	325.157
9	323.184
10	323.157

టాప్-10 మహిళల మార్కులు (జనరల్ ర్యాంకు)	
1	325.157 (8)
2	312.11 (37)
3	309.184 (46)
4	309.157 (47)
5	308.124 (51)
6	307.097 (55)
7	305.056 (70)
8	304.103 (77)
9	303.076 (82)
10	301.239 (92)

గ్రూప్-2లో 18వ ర్యాంకు.. గ్రూప్-3లో టాపర్

పాపన్నపేట: గ్రూప్-3 ఫలితాల్లో 339.239 మార్కులతో టాపర్‌గా నిలిచిన కుకునూరి అర్జున్‌రెడ్డి.. ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లోనూ 18వ ర్యాంకు సాధించారు. తండ్రి నరేందర్‌రెడ్డి గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తుండగా.. అర్జున్‌రెడ్డి అదే గ్రంథాలయంలో పరీక్షలకు సన్నద్ధమయ్యారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలానికి చెందిన అర్జున్‌రెడ్డి పదో తగరతి వరకు మెదక్‌లోని సరస్వతీ శిశుమందిర్‌లో చదివారు. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో, 2013లో బీటెక్ పూర్తి చేశారు. 2014లో వీఆర్వో ఉద్యోగానికి ఎంపికయ్యారు. పదోన్నతి పొందిన ఆయన ప్రస్తుతం మెదక్ కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. కాగా, చిన్నప్పటి నుంచి కలెక్టర్ కావాలని ఉందని, ఆ మేరకే గ్రూప్స్ వైపు అడుగులు వేశానని అర్జున్‌రెడ్డి తెలిపారు. సివిల్స్‌లో విజయం సాధించడమే లక్ష్యమన్నారు.

7వ ర్యాంకు చంద్రకాంత్.. 5వ ఉద్యోగం!



శంకర్‌పల్లి/సిద్దిపేట కల్చరల్: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతుబిడ్డ ఒగ్గు చంద్రకాంత్ గ్రూప్-3 ఫలితాల్లో 7వ ర్యాంకు సాధించారు. చంద్రకాంత్ ఇప్పటికే నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గ్రూప్-2, గ్రూప్-4 ఫలితాలు రెండింట్లోనూ 27వ ర్యాంకు సాధించిన చంద్రకాంత్.. జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో మూడవ ర్యాంకర్‌గా నిలిచారు. తాజాగా గ్రూప్-3లో ర్యాంకుతో వరుసగా ఐదో ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ఇదిలా ఉండగా.. సిద్దిపేటకు చెందిన వడ్లకొండ సచిన్ గ్రూప్-3 ఫలితాల్లో 317 మార్కులతో 23వ ర్యాంకు సాధించారు. ఇప్పటికే ఆయన గ్రూప్-2 ఫలితాల్లో 2వ ర్యాంకుతో సత్తా చాటారు.

మళ్లీ మెరిసిన గిరిజన ఆణిముత్యం



మహేశ్వరం: టీజీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షల్లో వరుసగా నాలుగోసారి సత్తా చాటాడు ఓ సామాన్య గిరిజన యువకుడు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నల్లచెరువు తండాకు చెందిన దేవేందర్‌నాయక్.. గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 63వ ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో రెండో ర్యాంకు సాధించారు. ఇప్పటికే గ్రూప్-4లో ఉద్యోగం సాధించి శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల నిర్వహిస్తున్న దేవేందర్‌నాయక్ ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో 433 మార్కులు సాధించారు. గ్రూప్-2 ఫలితాల్లో 171వ ర్యాంకు పొందారు.



ఎండల వేడికి నిర్మానుష్యంగా నిజామాబాద్‌లోని ప్రధాన రహదారి

కూకట్‌పల్లిలో 40.9 డిగ్రీలు!

- రాష్ట్రవ్యాప్తంగా మండుతున్న ఎండలు..
- చాలా జిల్లాల్లో 40 డిగ్రీలపైనే నమోదు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. మార్చి రెండో వారంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కూకట్‌పల్లిలో అత్యధికంగా 40.9 డిగ్రీలు నమోదైంది. అలాగే హయత్‌నగర్, మంచిర్యాల జిల్లా కాసిపేటలో 40.7 డిగ్రీలు రికార్డయింది. ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో 40.6, అదే జిల్లా బేల, ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి, తిర్యాణి, సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 40.4, జగిత్యాల జిల్లా వెల్గటూరు, అయిలాపూర్‌లో 40.3, ఆదిలాబాద్ అర్బన్‌లో 40.2, సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్‌లో 40.2, నిజామాబాద్, కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో 40.1, గద్వాల జిల్లా వనపర్తి, మల్దకల్, అయిజల్లో 40 డిగ్రీలుగా నమోదైంది. మరో రెండు రోజుల పాటు ఎండలు కొనసాగుతాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. మార్చి నెల చివరి నాటికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉష్ణోగ్రతలు 42 డి గ్రీలు దాటే అవకాశముందని వెల్లడించారు.

'మత్తు' తగ్గింది



(మొదటిపేజీ తరువాయి)

పెరిగాయి. ఏపీలో టీడీపీ సర్కారు వచ్చిన తర్వాత కొత్త మద్యం విధానాన్ని తీసుకొచ్చింది. ఇప్పుడు అక్కడ కూడా అన్ని రకాల బ్రాండెడ్ మద్యం దొరుకుతోంది. ఆ ప్రభావం తెలంగాణ మద్యం విక్రయాలపై పడిందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఇక ఇతర ప్రాంతాల నుంచి రాష్ట సరిహద్దు జిల్లాలకు 'సుంకం చెల్లించని మద్యం (ఎన్‌డీపీఎల్)' జోరుగా వస్తోంది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వాళ్లు మన మద్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదు. కానీ, ఆ రాష్ట్రాల నుంచి ఎన్‌డీపీఎల్‌ను మాత్రం మన రాష్ట్రంలో అనధికారికంగా అమ్మేస్తున్నారు. రంగారెడ్డి డివిజన్‌లోని శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో నిర్దేశించిన లక్ష్యం పూర్తిచేయడానికి డ్రగ్స్, ఎన్‌డీపీఎల్ అవరోధంగా మారిందని డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఇటీవల అధికారులతో సమీక్షలో చెప్పారు. రాష్ట్రంలో కల్తీ కల్లు, మద్యం, నాటుసారాను సరిగా నియంత్రించకపోవడం కూడా మద్యం విక్రయాలు తగ్గడానికి ఓ కారణమైంది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కల్తీ కల్లు తయారవుతోంది. పలు మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తుండడంతో మద్యం ప్రియులు ప్రత్యామ్నాయంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. మద్యం అమ్మకాలు తగ్గడానికి ఇదీ ఓ కారణమని అధికారులు అంటున్నారు.

మూడు నెలలుగా కనిపించని జోష్..

మద్యం, బీర్ల విక్రయాలు పెరిగితే అదే రీతిలో ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరుగుతుంది. కానీ, గత మూడు నెలలుగా మద్యం విక్రయాలు తగ్గాయి. ఎక్సైజ్ శాఖ లెక్కల ప్రకారం.. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో రూ.9,438 కోట్ల మద్యం విక్రయాలు జరగ్గా, గత ఏడాది ఇదే సమయంలో రూ.10,542 కోట్ల విలువైన అమ్మకాలు జరిగాయి. అంటే రూ.1104 కోట్ల అమ్మకాలు తగ్గాయి. భారీగా అమ్మకాలు తగ్గడంతో ఆ శాఖ అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఏడాది శాఖకు కేటాయించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామో లేదోనన్న అనుమానం వ్యక్తమవుతోంది. ఇక ఇదేసమయంలో మద్యం, బీర్ల విక్రయాల లెక్కల్లో చాలా వ్యత్యాసం ఉంది. 2023 డిసెంబరులో 43.61 లక్షల కార్టన్ల మద్యం విక్రయించగా.. గత ఏడాది డిసెంబరులో 38.08 లక్షలే అమ్ముడుపోయాయి. 2024 జనవరిలో 32.61 లక్షల కార్టన్లు విక్రయించగా.. ఈ జనవరిలో 31.31 లక్షల కార్టన్లకు పడిపోయాయి. ఇక గత ఏడాది ఫిబ్రవరిలో 32.11 లక్షల కార్టన్లు అమ్మితే.. ఈ సారి 28.79 లక్షలకు పడిపోవడం అధికారులను కలవరపెడుతోంది. బీర్ల విషయానికి వస్తే 2023 డిసెంబరులో 46.23 లక్షల కేసులు అమ్మగా.. 2024 డిసెంబరులో 45.09 లక్షల కేసులే విక్రయించారు. గత ఏడాది జనవరిలో 39.29 లక్షల కేసులు అమ్మితే.. ఈ సారి 42.16 లక్షల కేసులకు చేరింది. గత ఫిబ్రవరిలో 43.08 లక్షల కేసులు విక్రయించగా ఈ సారి 41.67 లక్షల కేసులే అమ్ముడయ్యాయి. ఎక్సైజ్ శాఖ ద్వారా ఏటా ప్రభుత్వానికి రూ.35 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఈ మూడు నెలల్లో తగ్గిన అమ్మకాల ప్రభావం ఆ శాఖకు నిర్దేశించిన లక్ష్యంపై పడనుంది.





హైదరాబాద్‌లో హైటెక్స్ సిటీలో హోలీ వేడుకలు

సంతోషాల హోలీ

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా హోలీ వేడుకలు
- రాజ్‌భవన్‌లో చిన్నారుతో కలిసి హోలీ ఆడిన గవర్నర్
- హున్సలో ఆంక్షల నడుమ పిడిగుద్దులాట

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర వ్యాప్తంగా హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ సంబురాలు చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి కామదహనంతో మొదలైన హోలీ వేడుకలు యువతీయువకుల సందడితో, ఆటపాటలతో ఉత్సాహంగా సాగాయి. రాజ్‌భవన్‌లో నిర్వహించిన హోలీ సంబరాల్లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాజ్‌భవన్ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. పలువురు చిన్నారులు గవర్నర్‌కు హోలీ శుభాకాంక్షలు చెబుతూ ఆయనకు రంగులు పూశారు. ఇక, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ యువజనకాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి హోలీ ఆడారు. మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని మంత్రి సీతక్క నివాసంలో జరిగిన వేడుకల్లో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు. ఇక, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలో హోలీకి ఆనవాయితీ నిర్వహించేగుండ్లు(రాళ్లు) భుజానికి ఎత్తుకుని ప్రదక్షిణ చేసే కార్యక్రమాన్ని ఎప్పట్లాగే నిర్వహించారు. నారాయణఖేడ్ మండలంలోని తుర్కపల్లికి చెందిన సాతిని జ్ఞానేశ్వర్ 105 కిలోల గుండును అవలీలగా ఎత్తుకొని గ్రామ దేవత ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేశాడు. అలాగే, కంగ్టిలో స్వామిదాస్ అనే యువకుడు 100 కిలోల బరువున్న గుండును భుజానికి ఎత్తుకుని గ్రామదేవత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశాడు. కాగా, హోలీ సందర్భంగా నిజామాబాద్ జిల్లా సాలూర మండలం హున్స గ్రామంలో హోలీకి ఆనవాయితీగా నిర్వహించే పిడిగుద్దులాట ఈసారి పోలీసు ఆంక్షల మధ్య జరిగింది. ఎప్పట్లాగే గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద తాడు కట్టిన గ్రామ ప్రజలు రెండు వర్గాలుగా తాడుకి ఇరువైపులా నిలబడి ఒకరిపై మరొకరు పిడిగుద్దులు విసురుకున్నారు. నిజానికి, ఈ పిడిగుద్దులాటకు పోలీసులు తొలుత అనుమతి నిరాకరించారు. వందేళ్ల నాటి సంప్రదాయమని గ్రా మ ప్రజలు చేసుకున్న విజ్ఞప్తుల మేరకు పోలీసులు ఐదు నిమిషాల పాటు పిడిగుద్దులాటకు అనుమతించారు.

హోలీ వేడుకల్లో విషాదాలు.. ముగ్గురి మృతి

హోలీ వేడుకలు పలు చోట్ల విషాదాన్ని మిగిల్చాయి. ఆదిలాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లెడివార్ రిషి కుమార్ (16) అనే పదో తరగతి విద్యార్థి మరణించగా, ప్రేమ్‌కుమార్ అనే యువకుడు గాయపడ్డాడు. స్నేహితులతో కలిసి హోలీ ఆడి ద్విచక్రవాహనంపై వస్తుండగా రిషి, ప్రేమ్ ప్రమాదానికి గురయ్యారు. ఇక, హోలీ వేడుకల్లో భాగంగా స్నేహితులతో కలిసి ప్రాణహిత నదిలోకి దిగిన మంచిర్యాల జిల్లా వేమనపల్లికి కంపెల రాజ్‌కుమార్ (21) అనే డిగ్రీ విద్యార్థి నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు. అలాగే, మిత్రులతో కలిసి హోలీ చేసుకున్న తర్వాత జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో దిగిన గొల్లపల్లి సాగర్ గౌడ్(32) నీటి ప్రవాహంలో గల్లంతై ప్రాణాలు కోల్పోయాడు. వెల్దుర్తికి చెందిన సాగర్‌కు భార్య వెన్నెల, కుమారుడు, కూతురు ఉన్నారు.

హ్యాపీ హోలీ అంటూ యాసిడ్ పోశాడు

- సైదాబాద్ భూలక్ష్మీ ఆలయంలో ఉద్యోగిపై దాడి



యాసిడ్ దాడికి గురైన నర్సింగ్‌రావు

సైదాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ముఖానికి మాస్కు ధరించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి.. హ్యాపీ హోలీ అంటూ.. ఓ ఆలయ ఉద్యోగిపై యాసిడ్ పోసి పరారయ్యాడు. హైదరాబాద్‌లోని సైదాబాద్ ప్రాంతంలో ఉన్న పెద్దతోట భూలక్ష్మీ ఆలయంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఆలయ అకౌంటెంట్ నర్సింగ్‌రావు అలియాస్ గోపీ(55) రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఆలయ కౌంటర్ వద్ద విధులు నిర్వహిస్తుండగా ఈ దాడి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి యాసిడ్ పోసి పరారవ్వగా.. మంటతో నర్సింగ్‌రావు పెద్దగా కేకలు వేశాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

అటవీ అనుమతుల్లో ఆలస్యం!

(మొదటిపేజీ తరువాయి)

అటవీ ప్రాంతాల మీదుగా నిర్మించే రోడ్లకు వినియోగించే భూములకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం వేరే ప్రాంతంలో అటవీయేతర భూములను కేటాయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 13 ప్రాజెక్టులకు సంబంధించిన వివిధ రోడ్ల పనులకు కేంద్ర అనుమతుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ అనుమతులు వస్తేనే రహదారుల పనులు పట్టాలెక్కనున్నాయి. సుమారు 243 హెక్టార్ల అటవీ భూముల్లో నుంచి పలు రహదారుల నిర్మాణాలు జరగనున్నాయి.

ప్రాజెక్టులు.. అనుమతులు..

- రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో 72.35 హెక్టార్ల అటవీ భూముల్లో నుంచి రోడ్డు నిర్మాణం జరగనుంది. ఈ అటవీ భూములకు ప్రత్యామ్నాయ భూములను రాష్ట్ర ప్రభుత్వం మహబూబాబాద్ జిల్లాలో కేటాయించింది. అందుకు రూ.43.85 కోట్లను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.37 కోట్లు చెల్లించింది. మరో రూ.6 కోట్లు బకాయి ఉంది.
- నిజామాబాద్-జగదళ్‌పూర్ ఎన్‌హెచ్-63 రోడ్డును నాలుగు వరసలుగా విస్తరించాలనే ప్రతిపాదన ఉంది. ఈ మార్గంలో 3.02 హెక్టార్ల అటవీ భూమి ఉంది. సూత్రపాయంగా కేంద్రం అనుమతులు ఇచ్చిందని అధికారిక వర్గాలు తెలిపాయి. ప్రత్యామ్నాయ భూములను కూడా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించగా.. అందుకు చెల్లించాల్సిన నిధుల విషయం పెండింగ్‌లో ఉంది.
- మెదక్- సిద్దిపేట ఎన్‌హెచ్-765(జీ) మార్గం 8.48 హెక్టార్ల అటవీ భూముల గుండా వెళ్తోంది. ఈ రోడ్డుకు కేంద్రం సూత్రప్రాయంగా అనుమతులు ఇచ్చింది. అయితే వన్య ప్రాణాలకు సంబంధించి కొన్ని పత్రాలను ఇవ్వాలని సూచించింది. అధికారులు వాటిని సిద్ధం చేస్తున్నారు. వారం, పది రోజుల్లో ఆ పత్రాలను కేంద్రానికి సమర్పించనున్నట్లు సమాచారం.
- మహబూబ్‌నగర్- కోస్గి- కొడంగల్ సెక్షన్ ఎన్‌హెచ్-167(ఎన్) మార్గం గతంలో 2.50 హెక్టార్ల అటవీ భూముల గుండా వెళ్తుండగా మార్చిన ప్రతిపాదనల నేపథ్యంలో అది 4.20 హెక్టార్లకు పెరిగింది. ఈ వివరాలను కేంద్రానికి సమర్పించాల్సి ఉంది. ఈ 4.20 హెక్టార్ల అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ఇచ్చే భూములను కూడా ప్రభుత్వం గుర్తించింది.
- మేడ్చల్ జిల్లా పరిధిలోని హైదరాబాద్- భూపాలపట్నం సెక్షన్ 163 మార్గం గతంలో 2.13 హెక్టార్ల అటవీ భూమి ఉండగా, ఇప్పుడు 0.94 హెక్టార్లకు తగ్గింది. మారిన ప్రతిపాదనలను కేంద్రానికి పంపారు. అనుమతులు రాకముందే పనులు మొదలుపెట్టడంతో ఈ రోడ్డుపై కేంద్రం 2024 డిసెంబరులో నిబంధనలు ఉల్లంఘించారని నోటీసులిచ్చింది. దీనిపై అధికారులు సమాధానం ఇవ్వనున్నారు.
- మెదక్- ఎల్లారెడ్డి సెక్షన్‌లో ఎన్‌హెచ్-765(డి) మార్గం 15.22 హెక్టార్ల అటవీ భూమి గుండా వెళ్తోంది. ఈ మార్గంలో పోచారం దగ్గర వన్యప్రాణుల అభయారణ్యం ఉంది. జాతీయ వన్యప్రాణుల బోర్డు అనుమతుల కోసం ఇప్పటికే అధికారులు దరఖాస్తు చేశారు.
- సిద్దిపేట- ఎల్కతుర్తి ఎన్‌హెచ్-765(డీజీ) మార్గం 1.10 హెక్టార్ల అటవీ భూమి గుండా వెళ్తోంది. ఈ భూమికి సంబంధించిన వివరాలు కేంద్ర పరివేష్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది.
- భూపాలపల్లి జిల్లాలోని సిరొంచ- మహదేవపూర్ ఎన్‌హెచ్- 353(సి) రోడ్డు దాదాపు 20.25 హెక్టార్ల అటవీ భూముల మీదుగా వెళ్తోంది. కాళ్వేశరం గ్రావిటీ కెనాల్ మీదుగా కూడా నిర్మితం కానుంది.
- నిజామాబాద్- కామారెడ్డి ఎన్‌హెచ్-765(డి) మార్గంలో రెండు లైన్లను విస్తరిస్తున్నారు. ఇక్కడ ఎల్లారెడ్డి- రుద్రూర్ సెక్షన్‌లో 24.62 హెక్టార్ల అటవీ భూమి గుండా రోడ్డు వెళ్తోంది. పలు అంశాలకు సంబంధించిన అనుమతులు రావాల్సి ఉండగా, ప్రస్తుతం పీసీసీఎఫ్ స్థాయిలోనూ పెండింగ్ ఉంది.
- నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్- ఆర్మూర్ సెక్షన్ ఎన్‌హెచ్-63 (పాత ఎన్‌హెచ్-16) మార్గంలో రెండు లైన్లతో విస్తరణ చేపట్టారు. ఇక్కడ 7.44 హెక్టార్ల అటవీ భూమి అవసరమవుతోంది. అనుమతులు రాకముందే పనులు మొదలుపెట్టారన్న కారణంగా కేంద్రం నిబంధనల ఉల్లంఘన అంశాన్ని లేవనెత్తింది. దీనికి అధికారులు సమాధానం ఇవ్వనున్నారు.
- ఆర్మూర్- జగిత్యాల- మంచిర్యాల ఎన్‌హెచ్-63 మార్గంలో 16.18 హెక్టార్ల అటవీ భూమి ఉంది. దీనికి సంబంధించి చెన్నైలో ప్రాజెక్టు స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరగాల్సి ఉంది.
- తొర్రూరు- నెల్లికుదురు- మహబూబాబాద్- ఇల్లెందు- కొత్తగూడెం సెక్షన్ ఎన్‌హెచ్-30, ఎన్‌హెచ్-930(పి) మార్గంలో 9.14 హెక్టార్ల అటవీ భూమి అవసరమవుతోంది. ఈ భూములకు ఇవ్వాల్సిన ప్రత్యామ్నాయ భూములను మహబూబాబాద్‌లో గుర్తించారు. వాటిని ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపర్చాల్సి ఉంది. అనంతరం అనుమతుల కోసం దరఖాస్తు చేయాలి.
- కొత్తగూడెం జిల్లాలోని మహబూబాబాద్- ఇల్లెందు- కొత్తగూడెం సెక్షన్ ఎన్‌హెచ్- 930(పి) మార్గంలో 60.07 హెక్టార్ల అటవీ భూమి అవసరమవుతోంది. ప్రత్యామ్నాయంగా కేటాయించాల్సిన భూములను కూడా గుర్తించాల్సి ఉంది. అనంతరం అనుమతుల కోసం కేంద్రానికి దరఖాస్తు చేయాల్సి ఉంది. ప్రస్తుతం పీసీసీఎఫ్ పరిధిలో ఉంది.

కుమార్తెను కోల్పోయి.. న్యాయం జరగక..

- మనోవేదనతో తల్లి ఆత్మహత్య
- ప్రియుడు మోసగించాడని ఇటీవలే కూతురు బలవన్మరణం
- పోలీసులను ఆశ్రయించిన కుటుంబానికి వేధింపులు
- మనస్తాపంతో లోకం విడిచిన తల్లి



కూతురు విజయలక్ష్మితో తల్లి లక్ష్మి (ఫైల్)

బెంగళూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మోసపోయిన కూతురు ఆత్మహత్య చేసుకుంది...ఈ విషయంలో న్యాయం జరగకపోగా కుటుంబానికి వేధింపులు ఎదురుకావడంతో ఆ తల్లి మనోవేదనకు గురైంది. ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణం చెందింది. కర్ణాటక రాష్ట్రం మండ్య తాలూకా హెబ్బకవాడి గ్రామానికి చెందిన విజయలక్ష్మి(21), ఇదే ప్రాంతంలోని మారసింగనహళ్లికి చెందిన హరికృష్ణ కొంతకాలం ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నాక శారీరకంగా దగ్గరయ్యారు. ఆ తరువాత పెళ్లి చేసుకోకుండా హరికృష్ణ ముఖం చాటేశాడు. విజయలక్ష్మి ఒత్తిడి చేయడంతో మరోసారి పెళ్లి ప్రస్తావన తీసుకురావద్దని హెచ్చరించాడు. పెళ్లి అంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించాడు. మానసికంగా కుంగిపోయిన విజయలక్ష్మి గత నెల 21న రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. దీంతో తమకు న్యాయం చేయాలని మండ్య గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో విజయలక్ష్మి తండ్రి నంజుండేగౌడ ఫిర్యాదు చేశారు. అయితే హరికృష్ణ తరఫువారు మరో ఫిర్యాదు చేయడంతో నంజుండేగౌడపైనే ఎఫ్ఐఆర్ నమోదైంది. ఓవైపు కూతురును కోల్పోయిన తమకు న్యాయం జరగకపోగా..., తమకు, తమకు అండగా నిలిచిన వారికి వేధింపులు మొదలయ్యాయని ఆవేదన చెందిన విజయలక్ష్మి తల్లి లక్ష్మి(45) గురువారం సాయంత్రం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో హరికృష్ణతోపాటు 19మందిపై పోలీసులు శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

విమానంలో మంటలు..
రెక్కపై ప్రయాణికులు

అమెరికాలోతప్పిన ప్రమాదం

డెన్వర్, మార్చి 14 : అమెరికాలోని డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ విమానానికి పెను ప్రమాదం తప్పింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737-800 విమానం.. విమానాశ్రయంలో ల్యాండ్ అవ్వగానే అందులో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి తీవ్ర గందరగోళం జరిగింది. విమానంలో పొగలు వ్యాపించడంతో అత్యవసర ద్వారం నుంచి బయటకు వచ్చి విమానం రెక్కపై నిలబడిన ప్రయాణికులు సాయం కోసం కేకలు వేశారు.

తక్షణమే స్పందించిన విమానాశ్రయ సిబ్బంది ప్రయాణికులను రక్షించి విమానంలో మంటలను అదుపు చేశారు. నిజానికి, కొలరాడో స్ప్రింగ్స్ నుంచి డల్లాస్ ఫోర్ట్ వర్త్‌కు బయలుదేరిన ఈ విమానం ఇంజన్‌లో సమస్యను గుర్తించిన పైలట్లు అప్రమత్తమయ్యారు. ఏవియేషన్ అధికారుల సూచనల మేరకు విమానాన్ని దారి మళ్లించి గురువారం సాయంత్రం ఐదుగంటలప్పుడు డెన్వర్ విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. ఆ సమయంలో విమానంలో 172 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ప్రమాదం నుంచి వారంతా సురక్షితంగా బయటపడగా స్వల్పంగా గాయపడిన 12 మందిని ఆస్పత్రికి తరలించారు. ఇంజన్‌లో లోపం వల్లే ప్రమాదం జరిగిందని, మంటలు ఎప్పుడు చెలరేగాయనే దానిపై స్పష్టత లేదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

నిద్ర లేమితో గుండె జబ్బులు!

(మొదటిపేజీ తరువాయి)

కారకాలలో నిద్ర ఒకటనే సంగతిని చాలామంది మరిచిపోతున్నారన్నారు. గుండె జబ్బులు, అరెథ్మియా, హార్ట్ ఫెయిల్యూర్ రోగుల్లో తగినంత నిద్ర ఉంటే ఫలితాలు మెరుగ్గా ఉంటున్నాయని చెప్పారు. దాదాపు 30-60% మంది రోగుల్లో నిద్ర సరిగా ఉంటే అరెథ్మియా, హార్ట్ ఫెయిల్యూర్ సమస్యలు గణనీయంగా తగ్గుతున్నాయని తెలిపారు. నిద్రలేమి సమస్యను పరిష్కరిస్తే కార్డియో వాస్క్యులర్ సమస్యలను కూడా చాలా వరకూ నయం చేయొచ్చని పరిశోధనలు చెబుతున్నాయన్నారు. కొందరికి 6 గంటలు నిద్ర పోతే చాలని.. ఇంకొందరికి 8 గంటల నిద్ర కూడా చాలదని తెలిపారు.

స్లీప్ అప్నియా..

నిద్ర లేమి సమస్యలు చాలా రకాలున్నాయని, వాటిలో అన్నిటికంటే ముఖ్యమైనది స్లీప్ అప్నియా అని డాక్టర్ విశ్వనాథ్ చెప్పారు. ఈ సమస్య ఉన్నవారు నిద్ర సమయంలో తగినంతగా శ్వాస తీసుకోలేరని, ఫలితంగా ఆక్సిజన్ స్థాయిలు కూడా తగ్గుతాయని తెలిపారు. స్లీప్ అప్నియా రెండు రకాలన్నారు. ముక్కు, గొంతులో అవరోధాల వల్ల తగినంతగా గాలి శ్వాసకోశాలకు అందకపోవడాన్ని అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా అంటారన్నారు. రెండోది సెంట్రల్ స్లీప్ అప్నియా అని చెప్పారు. మెదడు నుంచి శ్వాసకోశాలకు ప్రభావవంతంగా శ్వాస తీసుకోవడం కోసం సంకేతాలు అందాలని, కొన్నిసార్లు ఇవి పూర్తిగా అందవని, ఫలితంగా తగినంత శ్వాస తీసుకోలేరని వివరించారు. ఇక గురక పెడితే బాగా నిద్రపోతున్నామని ఎక్కువ మంది అనుకుంటారని, అది సరికాదని చెప్పారు. గురక అనేది మన శ్వాస ప్రక్రియలో కలుగుతున్న అవరోధాలకు నిదర్శనమన్నారు. ఇటీవలి కాలంలో కొందరు తాము మధ్యాహ్నం 2 గంటలు, రాత్రి 6 గంటలు నిద్రపోతున్నామని చెబుతున్నారని.. అది మంచిది కాదని వివరించారు. మధ్యాహ్నం పూట నిద్ర 20-30 నిమిషాల కంటే ఎక్కువ ఉండకూదని, రోజువారీ నిద్ర ఒకేసారి 6 లేదంటే 8 గంటలు ఉండాలి తప్ప అంతరాయాలు ఉండకూడదని చెప్పారు. యోగ నిద్ర ఇటీవ ల చాలామందికి ప్రయోజనకరంగా ఉంటోందన్నారు. ఆల్కహాల్ తీసుకున్న వారిలో అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా లక్షణాలు ఉంటాయని డాక్టర్ శ్రీనివాస్ చెప్పారు. ప్రతి వ్యక్తికీ డ్రీమ్ స్లీప్, నాన్ డ్రీమ్ స్లీప్ సమయం తగినంతగా ఉండాలన్నారు. సరైన నిద్ర సమయం ఎంతనేది చెప్పడం కష్టమని తెలిపారు. జ్ఞాపక శక్తి మెరుగుపడడానికి, శారీరక విశ్రాంతికి, మానసిక విశ్రాంతికీ నిద్ర అత్యవసరమని చెప్పారు. నవజాత శిశువులు ఎక్కువగా నిద్రపోతూ ఉంటారని.. ఫలితంగా వారి మెదడు అభివృద్ధి చెందుతూ ఉంటుందని వివరించారు. వయసు పెరిగే కొద్దీ ఆ నిద్ర తగ్గుతూ ఉంటుందన్నారు. పెద్దలు కచ్చితంగా 7 గంటల పాటు నిద్ర పోవాలని చెప్పారు. లేకపోతే అది నిద్ర సంబంధిత లోటుగానే చూడాలన్నారు. ఓ రోజు నాలుగు గంటలు నిద్ర పోయి, వారాంతాల్లో ఎక్కువ సేపు నిద్రపోవడం వల్ల ఫలితం ఉంటుందా అంటే.. వ్యక్తులను బట్టి ఉండొచ్చని తెలిపారు. ప్రతి వ్యాధికీ నిద్రతో సంబంధం ఉంటుందన్నారు. అయితే వైద్య విద్యలో కానీ, మరెక్కడా కానీ దీని గురించి మాట్లాడరని చెప్పారు. నిద్ర గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అల్జీమర్స్ లాంటి వ్యాధులకూ నిద్రలేమి కారణమని తెలిపారు. కొంతమంది ఇటీవలి కాలంలో స్మార్ట్ వాచ్ లాంటివి ధరించి తమకు నిద్ర సరిగా సరిపోవడం లేదనే సమస్యతో వస్తున్నారని.. అవి మానసిక ఆందోళనకు కారణమవుతున్నాయని చెప్పారు. అందుకే తాను వాటిని సూచించని తెలిపారు.

మానసిక సమస్యలకూ మూలం..

ఎవరైనా మానసిక సమస్యలతో వస్తే మీరు తగినంతగా నిద్రపోతున్నారా? అని అడుగుతామని డాక్టర్ వరూధిని చెప్పారు. నిద్ర లేమి వల్ల కుంగుబాటు, ఆందోళన వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. నిద్ర సరిగా లేకపోతే చికిత్స కూడా పెద్దగా పనిచేయదని, అందుకే ముందు నిద్రను సరిచేయాలని పేర్కొన్నారు. తర్వాత పోషకాహారం అందించాలన్నారు. ఆ తర్వాత శారీరక వ్యాయామం ఉండాలని చెప్పారు. ఈ మూడూ సరిగా ఉంటే మానసిక సమస్యలకు సరైన చికిత్స అందించవచ్చని వివరించారు. నిద్ర మాత్రలు మంచిదా కాదా అని అంటే, అది వ్యక్తిని బట్టి మారుతూ ఉంటుందని చెప్పారు.

ఇసుక డోర్ డెలివరీ!

ఇందుకోసం ఇసుక క్వారీల్లాగే లారీ ఏజెన్సీలకు టెండర్లు.. బుకింగ్‌కు కోసం యాప్.. రూపొందిస్తున్న టీజీఎండీసీ

- ఎంత ఇసుక ఎక్కడికి కావాలో డీటెయిల్స్ ఇస్తే డెలివరీ
- చెల్లింపులంతా ఆన్‌లైన్‌లోనే.. దీంతో అక్రమాలకు చెక్
- రెండు వారాల్లో తెలంగాణలో కొత్త ఇసుక పాలసీ అమలు!
- నెల రోజులుగా ఇసుక క్వారీలపై ప్రభుత్వం దాడులు
- అక్రమాలకు అడ్డుకట్ట పడటంతో కృత్రిమంగా ఇసుక
- కొరతను సృష్టిస్తున్న ఇసుకాసురులు..
- ఒక్క నెలలోనే టన్నుకు 600 రేటు పెంపు



భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం సమీపంలోని ఓ ఇసుక క్వారీలో ఇసుకను డంప్ చేస్తున్న ప్రొక్లెయినర్

వరంగల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కృత్రిమంగా ఇసుకకు కొరత సృష్టించడం, ఆ తర్వాత రేట్లు పెంచి అమ్ముకోవడం, నకిలీ వే బిల్లులు, నంబర్ ప్లేట్లు మార్చి ఇసుక రవాణా.. తదితర అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్రప్రభుత్వం కొత్త ఇసుక పాలసీని తీసుకురావాలని యోచిస్తోంది. ఇసుకను డోర్ డెలివరీ చేయడానికి గల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తోంది. ఇసుక క్వారీల టెండర్ తరహాలోనే ఇసుక సరఫరాను కూడా టెండర్ ద్వారా ఏజెన్సీలకు ఇచ్చి, ఆ ఏజెన్సీల ద్వారా బుకింగ్ చేసుకున్న వినియోగదారుడి ఇంటికి ఇసుకను సరఫరా చేస్తే ఎలా ఉంటుందనేదానిపై కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో ప్రధానంగా గోదావరి, మానేరు నదుల తీరాల నుంచి ఇసుక భారీగా లభ్యమవుతోంది. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం 186 స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసి 1.50 కోట్ల టన్నుల ఇసుకను విక్రయించింది. దీని ద్వారా రూ.564 కోట్ల ఆదాయం సమాకూరింది. జీఎస్టీ, రోడ్డు డ్యామేజీ సర్వీసు చార్జీల ద్వారా ప్రభుత్వానికి మరో రూ.29కోట్ల ఆదాయం వచ్చింది. ఇసుక రవాణాలో అక్రమాలను అరికడితే ఈ ఆదాయం మరింత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో మొత్తం 21 ఇసుక క్వారీలు నడుస్తున్నాయి. మరో 10 క్వారీల్లో ఇసుక నిల్వలున్నా ఆన్‌లైన్ బుకింగ్ లేకపోవటంతో ఇసుక అమ్మకాలను నిలిపి వేశారు. ఇంకా 15 ఇసుక క్వారీలు కొత్తగా ప్రారంభించాల్సి ఉంది. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా 50కి పైగా ఇసుక క్వారీలను టీజీఎండీసీ గుర్తించింది. కొత్త ఇసుక పాలసీని తీసుకురానున్న క్రమంలో కొత్త క్వారీలకు కూడా అనుమతి ఇస్తే ఏటా రూ.వెయ్యి కోట్ల అదాయం ప్రభుత్వానికి చేరుతుందని అంచనా. రెండు వారాల్లో కొత్త ఇసుక పాలసీని ప్రభుత్వం ప్రకటిస్తుందని సమాచారం.

రాష్ట్రవ్యాప్తంగా 50వేల ఇసుక లారీలు

రాష్ట్రవ్యాప్తంగా 50వేలకు ఇసుక లారీలు పైగా ఉన్నాయి. వీటిపై ప్రభుత్వ నియంత్రణ లేదు. దీంతో ఇసుక అక్రమ దందాను అరికట్టడం సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో.. ఇసుక సరఫరా టెండర్లను లారీ ఏజెన్సీలకు అప్పగించనున్నారు. మరోవైపు, టీజీఎండీసీ ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తోంది. వినియోగదారులు తమకు ఎంత ఇసుక కావాలి.. ఎక్కడికి కావాలి.. అన్న వివరాలను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇసుకకు, దాని రవాణాకు అయ్యే ఖర్చు(దూరాన్ని బట్టి చార్జీలు మారతాయి) ఆన్‌లైన్‌లోనే టీజీఎండీసీకి చెల్లించేలా ఈ యాప్‌ను రూపొందిస్తున్నట్లు సమాచారం. ఉదాహరణకు 14టైర్ల లారీలో 32టన్నుల ఇసుకకు రూ.13,056 వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తుంది. వరంగల్ వరకు ఇసుకను తీసుకెళ్లేందుకు 14టైర్ల లారీ అద్దె ఎంత ఉంటే అంతా మొత్తాన్ని కూడా ఆన్‌లైన్‌లో చెల్లిస్తారు. తర్వాత లారీ ఏజెన్సీకి సమాచారం ఇచ్చి, అర్డర్ చేసిన వినియోగదారుడి ఇంటికి ఇసుకను సరఫరా చేస్తే ఎలాంటి అక్రమాలకు ఆస్కారం ఉండదని ప్రభుత్వం భావిస్తోంది. ఇసుక సరఫరాకు ఇంకా మెరుగైన ప్రణాళికలు ఉంటే సూచించాలని కూడా ప్రభుత్వం అధికారులను కోరినట్లు తెలిసింది.

అదనపు బకెట్, నంబర్ ప్లేట్ల మార్పు.. ఇలా ఎన్నో అక్రమాలు

గత ప్రభుత్వం హయాంలో ఇసుక పాలసీ అక్రమార్కులకు కాసులు కురిపించింది. స్థానిక చోటా నేతలు, కింది స్థాయి అధికారుల నుంచి పై స్థాయి వరకు మామూళ్లు భారీగా చేతులు మారటంతో అంతా చూసీ చూడనట్లుగానే వ్యవహారం సాగిందనే ఆరోపణలున్నాయి. ఇసుక టెండర్‌దారులు కొన్ని చోట్ల లారీ యాజమానుల నుంచి లోడింగ్ చార్జీ పేరుతో ప్రతీ లారీకి రూ.2,500 వరకు వసూలు చేశారు. అలాగే 10 టైర్ల లారీలో 19.5టన్నులు, 12టైర్ల లారీలో 26 టన్నులు, 14టైర్ల లారీలో 32టన్నుల ఇసుక తరలించాల్సి ఉండగా, అదనపు బకెట్ పేరుతో ప్రతీ లారీలో ఐదారు టన్నుల ఇసుకను అదనంగా నింపారు. ఈ అదనపు బకెట్‌కు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేశారు. అలాగే లారీల నెంబర్ ప్లేట్లు మార్చటం, నకిలీ వే బిల్లులతో వందలాది లారీల్లో ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇసుక క్వారీల్లో జరుగుతున్న అక్రమాలను గత ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. అక్రమ దందాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు ప్రారంభించింది.

నెల రోజుల్లో టన్నుకు రూ.600పెంపు

రెండు మూడు నెలలుగా రాష్ట్రంలో ఇసుకకు డిమాండ్ బాగా పెరిగింది. మరోవైపు, ఇసుక క్వారీలపై ప్రభుత్వం దాడులు నిర్వహిస్తుండటంతో పాత పద్ధతిలో దోపిడీకి బ్రేకులు పడ్డాయి. దీంతో ఇసుకాసురులు ఇసుక ధరలను పెంచేశారు. ప్రభుత్వం టీజీఎండీసీ ద్వారా టన్ను ఇసుకను రూ.408కి అమ్ముతోంది. దీనికి రవాణా చార్జీలు అదనం. జనవరిలో వరంగల్, కరీంనగర్ లాంటి ద్వితీయ శ్రేణి నగరాల్లో టన్ను ఇసుకను రూ.వెయ్యికి విక్రయించగా.. ఇప్పుడు రూ.1600కు పెంచారు. హైదరాబాద్‌లో రూ.1,600 నుంచి రూ.2,200కు పెంచారు. నెల రోజుల వ్యవధిలోనే టన్నుకు సుమారుగా రూ.600కు పైగా ధరలు పెరగటంతో ఇళ్లు నిర్మించుకునే సామాన్యులపై ఆర్థికభారం పడుతోంది.

యడియూరప్పకు

ఉపశమనం

పోక్సో కేసులో సమన్లపై స్టే ఇచ్చిన హైకోర్టు

బెంగళూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసును ఎదుర్కొంటున్న బీజేపీ కీలకనేత, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు ఊరట లభించింది. విచారణకు శనివారం తప్పక హాజరు కావాలని బెంగళూరు ఒకటో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జారీ చేసిన సమన్లపై హైకోర్టు శుక్రవారం స్టే విధించింది. విచారణకు తప్పనిసరి హాజరు నుంచి యడియూరప్పకు మినహాయింపు ఇచ్చింది. సమస్యను చెప్పుకునేందుకు వెళ్లిన సమయంలో యడియూరప్ప తన కూతురితో అనుచితంగా ప్రవర్తించారని ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు 2024 ఫిబ్రవరి 2న యడియూరప్పపై పోక్సో కేసు నమోదైంది.

పెళ్లికి ఒప్పుకోలేదని స్నేహితురాలిని చంపేశాడు

నిందితుని అరెస్టు...

మరో ఇద్దరి కోసం గాలింపు

హావేరిలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

బెంగళూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పెళ్లికి ఒప్పుకోనందుకు ఓ యువతిని హత్య చేసి నదిలో పడేశారు. కర్ణాటక రాష్ట్రం హావేరి జిల్లాలో ఈ నెల 3న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హలగేరి పోలీసులు నిందితులలో ఒకరిని శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు...రెట్టహళ్లి తాలూకా మసూరు గ్రామానికి చెందిన స్వాతి(22), హిరేకెరూరు ప్రాంతానికి చెందిన నయాజ్ స్నేహితులు. తనను పెళ్లి చేసుకోవాలని స్వాతిని నయాజ్ కోరాడు. ఆమె అంగీకరించలేదు. ఇద్దరి మతాలు వేరని, పెళ్లి చేసుకోలేనని స్పష్టం చేసింది. అయినా నయాజ్ వేధించడం ప్రారంభించాడు. ఆమె స్నేహితుల ద్వారా ఒప్పించాలని ప్రయత్నించాడు. ఈ నెల 3వ తేదీ తెల్లవారుజామున మాట్లాడే పేరిట ఆమెను కారులో ఎక్కించుకున్నాడు. రాణిబెన్నూరు శివారులోని సువర్ణపార్కుకు తీసుకెళ్లి, పెళ్లి చేసుకోవాలని మరోసారి ఒత్తిడి చేశాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. తన మిత్రులు దుర్గాచారి, వినాయక్‌ను అక్కడికి పిలిపించుకున్నాడు. అందరూ కలిసి స్వాతిపై దాడి చేశారు. ఓ పాడుబడిన పాఠశాల వద్దకు తీసుకువెళ్లి టవల్‌తో గొంతుబిగించి హత్యచేశారు. మృతదేహాన్ని కారు డిక్కీలో ఉంచుకుని పలు ప్రాంతాల్లో తిరిగారు. రాత్రి 9 గంటల సమయంలో కూసఘట్టి-నందగుడి గ్రామాల మధ్య తుంగభద్ర నదిలోకి మృతదేహాన్ని పడేశారు. ఈ నెల 6న పత్తేపుర గ్రామం వద్ద నదిలో మృతదేహం బయటపడింది. అప్పటికే మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. ఆ మృతదేహం స్వాతిదని గుర్తించారు. హత్యకు సూత్రధారి నయాజ్ అని గుర్తించి, శుక్రవారం అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. నయాజ్‌కు ఇటీవలే నిశ్చితార్థం జరిగిందని పోలీసులు తెలిపారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పాతికేళ్ల కల నెరవేరింది



శివాజీ

'కోర్ట్' సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన చాలా ఆనందాన్ని ఇచ్చింది. నా 25 ఏళ్ల కల 'మంగపతి' పాత్రతో నెరవేరింది' అని అన్నారు నటుడు శివాజీ. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రామ్ జగదీశ్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'కోర్ట్- స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ శుక్రవారం విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా నటుడు శివాజీ మీడియాతో మాట్లాడుతూ 'మంగపతి పాత్ర నా కోసమే పుట్టిందని భావిస్తున్నాను. ఈ పాత్రలో సహజమైన భావోద్వేగం ఉంది. ప్రతి కుటుంబంలో ఇలాంటి స్వభావమున్న వ్యక్తి ఉంటారు. నాని గారు నటుడిగా నిరూపించుకొని, ఇప్పుడు నిర్మాతగానూ రాణిస్తున్నారు. కొత్త నటీనటులను ప్రోత్సహించడంలోనూ చొరవ చూపిస్తున్నారు. కోర్ట్ సినిమా బాగోకపోతే తన 'హిట్ 3' చిత్రాన్ని చూడొద్దంటూ సవాలు విసరడం మామూలు విషయం కాదు' అని అన్నారు.



చిరంజీవికి అరుదైన గౌరవం

టాలీవుడ్ కథానాయకుడు చిరంజీవికి అరుదైన గౌరవం దక్కింది. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగానికి అందిస్తోన్న విశేష సేవలను గుర్తిస్తూ ఆయన్ను హౌస్ ఆఫ్ కామన్స్ ..యూకే పార్లమెంట్ ఘనంగా సత్కరించనుంది. యూకే అధికార లేబర్ పార్టీ ఎంపీ నవేందు మిశ్రా ఆధ్వర్యంలో ఈనెల 19న ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. పలువురు యూకే పార్లమెంట్ సభ్యులు, సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. అదే వేదికపై బ్రిడ్జ్ ఇండియా సంస్థ కూడా చిరంజీవిని సత్కరించనుంది. సినిమా, ప్రజాసేవలో చిరంజీవి చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు చిరంజీవికి అభినందనలు తెలిపారు.



ఈ ఏడాది విడుదల కానున్న భారీ చిత్రాల్లో 'హరి హర వీరమల్లు' ఒకటి. పవన్ కల్యాణ్ కథానాయకుడు. జ్యోతి కృష్ణ దర్శకుడు. ఏ.ఎం.రత్నం సమర్పణలో ఏ.దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంపై అభిమానుల అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కల్యాణ్ నటిస్తున్నారు. మొఘల్ రాజుల నుంచి కోహినూర్ వజ్రాన్ని చేజిక్కించుకోవడంతో పాటు, ప్రేక్షకుల మనసు దోచుకునేందుకు వీరమల్లు సిద్ధమవుతున్నారు. అభిమానులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రాన్ని మొదట మార్చి 28న విడుదల చేయాలని అనుకున్నారు. కానీ నిర్మాణానంతర కార్యక్రమాలు కొనసాగుతున్నందున విడుదలను వాయిదా వేశారు. ఈ ఏడాది మే 9న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ శుక్రవారం తెలిపారు.

ఆ అల్లకల్లోలానికి కారణమేంటి?



నందమూరి కల్యాణ్ రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు తెరకెక్కిస్తోన్న చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ఈ చిత్రంలో విజయశాంతి శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచింది. తాజాగా ప్రీ-టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. కల్యాణ్‌రామ్ ఒక పడవపై కూర్చుని, సముద్రం వైపు చూస్తూ కనిపిస్తున్నారు. రక్తంతో తడిసిన అతని చొక్కా, అతని జీవితం చుట్టూ ఉన్న అల్లకల్లోలాన్ని సూచిస్తోంది. పడవలు దగ్గరకు వస్తున్నప్పుడు జరగబోయే పెద్ద యుద్ధాన్ని అతని ఉగ్రరూపం హెచ్చరిస్తోంది. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంది. ఈనెల 17న టీజర్‌ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

స్పోర్ట్స్

వరంగల్ ● శనివారం 15 మార్చి 2025

ఒకటా.. రెండా?



- తొలి టైటిల్ కోసం ఢిల్లీ ఆరాటం
- రెండోసారి మురిసేందుకు ముంబై ప్రయత్నం
- మహిళల ప్రీమియర్ లీగ్

నేడు ఇరు జట్ల మధ్య ఫైనల్

ముంబై: నెల రోజులపాటు క్రికెట్ అభిమానులను అలరించిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మూడో సీజన్ ఆఖరి అంకానికి చేరుకుంది. శనివారం ముంబై ఇండియన్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్ల మధ్య ఫైనల్ ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియం వేదికగా జరుగనుంది. 2023లోనూ ఈ రెండు జట్ల మధ్యే తుది పోరు జరగ్గా ముంబై తొలిసారి విజేతగా నిలిచింది. ఇక వరుసగా మూడోసారి ఫైనల్‌కు చేరిన ఢిల్లీ ఈ లీగ్ చరిత్రలోనే అత్యంత నిలకడైన జట్టుగా పేరు తెచ్చుకుంది. కానీ అన్నిసార్లూ రన్నరప్‌గానే సంతృప్తి చెందాల్సి వచ్చింది. మెగ్ లానింగ్ నేతృత్వంలోని ఈ టీమ్ ఈసారి మాత్రం కప్ కొట్టాల్సిందేనన్న కసితో ఉంది. తాజా సీజన్‌లో ఈ రెండు జట్లు అన్ని విభాగాల్లోనూ సమవుజ్జీలుగా కనిపించాయి. ఇరుజట్లు లీగ్‌లో తామాడిన 8 మ్యాచ్‌ల్లో 5 విజయాలు, 3 ఓటముల చొప్పున ఉండడం గమనార్హం. రన్‌రేట్ పరంగా మాత్రమే డీసీ నేరుగా తుది పోరుకు అర్హత సాధించింది. అయితే ఆర్‌సీబీ చేతిలో అనూహ్య ఓటమి తర్వాత ముంబై ఎలిమినేటర్‌లో ఆడి అదిరే ఆటతో తిరిగి ఫైనల్లోకి అడుగుపెట్టింది. స్టార్ ఆల్‌రౌండర్లతో కూడిన ఈ జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది.

సీనియర్ల అండతో..

రెండోసారి ఫైనల్‌కు చేరిన ముంబై జట్టులో సీనియర్లు నాట్ సివర్ బ్రంట్, ఓపెనర్ హేలీ మాథ్యూస్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో సివర్ 493 రన్స్, 9 వికెట్లు.. మాథ్యూస్ 304 రన్స్, 17 వికెట్లతో అదుర్స్ అనిపించారు. అటు హర్మన్ 156.29 స్ట్రయిక్ రేట్‌తో 236 పరుగులు సాధించింది. ఈ మ్యాచ్‌లోనూ ఈ త్రయం బ్యాట్లు ఝుళిపిస్తే భారీ స్కోరు ఖాయం. బౌలింగ్‌లో అమేలియా, షబ్నిం, సైకా రాణిస్తున్నారు.

ఆత్మవిశ్వాసంతో ఢిల్లీ

ముంబైతో జరిగిన రెండు లీగ్ మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన డీసీ ఆత్మవిశ్వాసంతో ఉంది. ఈసారి హ్యాట్రిక్ విజయంతో తమ టైటిల్ స్వప్నాన్ని నెరవేర్చుకోవాలనుకుంటోంది. ఓపెనర్లు లానింగ్, షఫాలీలతో పాటు జెమీమా, సదర్లాండ్, కాప్‌లతో బ్యాటింగ్ విభాగం బలంగానే కనిపిస్తోంది. అటు ముంబై బ్యాటింగ్ పవర్‌ను కట్టడి చేసేందుకు డీసీ పేసర్లు జొనాసెన్, సదర్లాండ్, కాప్, శిఖా, స్పిన్నర్ మిన్ను సిద్ధంగా ఉన్నారు. గత రెండు మ్యాచ్‌ల్లో వీరి బౌలింగ్‌ను ముంబై దీటుగా ఎదుర్కోలేకపోయింది.

తుది జట్లు (అంచనా)

ముంబై: యాస్తిక భాటియా, మాథ్యూస్, సివర్, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), సజన, అమేలియా, అమన్‌జ్యోత్, కమలిని, సంస్కృతి, షబ్నిం ఇస్మాయిల్, సైకా ఇషాక్.

ఢిల్లీ: మెగ్ లానింగ్ (కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, సదర్లాండ్, కాప్, జొనాసెన్, సారా బ్రైస్, నికీ ప్రసాద్, శిఖా పాండే, మిన్ను మణి, టిటాస్ సాధు.



ముగింపోత్సవంలో నోరా ఫతే డ్యాన్స్

డబ్ల్యూపీఎల్ ముగింపు కార్యక్రమంలో బాలీవుడ్ నటి, డ్యాన్సర్ నోరా ఫతే తన ప్రదర్శనతో అభిమానులను ఆకట్టుకోనుంది. ఫైనల్ మ్యాచ్‌కు ముందు జరిగే ఈ ఈవెంట్‌లో 33 ఏళ్ల కెనడియన్ నోరా తన ఆట పాటలతో స్టేడియాన్ని హోరెత్తించేందుకు సిద్ధమవుతున్నట్టు లీగ్ నిర్వాహకులు ప్రకటించారు.



అక్షర్‌కు ‘ఢిల్లీ’ పగ్గాలు

న్యూఢిల్లీ: ఐపీఎల్ మరో వారం రోజుల్లో ఆరంభం కానుండగా, ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ తమ కొత్త కెప్టెన్‌ను ప్రకటించింది. స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌కు ఈ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు డీసీ పేర్కొంది. ఇన్నాళ్లూ డీసీ కెప్టెన్‌గా ఉన్న రిషభ్ పంత్ లఖ్‌నవూకు మారడంతో నూతన సారథి నియామకం అనివార్యమైంది. ఢిల్లీ జట్టు కెప్టెన్‌గా ఎంపికవడం సంతోషాన్నిస్తోందని, జట్టును ముందుకు నడిపించేందుకు ఎదురుచూస్తున్నట్టు అక్షర్ చెప్పాడు. వేలానికి ముందే అక్షర్‌ను డీసీ జట్టు రూ.16.5 కోట్లకు అట్టిపెట్టుకున్న సంగతి తెలిసిందే. ఇక 2019 నుంచి క్యాపిటల్స్ తరఫున అక్షర్ 82 మ్యాచ్‌లు ఆడాడు. ఓవరాల్‌గా 150 లీగ్ మ్యాచ్‌ల్లో అతను 1653 పరుగులు సాధించి, 123 వికెట్లు పడగొట్టాడు.

లాహోర్‌లో మహిళల వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్

న్యూఢిల్లీ: మహిళల వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయర్ టోర్నమెంట్‌కు పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనుంది. ఆరు జట్లు పాల్గొనే ఈ ఈవెంట్ వచ్చేనెల 9 నుంచి 19 వరకు లాహోర్‌లో జరగనుంది. పూర్తిస్థాయి సభ్య దేశాలైన ఆతిథ్య పాకిస్థాన్, బంగ్లాదేశ్, వెస్టిండీస్, ఐర్లాండ్‌లతో పాటు అసోసియేట్ సభ్యదేశాలు స్కాట్లాండ్, థాయ్‌లాండ్ జట్ల మధ్య ఈ టోర్నీ జరగనుంది. తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు ఈ ఏడాది అక్టోబరు-నవంబరులో భారత్ వేదికగా జరిగే మహిళల వన్డే వరల్డ్‌కప్‌నకు అర్హత సాధిస్తాయి. ఈ వరల్డ్‌కప్‌లో ఎనిమిది జట్లు తలపడనున్నాయి. కాగా, ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్ (2022-25) సైకిల్‌లో భాగంగా తొలి ఆరు స్థానాల్లో నిలవడం ద్వారా ఆతిథ్య భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక నేరుగా వరల్డ్‌కప్‌కు అర్హత సాధించాయి. మిగిలిన రెండు జట్లు క్వాలిఫయర్ ఈవెంట్ ద్వారా ఎంపికవుతాయి.

ముగిసిన భారత్ పోరు

- లక్ష్య సేన్, గాయత్రి జోడీ అవుట్
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: ఎన్నో అంచనాలతో ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ బరిలోకి దిగిన భారత షట్లర్లు నిరాశపరిచారు. సింగిల్స్‌లో మిగిలిన మాజీ రన్నరప్ లక్ష్య సేన్, డబుల్స్‌లో ఆశలు రేపిన పుల్లెల గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ సెమీఫైనల్స్ చేరకుండానే నిష్క్రమించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో లక్ష్య సేన్ 10-21, 16-21తో చైనాకు చెందిన ప్రపంచ ఆరో ర్యాంకర్ లి షి ఫెంగ్ చేతిలో ఓటమి పాలయ్యాడు. 2022 ఫైనలిస్టు అయిన లక్ష్య.. 45 నిమిషాలపాటు సాగిన ఏకపక్ష పోరులో ప్రత్యర్థి ధాటికి ఏ దశలోనూ బదులివ్వలేక వరుస గేముల్లో వెనుదిరిగాడు. కాగా, మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 14-21, 10-21తో చైనా జోడీ, రెండో సీడ్ లూ షెంగ్షూ/టాన్ నింగ్ చేతిలో పరాజయం పాలైంది. సింగిల్స్‌లో పీవీ సింధు, ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఈ టోర్నీలో భారత షట్లర్ల పోరు పూర్తిగా ముగిసినట్టయింది.

ముంబై తొలిపోరుకు హార్దిక్ దూరం



ముంబై: ఈ సీజన్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తొలి మ్యాచ్‌కు కెప్టెన్ హార్దిక్ పాండ్యా దూరం కానున్నాడు. ఇందుకు కారణం, అతనిపై ఓ మ్యాచ్ నిషేధం ఉండడమే. ఈ నిషేధం గత సీజన్‌లోది కావడం గమనార్హం. వివరాల్లోకెళ్తే.. గతేడాది ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టు మూడుసార్లు స్లో ఓవర్ రేట్‌కు పాల్పడింది. దీంతో నిబంధనల ప్రకారం ఆ జట్టు కెప్టెన్‌గా హార్దిక్ రూ. 30 లక్షల జరిమానా ఎదుర్కోవడంతో పాటు ఓ మ్యాచ్ నిషేధానికి గురయ్యాడు. అయితే, ఆ జట్టు దారుణ వైఫల్యంతో గ్రూప్ దశలోనే నిష్క్రమించి, ప్లేఆఫ్స్‌కు దూరమవడంతో పాండ్యాపై మ్యాచ్ నిషేధం సాధ్యం కాలేదు. దీంతో ఈ సీజన్‌లో ఈనెల 23న చెన్నైలో సీఎస్‌కే జట్టుతో ముంబై ఇండియన్స్ ఆడే తమ తొలి మ్యాచ్‌కు హార్దిక్ దూరమవక తప్పని పరిస్థితి నెలకొంది. పాండ్యాపై వేటు నేపథ్యంలో తొలి మ్యాచ్‌కు ముంబై కెప్టెన్‌గా ఎవరు వ్యవహరిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.



బుమ్రా వచ్చేదెప్పుడో!

వెన్నునొప్పితో బాధపడుతున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తాజా ఐపీఎల్‌లో ఎప్పుడు చేరతాడనేది సందేహంగా మారింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో గాయపడిన అతడు రెండున్నర నెలలుగా క్రికెట్‌కు దూరంగానే ఉంటున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించాకే బుమ్రాను లీగ్‌లోకి అనుమతించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలో తను ముంబై ఇండియన్స్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. వచ్చే నెల రెండో వారంలో బుమ్రా జట్టుతో కలిసే అవకాశం ఉన్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే ముంబై ఆడే తొలి ఐదు మ్యాచ్‌లకు బుమ్రా అందుబాటులో ఉండడు. ‘ఎన్ని మ్యాచ్‌లకు దూరం కానున్నాడనేది ఇప్పుడే తెలియదు. లీగ్ ఆరంభమయ్యాక ఏదో దశలో జట్టుతో చేరుతాడు. అయితే ఇందుకు బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి అనుమతి తప్పనిసరి’ అని ఓ క్రీడా వెబ్‌సైట్ పేర్కొంది. ఈనెల 23న ముంబై జట్టు చెన్నైతో తొలి మ్యాచ్ ఆడనుంది.

లంక మహిళలు అదరగొట్టారు

కివీస్ గడ్డపై తొలి టీ20 గెలుపు



మల్కి మదార (3/14)

క్రైస్ట్‌చర్చ్: శ్రీలంక మహిళల క్రికెట్ జట్టు న్యూజిలాండ్ గడ్డపై అదరగొట్టింది. ఇక్కడ పొట్టి ఫార్మాట్‌లో ఆతిథ్య జట్టుపై తొలి విజయాన్ని నమోదుచేసింది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో లంక 7 వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తుగా ఓడించింది. అరంగేట్ర బౌలర్, ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ మల్కి మదార (3/14) సత్తా చాటడంతో.. మొదట కివీస్ 18.5 ఓవర్లలో 101 పరుగులకే కుప్పకూలింది. కివీస్ బ్యాటర్లలో ఎమ్మా మెక్‌లాయిడ్ (44) టాప్ స్కోరర్. కవిష దిల్హరి (2/18), ఇనోషి ప్రియదర్శని (2/25) చెరో రెండు వికెట్లు తీశారు. ఛేదనలో కెప్టెన్ చమరి ఆటపట్టు (64 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో చెలరేగడంతో లంక 14.1 ఓవర్లలో 102/3 స్కోరు చేసి గెలిచింది. ఓవరాల్‌గా టీ20ల్లో కివీస్‌పై లంకకిది రెండో గెలుపు.

రోహిత్ రిటైర్ కానవసరంలేదు!



డివిల్లీర్స్

న్యూఢిల్లీ: వన్డేల నుంచి రోహిత్ శర్మ రిటైర్ కావాల్సిన అవసరం లేదని దక్షిణాఫ్రికా బ్యాటింగ్ దిగ్గజం డివిల్లీర్స్ తేల్చి చెప్పాడు. క్రికెట్ చరిత్రలో..వన్డేలలో గొప్ప కెప్టెన్‌గా నిలవగలిగే సత్తా రోహిత్‌కు ఉందని పేర్కొన్నాడు. చాంపియన్స్ ట్రోఫీ అనంతరం 50 ఓవర్ల ఫార్మాట్‌కు రోహిత్ వీడ్కోలు పలుకుతాడని వార్తలొచ్చిన విషయం విదితమే. అయితే తాను వన్డేలనుంచి వైదొలగడంలేదని చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ విజయానంతరం భారత కెప్టెన్ స్పష్టంజేశాడు. ‘మిగతా సారథులతో పోలిస్తే కెప్టెన్‌గా రోహిత్ విజయాల శాతం (74) ఎంతో మెరుగ్గా ఉంది. ఇది గతంలో ఏ సారథికీ లేదు. అతడు ఇలాగే సాగితే వన్డేలలో అన్ని తరాలకు అత్యుత్తమ కెప్టెన్‌గా నిలవడం ఖాయం’ అని తన యూట్యూబ్ చానెల్‌లో డివిల్లీర్స్ అభిప్రాయపడ్డాడు.

బిజినెస్

వచ్చే ఆర్థిక సంవత్సరం ఐటీలో 1.5 లక్షల ఫ్రెషర్ల నియామకాలు!

2024-25తో పోలిస్తే దాదాపు రెట్టింపు హైరింగ్!!

న్యూఢిల్లీ: ఐటీ రంగంలో మళ్లీ ఉద్యోగావకాశాలు పెరగనున్నాయని, సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రాంగణ నియామకాల జోరు పెంచే అవకాశాలు కన్పిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఫ్రెషర్ల నియామకాలు 1.5 లక్షల స్థాయిని దాటవచ్చని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)తో పోలిస్తే దాదాపు రెట్టింపు కావచ్చన్న అంచనాలున్నాయి. ఈ నెలాఖరుతో ముగియనున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐటీ కంపెనీల ఫ్రెషర్ల హైరింగ్ 85,000-95,000కు పరిమితం కావచ్చని రిక్రూట్‌మెంట్ సేవల సంస్థ టీమ్‌లీజ్ భావిస్తోంది.

సవాళ్ల సంద్రంలో ఐటీ: ప్రస్తుతం దేశీయ ఐటీ రంగం పలు సవాళ్లు ఎదుర్కొంటోంది. ఒకవైపు సాంకేతిక పరివర్తనం.. మరోవైపు ప్రధాన ఆదాయ వనరైన ఉత్తర అమెరికా మార్కెట్లో ఐటీ వ్యయాలు తగ్గడం. ఈ రెండు కారణాల వల్ల కంపెనీలు గత ఏడాదిలో ముందు జాగ్రత్త ధోరణితో వ్యవహరించాయి. వ్యయ నియంత్రణ సాకుతో ఉద్యోగాల్లో కోతలు పెట్టాయి. ప్రాంగణ నియామకాలూ పరిమిత స్థాయిలోనే జరిగాయి. ఐటీ రంగంలో ఇప్పుడిప్పుడే హైరింగ్ మళ్లీ పెరుగుతోందని, కంపెనీలు ముఖ్యంగా ఫ్రెషర్లతో పాటు ప్రత్యేక నిపుణుల నియామకాలపై దృష్టిసారించాయని రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలంటున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ పరివర్తన నిపుణులకు డిమాండ్ పెరిగిందని టీమ్‌లీజ్ డిజిటల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నీతి శర్మ తెలిపారు.

మళ్లీ మాంద్యం భయాలు: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల వడ్డనతో అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి పెరిగింది. యూఎస్ మళ్లీ మాంద్యంలోకి జారుకోవచ్చన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. అమెరికాలో ఆర్థిక మాంద్యం మన ఐటీ రంగానికి ప్రతికూల పరిణామమే. కాస్త మెరుగవుతూ వస్తున్న నియామకాల సెంటిమెంట్‌ను మళ్లీ దెబ్బతీయవచ్చని కొందరు భావిస్తున్నారు.

ప్రత్యేక నిపుణులకు భారీ డిమాండ్

జెనరేటివ్ ఏఐతో వచ్చిన సాంకేతిక పరివర్తన కారణంగా ఐటీ రంగంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వారికి భారీగా డిమాండ్ నెలకొందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. ఏఐ, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, క్లౌడ్ సెక్యూరిటీ, క్లౌడ్ ఆర్కిటెక్ట్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ నిపుణులకు ఆకర్షణీయ పారితోషికం ఆఫర్ చేసేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని రిక్రూటింగ్ ఏజెన్సీలంటున్నాయి. ఫ్రెషర్లు కోడింగ్‌తో పాటు ఆధునిక టెక్నాలజీల్లోనూ ప్రావీణ్యం సాధించగలిగితే భారీ వేతనంతో కూడిన ఉద్యోగం దక్కించుకోవచ్చని వారంటున్నారు.

పసిడి రికార్డు పరుగు

అంతర్జాతీయ బులియన్ మార్కెట్లో 3,000 డాలర్లు దాటిన ఔన్స్ గోల్డ్

దేశీయంగానూ సరికొత్త గరిష్ఠానికి..



న్యూఢిల్లీ: బంగారం ధరలు మళ్లీ కొండెక్కుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ తొలిసారిగా 3,000 డాలర్ల మైలురాయిని దాటింది. శుక్రవారం ఒక దశలో 0.6 శాతం పెరుగుదలతో 3,009.10 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. సిల్వర్ కూడా ఒక శాతానికి పైగా పెరిగి 34.65 డాలర్లకు ఎగబాకింది. ట్రంప్ సుంకాల వడ్డనతో అంతర్జాతీయంగా పెరిగిన వాణిజ్య ఉద్రిక్తతలతో పాటు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వచ్చే సమీక్షలో ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు తాజా గోల్డెన్ ర్యాలీకి ఆజ్యం పోశాయి. ఎందుకంటే, ఆర్థిక అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా బంగారానికి పేరుంది. ఇందుకుతోడు, అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లు భారీగా దిద్దుబాటుకు లోనవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఈ విలువైన లోహాల్లోకి మళ్లిస్తుండటంతో బంగారం, వెండికి డిమాండ్ అనూహ్యంగా పెరిగి గత రెండు వారాలుగా ధరలు వేగంగా ఎగబాకుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఆయా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు సైతం పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటూ వస్తుండటం ప్రస్తుత గోల్డ్ ర్యాలీకి మరో కారణమని వారన్నారు.

ఏడాది చివరి నాటికి 3,300 డాలర్లకు!?

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఈ ఏడాదిలో ఇప్పటివరకు 14 శాతానికి పైగా పెరిగింది. ట్రంప్ సుంకాలతో మున్ముందు ఆర్థిక అనిశ్చితులు మరింత తీవ్రతరమయ్యే అవకాశాలున్నాయి. ఇందుకుతోడు, అమెరికా మళ్లీ ఆర్థిక మాంద్యంలోకి జారుకోవచ్చన్న అంచనాలూ ఉన్నాయి. ఇదే గనక జరిగితే, బంగారం, వెండి ధరలు మరింత ఎగబాకడం ఖాయమని బులియన్ విశ్లేషకులు అంటున్నారు. వచ్చే వారమూ గోల్డ్ ర్యాలీ కొనసాగవచ్చని శాక్సో బ్యాంక్ కమోడిటీ విభాగ అధిపతి అన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఔన్స్ గోల్డ్ 3,300 డాలర్లకు చేరుకోవచ్చని ఆయన అంచనా వేశారు. కాగా, అంతర్జాతీయ బ్యాంకింగ్, ఆర్థిక సేవల సంస్థ ఏఎన్‌జెడ్ ఈ ఏడాది గోల్డ్ టార్గెట్‌ను 3,050 డాలర్లుగా అంచనా వేసింది.

మన దగ్గర రూ.లక్ష దాటుద్దా..?

అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ పసిడి ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠానికి చేరాయి. హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.1,200 పెరుగుదలతో దాదాపు రూ.90,000 (రూ.89,780)కు చేరింది. 22 క్యారెట్ల లోహం రూ.82,300 పలికింది. కిలో వెండి రూ.1.12 లక్షలకు ఎగబాకింది. బులియన్ విశ్లేషకుల అంచనాల ప్రకారం.. ఈ ఏడాది చివరి నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ 3,300 డాలర్లకు చేరితే, దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం రూ.లక్ష దాటే అవకాశాలున్నాయి.

నగలపై భారీ డిస్కౌంట్లు


పసిడి ధరలు ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి పెరగడంతో స్వర్ణాభరణాలకు గిరాకీ భారీగా తగ్గిందని, కస్టమర్లు వేచి చూసే ధోరణిలో ఉన్నారని చెన్నైకి చెందిన బులియన్ వర్తకుడు ఒకరు వెల్లడించారు. దాంతో జువెలర్లు నగలపై భారీ డిస్కౌంట్లు ఆఫర్ చేస్తున్నారని, ఈ డిస్కౌంట్లు 8 నెలల క్రితం నాటికి గరిష్ఠ స్థాయికి చేరాయని వారన్నారు.

రెపో రేటు మరో 0.75 % తగ్గింపు!

ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా


ముంబై: దేశంలో వడ్డీ రేట్లు మరింత తగ్గనున్నాయి. ప్రస్తుతం 6.25 శాతంగా ఉన్న రెపో రేటును.. ఈ ఏడాది అక్టోబరులోగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ).. ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ముప్పావు శాతం (0.75 శాతం) వరకు తగ్గించే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ వెల్లడించింది. ఏప్రిల్, జూన్, అక్టోబరు నెలల్లో జరిగే ద్వైమాసిక పరపతి, ద్రవ్య విధాన సమీక్షల్లో పావు శాతం (0.25 శాతం) చొప్పున ఎంపీసీ ఈ తగ్గింపు ప్రకటించే అవకాశం ఉందని పేర్కొంది. దిగొస్తున్న రిటైల్ ద్రవ్యోల్బణమే ఇందుకు కారణమని తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మొత్తానికి 4.7 శాతంగా ఉండే రిటైల్ ద్రవ్యోల్బణం వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో 4.2 శాతం మించకపోవచ్చని అంచనా వేసింది. ఫిబ్రవరిలో 3.6 శాతానికి పడిపోయిన రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం మొత్తానికి చూసినా 3.9 శాతం మించకపోవచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. దీంతో వచ్చే ఏప్రిల్ నుంచే ఆర్‌బీఐ రెపో రేటు కోతకు సిద్ధమవుతుందని భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	385	విజయవాడ	420
వరంగల్	387	గోదావరి	390
చిత్తూరు	443	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	78	విజయవాడ	85
వరంగల్	78	గుంటూరు	85
కరీంనగర్	78	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	78	చిత్తూరు	89
కర్నూలు	78	నెల్లూరు	94
విశాఖపట్నం	79	అనంతపురం	94
గోదావరి	85		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,780 ▲	82,300 ▲	1,12,000 ▲
విజయవాడ	90,500 ▲	85,800 ▲	1,03,000 ▲
విశాఖపట్నం	88,530 ▲	81,150 ▲	1,01,660 ▲
రాజమండ్రి	89,780 ▲	82,300 ▲	1,03,200 ▲
ప్రొద్దుటూరు	89,250 ▲	82,650 ▲	1,00,200 ▲
ముంబై	86,843 ▲	79,548 ▲	98,322 ▲

24-25 తేదీల్లో బ్యాంకింగ్ ఉద్యోగుల సమ్మె

కోల్‌కతా: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) ఉద్యోగులు మరోసారి సమ్మెకు సిద్ధమవుతున్నారు. తమ కీలక డిమాండ్ల సాధన కోసం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)తో జరిగిన చర్చలు విఫలమవడంతో గతంలో నిర్ణయించిన విధంగా ఈ నెల 24-25 తేదీల్లో దేశవ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నట్టు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ప్రకటించింది. పీఎస్‌బీల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టుల భర్తీ, వారానికి ఐదు రోజుల పని విధానంతో సహా ఏ అంశంపైనా ఐబీఏ దిగి రాలేదని బ్యాంకింగ్ ఉద్యోగుల జాతీయ సమాఖ్య (ఎన్‌సీబీఈ) ప్రధాన కార్యదర్శి ఎల్ చంద్రశేఖర్ చెప్పారు. పనితీరు ఆధారంగా ఉద్యోగులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్‌ఎస్) జారీ చేసిన ఆదేశాలనూ ఉద్యోగ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇది తమ ఉద్యోగ భద్రతను దెబ్బతీస్తుందని పేర్కొన్నాయి.

వారెన్ బఫెట్ ముందుచూపు

రూ.28.29 లక్షల కోట్ల విలువైన షేర్ల అమ్మకం

అవకాశం కోసం ఎదురు చూపులు

న్యూయార్క్: స్టాక్ మార్కెట్ పెట్టుబడులతో రూ.లక్షల కోట్లు సంపాదించిన అమెరికా కుబేరుడు, ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ ముందే జాగ్రత్త పడ్డారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మరోసారి అధికారం చేపడితే స్టాక్ మార్కెట్ కుప్పకూలే ప్రమాదం ఉందని ముందే ఊహించినట్టున్నారు. గత ఏడాది నవంబరులో అమెరికా స్టాక్ మార్కెట్ గరిష్ఠ స్థాయికి చేరగానే తన పోర్ట్‌ఫోలియో షేర్లలో చాలా వాటిని అమ్మేసి 32,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.28.29 లక్షల కోట్లు) నగదు దగ్గర పెట్టుకున్నారు. ఈ నగదును ఎప్పుడు కావాలంటే అపుడు మళ్లీ షేర్లలో మదుపు చేసేందుకు వీలుగా స్వల్పకాలిక ట్రెజరీ బిల్స్, లిక్విడ్ ఆస్తుల్లో మదుపు చేశారు.

అవకాశం కోసం నిరీక్షణ: 2008 ఆర్థిక సంక్షోభానికి ముందూ వారెన్ బఫెట్ ఇలానే జాగ్రత్త పడ్డారు. ప్రధాన కంపెనీల షేర్లు భారీగా పడిపోయిన వెంటనే చౌకగా వాటిని కొని సొమ్ము చేసుకున్నారు. ఇప్పుడు కూడా బఫెట్ అలాంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్నారని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. మార్కెట్ పతనంపై ఒక స్పష్టత వచ్చాక బఫెట్ ఈ నగదుని మంచి కంపెనీల షేర్లలోకి మళ్లిస్తారని భావిస్తున్నారు. ట్రంప్ సుంకాల యుద్ధంతో అమెరికాతో పాటు అనేక దేశాలు ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని బఫెట్ అంచనా. అదే జరిగితే మళ్లీ బఫెట్ పంట పండినట్టే.

ఐసీఐసీఐ ప్రు ఈక్విటీ, డెట్ ఫండ్‌తో మెరుగైన రిటర్నులు

మార్కెట్లలో ఆటుపోట్లున్నా మదుపరులకు ఓ మోస్తరు నుంచి మెరుగైన రిటర్నులు అందించటంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ, డెట్ ఫండ్ కీలకంగా ఉంది. హైబ్రిడ్ ఇన్వెస్టర్లకు ఈ అగ్రెసివ్ ఫండ్ ఒక టాప్ చాయిస్‌గా ఉండటం విశేషం. ఈ హైబ్రిడ్ అగ్రెసివ్ ఫండ్ ఈక్విటీల్లో 65-80 శాతం పెట్టుబడులు పెట్టనుండగా మిగిలిన మొత్తాన్ని డెట్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్లు బుల్ రన్‌లో ఉన్నప్పుడు అద్భుతమైన రిటర్నులు అందించిన ఈ ఫండ్.. గత కొద్ది నెలలుగా కొనసాగుతున్న మార్కెట్ కరెక్షన్‌లోనూ మంచి ప్రతిఫలాలను అందించింది. కరెక్షన్ సమయంలో ఈ ఫండ్‌కు చెందిన డెట్ విభాగం చురుగ్గా వ్యవహరించి పెట్టుబడులు పెడుతుండటమే ఇందుకు కారణంగా ఉంది. 1999 నవంబరులో ప్రారంభమైన ఈ ఫండ్ నిర్వహణలో రూ.39,886 కోట్ల విలువైన ఆస్తులున్నాయి. ఈ ఫండ్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి నెలా రూ.10,000 ఇన్వెస్ట్ చేసి ఉంటే ఆ మొత్తం రూ.30 లక్షలకు చేరుకోగా..విలువ మాత్రం ఏకంగా రూ.3 కోట్లుగా ఉంది.

- లారిట్ నుడ్సెన్ (గతంలో ఎల్ అండ్ టీ స్విచ్ గేర్).. మార్కెట్లోకి కొత్త తరం స్మార్ట్ ఎనర్జీ, ఆటోమేషన్ సొల్యూషన్స్‌ను విడుదల చేసింది. పరిశ్రమలు, ఓఈఎంల కోసం ప్రత్యేకంగా కంపెనీ ఈ ఉత్పత్తులను రూపొందించింది.
- షామీ ఇండియా.. షామీ 15 సిరీస్ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. ఇందులో 12జీబీ ప్లస్ 512 జీబీ మెమొరీతో కూడిన షామీ 15 ధర రూ.64,999గా ఉండగా షామీ 15 అల్ట్రా (16 జీబీ ప్లస్ 512 జీబీ మెమొరీ) ధర రూ.1,09,999గా ఉంది. ఈ నెల 19 నుంచి ఈ ఫోన్ల ప్రీ బుకింగ్ ప్రారంభం కానుంది. కాగా ఏప్రిల్ 3 నుంచి ఈ స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉండనుంది.

ఫాంహౌస్‌ను గతంలోనే లీజుకు ఇచ్చా..
కోడి పందేల గురించి తెలియదు

» పోలీసుల విచారణలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి


మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు వెళ్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి

మొయినాబాద్ మార్చి14(ఆంధ్రజ్యోతి): ఫాంహౌస్‌లో కోడి పందేలు, క్యాసినో నిర్వహించిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని మొయినాబాద్ పోలీసులు విచారించారు. పోలీస్ స్టేషన్‌లో సుమారు నాలుగున్నర గంటల పాటు వివిధ అంశాలపై ఎమ్మెల్సీని ప్రశ్నించి వివరాలు రాబట్టే ప్రయత్నం చేశారు. అయితే తన ఫాంహౌస్‌ను గతంలోనే లీజుకిచ్చినట్లు.. అక్కడ కోడి పందేల గురించి తనకు తెలియదని ఆయన పోలీసులకు చెప్పారు. ఫిబ్రవరి 11న తోల్‌కట్టలోని ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి ఫాంహౌస్‌లో కోడిపందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి 61 మందిని పట్టుకొని, 84 కోళ్లను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులు శ్రీనివాస్‌రెడ్డికి రెండోసారి నోటీసులు ఇవ్వగా ఆయన శుక్రవారం ఉదయం 11.30 గంటలకు విచారణకు హాజరయ్యారు. 'నా ఫాంహౌస్ వ్యవహారాలన్నీ మేనల్లుడు జ్ఞానదేవ్‌రెడ్డి చూసుకునే వారు. అయితే జ్ఞానదేవ్‌రెడ్డి ఆ భూమిని రమేశ్‌కుమార్‌రెడ్డికి కొన్నాళ్ల కింద కౌలుకు ఇచ్చాడు.. ఆ రమేశ్‌కుమార్‌రెడ్డి దాన్ని వెంకటపతిరాజుకు లీజుకు ఇచ్చాడు. ఈ విషయం నాకు తెలియదు. కోడి పందేల ఘటన జరిగిన రోజే జ్ఞానదేవ్‌రెడ్డి చెప్పాడు' అని శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు తెలిపారు. ఈ నేపథ్యంలోనే లీజు డాక్యుమెంట్లు చూపించమని పోలీసులు అడగ్గా గతంలోనే తన న్యాయవాదితో పంపానని, ఇప్పుడు మాత్రం తేలేదని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. దీంతో.. మళ్లీ ఎప్పుడు విచారణకు పిలిచినా రావాలని ఏసీపీ కిషన్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్సీకి సూచించారు. కేసు విచారణకు పూర్తిగా సహకరిస్తానని ఆయన కూడా బదులిచ్చారు.

ఎస్సీ వర్గీకరణలో ఏపీ ముందంజ

» తెలంగాణలో నిర్లక్ష్యం!: మంద కృష్ణ మాదిగ

ఒంగోలు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ముందుకు సాగుతుందని విశ్వసిస్తున్నాం. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డిలో నిజాయితీ, చిత్తశుద్ధి లోపించింది. దీంతో కొన్ని అడ్డంకులు ఎదురవుతున్నాయి' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు మున్నంగి లక్ష్మయ్యను ఒంగోలులో శుక్రవారం మంద కృష్ణ పరామర్శించారు. అనంతరం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... 'మాదిగలతోపాటు, వర్గీకరణ కోరుకున్న దళిత కులాలకు చంద్రబాబుతో మేలు జరుగుతుంది. వర్గీకరణ చేసి, మరిన్ని ఫలాలు అందించాలన్న ఆయన ఆలోచనలను పరిణామాలు ప్రతిఫలిస్తున్నాయి. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రిపోర్టు అందగానే ఆ అంశంపై సీఎం మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయడంతో ఆ ప్రక్రియ వేగవంతం అవుతుంది. ఈ విషయంలో చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లుగా తెలుస్తుంది. ఎస్సీ వర్గీకరణకు నెలరోజుల్లోనే శాశ్వత పరిష్కారం లభించనుంది. ఇప్పటివరకు రిజర్వేషన్ ఫలాలు దక్కని మాదిగ, రెల్లి, ఇతర ఉపకులాలకు త్వరలోనే న్యాయం జరుగుతుంది' అని పేర్కొన్నారు.

బాబుపై అభ్యంతరకర పోస్టు.. ఒకరిపై కేసు

దుగ్గిరాల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ముఖంపై చెప్పు పెట్టిన ఫొటోను షేర్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టుపెట్టిన వ్యక్తిపై కేసు నమోదు అయింది. గుంటూరు జిల్లా దుగ్గిరాల ఎస్ఐ వెంకట రవి శుక్రవారం కేసు వివరాలను మీడియాకు తెలిపారు. ఫేస్‌బుక్‌లో పెట్టిన ఆ అభ్యంతరకర పోస్టుపై దుగ్గిరాల తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మహేశ్ ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో... 'తెలంగాణకు చెందిన రావు జనార్దన్ ఈ నెల 13న ఉదయం 10 గంటలకు ఫేస్‌బుక్‌లో అభ్యంతరకరమైన పోస్టు పెట్టారు. ఆ పోస్టు మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉంది. పరువుకు భంగం కలిగించేలా ఉంది. ఆ పోస్టు పెట్టిన వ్యక్తి ఫేస్‌బుక్ ఐడీ ఆధారంగా కేసు నమోదు చేయాలి' అని పేర్కొన్నారు. మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రవి తెలిపారు.

కొత్తగూడెం ఎయిర్‌పోర్టుపై..
తుది దశకు సాధ్యాసాధ్యాల అధ్యయనం

» త్వరలోనే కేంద్రానికి నివేదిక

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించతల పెట్టిన విమానాశ్రయానికి ఒక్కొక్కటిగా అడుగులు పడుతున్నాయి. అక్కడ విమానాశ్రయం ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై చేపట్టిన అధ్యయనం తుది దశకు చేరుకుంది. త్వరలోనే కేంద్రానికి నివేదిక చేరనున్నట్టు తెలిసింది. పాల్వంచ సమీపంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 950 ఎకరాల అటవీ భూములను కేటాయించింది. అయితే అక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనువైన పరిస్థితులు, విమానాశ్రయ ఏర్పాటు ద్వారా కలిగే ప్రయోజనాలపై ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) అధ్యయనం నిర్వహిస్తోంది. పదేళ్ల వాతావరణ నివేదికలను పరిశీలించి, సమగ్ర నివేదిక తయారు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తుంది. కాగా, ఇప్పటికే వరంగల్ జిల్లా మామునూరులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కేంద్రం అనుమతినిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రిలో ఏర్పాటు చేయదలచిన విమానాశ్రయంపై దృష్టి సారించింది. ఇందుకోసం కేంద్రంతో ప్రత్యేకంగా చర్చలు జరుపుతోంది. ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నారు.

వివేకా హత్యకు నేటితో ఆరేళ్లు

» సాక్షులు,కీలక వ్యక్తుల అనుమానాస్పద మృతి


» వివేకా కేసులో ఇంకా పూర్తి కాని సీబీఐ దర్యాప్తు

కడప, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగి నేటికి (శనివారం) సరిగ్గా ఆరేళ్లు. 2019 మార్చి 14 అర్ధరాత్రి పులివెందులలో వివేకా హత్య జరగ్గా... ఇప్పటికీ సీబీఐ దర్యాప్తు కొలిక్కి రాలేదు. మరోవైపు.. ఈ కేసులో సాక్షులు, కీలక వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మరణించడం కలకలం రేపుతోంది. ఈ ఏడాది జనవరి 10న జగన్‌కు వరసకు సోదరుడి వరుస అయ్యే వైఎస్ అభిషేక్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనను సీబీఐ 2021లో విచారించగా, వివేకా చనిపోయినట్లు దేవిరెడ్డి శంకర్‌రెడ్డి నుంచి ఫోన్ కాల్ వచ్చిందని వాంగ్మూలం ఇచ్చారు. కల్లూరు గంగాధర్ రెడ్డి 2022 జూన్‌లో అనారోగ్యంతో మృతి చెందినట్లు ప్రచారం చేశారు. 'నేరాన్ని నీపై వేసుకుంటే అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి రూ.10కోట్లు ఇస్తారం'టూ దేవిరెడ్డి శంకర్‌రెడ్డి ఆఫర్ ఇచ్చారని 2021 అక్టోబరులో సీబీఐకి వాంగ్మూలం ఇచ్చిన గంగాధర్‌రెడ్డి.. ఆ తరువాత మాట మార్చారు. సింహాద్రిపురం మండలం కసుమూరుకు చెందిన కె.శ్రీనివాసులరెడ్డి 2019సెప్టెంబరు 3న అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. శ్రీనివాసులరెడ్డి బావ పరమేశ్వర్‌రెడ్డిపై వివేకా హత్య కేసుకు సంబంధించి ఆరోపణలు వచ్చాయి. జగన్ డ్రైవరుగా పనిచేసిన నారాయణ యాదవ్ 2019డిసెంబరు 6న మృతి చెందారు. వివేకా హత్య జరిగిన సమయంలో హైదరాబాద్‌లో ఉన్న జగన్, భారతి రోడ్డు మార్గాన పులివెందులకు వచ్చారు. ఆ సమయంలో వారి కారు డ్రైవర్‌గా నారాయణ యాదవ్ ఉన్నారు. ఇక జగన్ మామ ఈసీ గంగిరెడ్డి 2020 అక్టోబరు 3న అనారోగ్యంతో మృతి చెందారు. వివేకా మృతదేహానికి గంగిరెడ్డి ఆస్పత్రిలోనే కుట్లు, బ్యాండేజీ వేశారు. తాజాగా ఈ నెల ఐదోతేదీన వివేకా ఇంటి వాచ్‌మన్, ప్రత్యక్ష సాక్షి రంగన్న అనుమానాస్పద స్థితిలో మరణించడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

శ్రీశైలం హైవేపై మరోమారు ట్రాఫిక్ సర్వే!

రోజుకు తిరిగే వాహనాల సగటెంత?.. అందులో శ్రీశైల క్షేత్రానికి వెళ్లే వాహనాలెన్ని?

ఆంధ్రప్రదేశ్‌కు ఎన్ని వెళ్తున్నాయి?.. హైవే ప్రారంభం-గమ్యస్థానం విధానంలో సర్వే



హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం హైవేలో ట్రాఫిక్ తీరుతెన్నులపై రాష్ట్ర ప్రభుత్వం మరోమారు సర్వే నిర్వహించనుంది. ఇప్పటికే ఓసారి సర్వే పూర్తవ్వగా.. రూ. 7,668 కోట్ల అంచనా వ్యయంతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గాను సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను కేంద్రానికి సమర్పించింది. ఈ సర్వే ప్రకారం ఈ రోడ్డుపై రోజుకు సగటున 7,181 వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు తేలింది. ప్రాంతాల వారీగా మన్ననూర్ చెక్‌పోస్టు వరకు 7,668.. మన్ననూర్-వట్టర్‌పల్లి మధ్య 6,880.. వట్టర్‌పల్లి-ఈగలపెంట మధ్య 7,005 వాహనాలు తిరుగుతున్నట్లు తేలింది. ఈ రహదారిపై ఏటా 8% చొప్పున ట్రాఫిక్ పెరుగుతూ.. 2027కల్లా వాహనాల సంఖ్య 10,100 సగటుకు చేరుతుందని అధికారులు అంచనా వేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో కేంద్రం రీసర్వేకు ఆదేశించింది. ఇలా ప్రాంతాల వారీగా కాకుండా.. హైవే ప్రారంభం-గమ్యస్థానం (ఆరిజన్-డెస్టినేషన్) విధానంలో సర్వే నిర్వహించాలని సూచించింది. దీంతో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారులు రీసర్వేకు సిద్ధమయ్యారు. హైవే మొత్తంలో వాహనాల సగటుతోపాటు.. శ్రీశైలం క్షేత్రానికి ఎన్ని వాహనాలు వెళ్తున్నాయి? ఆంధ్రప్రదేశ్‌కు ఎన్ని వెళ్తున్నాయి? అనే వివరాలను సేకరించనున్నారు. దాంతోపాటు.. కొత్త రోడ్డు ఏర్పాటైతే వినియోగం ఎలా ఉంటుంది? ప్రయాణికులు పాత రోడ్డునే ఎంచుకుంటారా? అనే దానిపై వాహనదారుల అభిప్రాయాన్ని సేకరించనున్నారు. ఈ నెలాఖరులోగా ఈ సర్వేను పూర్తిచేసి, కేంద్రానికి నివేదికను అందజేస్తారు. దీంతోపాటు.. ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

విధాన ప్రభుత్వం!

ప్రతి రంగానికీ ప్రత్యేక పాలసీ.. దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు

» విద్య, వ్యవసాయ రంగాలకు కమిషన్లు

» పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక రాయితీలు

» ఎంఎస్ఎంఈలకూ ప్రత్యేక విధానం

» యువతలో నైపుణ్యాభివృద్ధికి వర్సిటీ



హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ రంగమూ అభివృద్ధికి నోచుకోలేదని, రాష్ట్రాభివృద్ధి పట్ల ఒక విధానమన్నదే లేకుండా ఆ పార్టీ పాలన సాగించిందన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదే పదే చేసే విమర్శ. తమ ప్రభుత్వం మాత్రం బీఆర్ఎస్‌లా కాకుండా.. వివిధ రంగాల్లో దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకెళ్తోందని ఆయన చెబుతుంటారు. ఆ లక్ష్యాల సాధన కోసం తగిన విధానాలను (పాలసీ) రూపొందించిన విషయాన్నీ వివరిస్తుంటారు. దీర్ఘకాలంలో వృద్ధిరేటు ఒక స్థాయికి చేరుకునేలా ఈ విధానాలను రూపొందించినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. ఇందులో భాగంగానే క్రీడలు, పర్యాటకం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రెన్యువబుల్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రిక్ వాహనాలు, మైనింగ్ సహా వివిధ అంశాలపై కొత్తగా పాలసీలను రూపొందించిన విషయాన్ని గుర్తు చేస్తోంది. వీటితో పాటు విద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కమిషన్లను ఏర్పాటు చేసింది. ఇప్పటికే విద్యా కమిషన్ మూడు రకాల నివేదికలను ప్రభుత్వానికి అందజేసింది. రాష్ట్రంలో విద్యారంగాన్ని పటిష్ఠం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, అవలంబించాల్సిన విధానాలను ఆ నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం ఉన్న సమస్యలను కూడా నివేదించింది. వీటిపై ప్రభుత్వం త్వరలోనే చర్యలకు ఉపక్రమించనున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయడం, సాగు రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతికతను ప్రవేశపెట్టడం వంటి చర్యలు తీసుకుంటోంది. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని స్థాపించింది. తద్వారా వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించనుంది.

పర్యాటక పెట్టుబడులు..

పర్యాటకానికి కూడా ప్రభుత్వం ప్రత్యేక పాలసీని తీసుకొచ్చింది. దీని ద్వారా రూ.లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే ప్రపంచ సుందరి పోటీలను ఈసారి తెలంగాణలో నిర్వహిస్తామంటూ మిస్ వరల్డ్ నిర్వాహకుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని ఆమోదించింది. తద్వారా ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పేరు మారుమోగుతుందని భావిస్తోంది. అదే సమయంలో రాష్ట్రంలోని పరిస్థితులు, ప్రభుత్వ పాలసీలు పెట్టుబడిదారులకు తెలిసే అవకాశం ఉంటుందని, దాంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వారు ముందుకు వస్తారని ఆశాభావంతో ఉంది. ప్రధానంగా సోలార్, పంప్డ్ స్టోరేజీ, ఎనర్జీ రంగాల్లో ప్రత్యేక పాలసీ రూపొందించడం, రాయితీలను ప్రకటించడంతో బడా కంపెనీలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. ఇప్పటికే కొన్ని కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందాలు కూడా చేసుకున్నాయి. ఎకో, మెడికల్ టూరిజం, బుద్ధిస్ట్ సర్క్యూట్‌ల ఏర్పాటుతో ఈ విభాగాల్లోనూ ప్రత్యేక పర్యాటకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది.

విద్యుత్తు వాహనాల విషయంలోనూ ప్రత్యేక రాయితీలతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం కూడా ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకొచ్చింది.

ఇసుక సరఫరాకు ప్రత్యేక పాలసీ..

మైనింగ్ పాలసీలో ప్రధానంగా ఇసుక సరఫరా కోసం ప్రత్యేకంగా ఒక విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడంతోపాటు లాభాలు ఆర్జించే విధంగా ప్రణాళికలు వేస్తోంది. ఇసుక సరఫరాపై ఫిబ్రవరిలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించి.. సూచనలు చేసిన తరువాత తీసుకున్న చర్యలతో ఇసుక విక్రయాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. దాని ప్రకారం ఫిబ్రవరి 10 నుంచి 21 వరకు (11 రోజుల్లో) సుమారు రూ.3.09 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చిందని సంబంధిత అధికారులు ఇటీవల ముఖ్యమంత్రికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. ఇక మహిళల అభివృద్ధి కోసం ఇందిరా మహిళా శక్తి మిషన్‌ను అందుబాటులోకి తేవడంతోపాటు సెర్ప్, మెప్మా లాంటి సంస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చింది. మరోవైపు రీజినల్ రింగు రోడ్డు, ఫ్యూచర్ సిటీ, మెట్రో రైలు విస్తరణ లాంటి ప్రాజెక్టులు చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వంతోనూ చర్చలు జరుపుతూ.. లెక్క ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులు, గ్రాంట్లను తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది.

ఎల్ఆర్ఎస్
ఫీజు చెల్లించండి!

» 20 లక్షల దరఖాస్తుదారులకు లేఖలు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది దరఖాస్తుదారులకు ఎల్ఆర్ఎస్(లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్)కింద ఫీజు చెల్లించాలని అధికారులు లేఖలు పంపారు. నాలుగేళ్ల క్రితం అనధికారిక లేఅవుట్ల క్రమబద్ధకరణ కోసం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన విషయం విదితమే. ఆ సమయంలో 25.68 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 20లక్షల దరఖాస్తులు.. నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్లు అధికారులు తాజాగా గుర్తించారు. నిషేధిత భూములు, జల వనరుల సమీపంలో ఉన్న భూములకు సంబంధించి 5.50లక్షల దరఖాస్తులు వచ్చినట్లు అంచనా వేస్తున్నారు. ఈనెల 12వ తేదీనే 18 లక్షల దరఖాస్తులకు ఆటోమేటిక్ ఫీజు జనరేట్ చేసిన అధికారులు.. శుక్రవారం మరో2లక్షల దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలని లేఖలు రాశారు. 11 రోజుల్లో 29 వేల దరఖాస్తులు ఆమోదించగా.. ప్రభుత్వానికి రూ.80కోట్ల ఆదాయం వచ్చింది. మార్చి 31వ తేదీలోగా ఫీజు చెల్లించిన వారికే 25శాతం రాయితీ లభిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇందుకోసం కలెక్టర్లు, రిజిస్ట్రేషన్, మునిసిపల్ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మొత్తం ఫీజు ఒకేసారి చెల్లించలేని వారు తొలుత ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి..బిల్డింగ్ అనుమతుల సమయంలో 14శాతం ఓపెన్ స్థలం ఫీజు చెల్లించవచ్చని చెబుతున్నారు. అయితే, ఈ నెల చివరి వారంలో ఎక్కువ మంది ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అంతా ఆన్‌లైన్ విధానమే ఉండడంతో విదేశాల్లో నివసిస్తున్న వారు సైతం అక్కడి నుంచే ఫీజు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకుంటున్నారు. అయితే, ఫీజు మొత్తం ఒకేసారి కాకుండా విడతల వారీగా చెల్లించే అవకాశం ఇస్తారా? 25శాతం రాయితీని మార్చి 31 తర్వాత కొనసాగిస్తారా? అంటూ ఎక్కువ మంది అడుగుతుండగా.. ప్రస్తుతానికి ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని అధికారులు వివరిస్తున్నారు.

హోలీ వేడుకల్లో జగ్గారెడ్డి సందడి

మిత్రులు, సన్నిహితులపై రంగులు చల్లి.. నృత్యాలు చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

» ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్ష

సంగారెడ్డి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సందడి చేశారు. సంగారెడ్డిలో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగిన వేడుకల్లో తన చిన్ననాటి మిత్రులు, సన్నిహితులు, స్థానిక ప్రజలపై రంగులు చల్లారు. మూడు గంటల పాటు సాగిన కార్యక్రమంలో డీజే పాటలు, డప్పు చప్పుళ్లకు అనుగుణంగా డ్యాన్స్‌లు వేశారు. తానే స్వయంగా డప్పు కొడుతూ నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం పట్టణంలోని రాంమందిర్ కమాన్ వద్ద ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని అందరినీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ రాంమందిర్ వద్ద రెండు దశాబ్దాలుగా హోలీ సంబురాలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. తెలంగాణలో అత్యంత ఘనంగా జరుపుకొనే పండుగల్లో హోలీ ఒకటని, పండుగ వేళ ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. సంగారెడ్డిలో హోలీ పండుగను ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రకాల రంగుల మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని రకాల సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. నిరంతరం ఏదో ఒక సమస్య ఉంటుందని, అన్నీ మర్చిపోయి సంతోషంగా హోలీ జరుపుకునేందుకు తన వంతు ప్రయత్నం చేశానన్నారు.


సంగారెడ్డిలో జరిగిన హోలీ వేడుకల్లో జగ్గారెడ్డి

ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించి..
నిరసనలు తెలపడం హాస్యాస్పదం

» ఉద్దేశపూర్వకంగానే స్పీకర్ పట్ల అనుచిత ప్రవర్తన

» మంత్రి పొన్నం ప్రభాకర్

» బీఆర్ఎస్‌కు దళితులంటే చిన్న చూపు: మల్లు రవి

» కేటీఆర్ ఆమరణ దీక్ష చేస్తా అనడం విడ్డూరం: చామల


మంత్రి పొన్నం


ఎంపీ మల్లు రవి


ఎంపీ చామల కిరణ్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శాసన సభాపతిని అవమానించి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వారే.. మళ్లీ ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని నిరసనలు తెలపడం హాస్యాస్పదంగా ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. చట్ట సభకు అధిపతి అయిన స్పీకర్‌ను గౌరవించకుండా.. 'సభ మీ ఒక్కడిది కాదు' అని సభ్యుడు మాట్లాడటం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు. స్పీకర్ దళితుడని ఆ విధంగా మాట్లాడుతున్నారా..? అని ప్రశ్నించారు. సభ సంప్రదాయాలు, విలువల గురించి తెలిసిన బీఆర్ఎస్ నాయకత్వం సైతం జగదీశ్‌రెడ్డి చేసింది తప్పు అని చెప్పలేదంటే.. వారంతా ఉద్దేశపూర్వకంగా చేశారని స్పష్టంగా అర్థమవుతోందని పేర్కొన్నారు. ఇదే సభలో గతంలో శాసన మండలి చైర్మన్‌పై కాగితాలు విసిరేశారనే కారణంతో ఇద్దరు సభ్యులను బర్తరఫ్ చేశారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో ఇది మరచిపోయారా..? అని బీఆర్ఎస్ నేతలను పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అవమానించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. బీఆర్ఎస్ మొదటి నుంచీ దళితులను చిన్నచూపు చూస్తోందని శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. తెలంగాణకు తొలి సీఎంగా దళితుడిని చేస్తానని చెప్పిన కేసీఆర్.. ఆ తర్వాత తానే సీఎం అయ్యాడన్నారు. ఆనాడు దళితుడైన రాజయ్యను డిప్యూటీ సీఎం పదవి నుంచి బర్తరఫ్ చేసి అవమానించాడని, దళిత ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సభ్యత్వాన్నీ రద్దు చేశారని గుర్తు చేశారు. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్‌కు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదన్నారు. అసెంబ్లీలో జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేసే దాకా ఆమరణ దీక్ష చేస్తానంటూ కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 'దళిత నాయకత్వం పట్ల కేసీఆర్, కేటీఆర్‌ల ఆలోచనా విధానాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఉద్యమ కాలం నుంచీ ఇప్పటిదాకా దళితులను బీఆర్ఎస్ నాయకత్వం వంచిస్తూనే ఉంది. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌తో బీఆర్ఎస్ వారికి విస్కీలో సోడా మిస్ అయినంత పనైంది. ఇంకెవరిపైనైనా వేటు వేస్తే వారికి ఇంత బాధ ఉండకపోయేది. సాయంత్రం కార్యక్రమాలు ఎట్లా నడిపించాలో వారికి అర్థమవుతలేదు' అంటూ ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాని మోదీ సర్కారు ఎందుకు గద్దె దిగడం లేదంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డిని ప్రశ్నించారు.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై
బీఆర్ఎస్ నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)


నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మభ్యపెట్టి తెలంగాణను దివాలా దిశగా నడిపిస్తున్న కాంగ్రెస్ సర్కారు పాపం పండిందని స్పష్టం చేశారు. ఓ వైపు బీజేపీ నేతలతో కుస్తీ పడుతున్నట్లు ఫోజులు కొట్టి, దొంగచాటుగా దోస్తీ చేసే నీచ సంస్కృతికి రేవంత్ తెరలేపారన్నారు. సీఎం హోదాలో ఉండి బీజేపీ నేతలతో చీకటి మీటింగులేంటి? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు ఉన్నారంటున్న రాహుల్ గాంధీకి, రాజాసింగ్ వ్యాఖ్యలతో దొరికిపోయిన రేవంత్‌రెడ్డిపై చర్య తీసుకునే ధైర్యం ఉందా? అని నిలదీశారు. కాగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పేట్‌బషీర్‌బాద్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు వివేకానంద గౌడ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఫిల్మ్‌నగర్ పీఎస్‌లో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ముషీరాబాద్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ అనుచరుడు జైసింహ, ఉస్మానియా వర్సిటీ పీఎస్‌లో బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఫిర్యాదు చేశారు. ఇఫ్లూ వర్సిటీ సర్కిల్ వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించగా.. పోలీసులు వారిని అరెస్టు చేశారు. కాగా, ఓర్పులేని వాళ్లు మార్పు ఎలా తెస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే సభ నుంచి బహిష్కరిస్తారా? అని నిలదీశారు. ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా తెలిపారు. ప్రజా సమస్యలను శాసనసభలో కూడా లేవనెత్తనివ్వరా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎప్పుడు ఏ ఆపదొచ్చినా బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. హోలీ సందర్భంగా శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన హైదర్షాకోట్ డ్రీమ్ హోమ్ కాలనీవాసులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. స్పీకర్‌ను జగదీశ్‌రెడ్డి అవమానించలేదని, ఆయనపై సస్పెన్షన్ ఎత్తి వేయాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఉద్రిక్తత

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో బీఆర్ఎస్ నిరసన సందర్భంగా ఉద్రిక్తత తలెత్తింది. తెలంగాణ తల్లి చౌరస్తాలో నిరసన వ్యక్తం చేసేందుకు గుమిగూడిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకోగా.. వాగ్వాదం చోటు చేసుకుంది. అదే సమయంలో హోలీ సంబరాల్లో భాగంగా కాంగ్రెస్ నాయకులు రోడ్డు పైకి రావడం.. ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహం దగ్గర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనంచేశారు. దీంతో తెలంగాణ చౌక్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు పోలీసులు పరిగెత్తుకుంటూ వెళ్లారు. దిష్టిబొమ్మలపై నీళ్లు పోసి.. బీఆర్ఎస్ నేతలను అక్కడి నుంచి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది.



తన సిబ్బందితో కలిసి హోలీ సంబరాలు జరుపుకున్న మంత్రి సీతక్క

నేటి నుంచి అంగన్‌వాడీలూ ఒంటిపూటే!

- ఉదయం 8 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

హైదరాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంగన్‌వాడీలను ఒంటిపూటే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయం 8 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు అంగన్‌వాడీలను నడిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శనివారం వెలువడనున్నాయి. శనివారం నుంచే రాష్ట్రంలో అంగన్‌వాడీలను ఒంటి పూట నిర్వహించనున్నారు. రాష్ట్రంలో రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుండడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను ఒంటి పూట నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మే నెలలో అంగన్‌వాడీ టీచర్‌లు, హెల్పర్లకు షిఫ్టుల వారీగా సెలవులు ఇవ్వనున్నారు. మే 1 నుంచి 15 వరకు టీచర్లకు సెలవు ఇస్తారు. ఆ సమయంలో హెల్పర్లే అంగన్‌వాడీలను పర్యవేక్షిస్తారు. ఇక మే 16 నుంచి 31వరకు హెల్పర్లకు సెలవులు ఇవ్వాలని నిర్ణయించారు. మరోవైపు శుక్రవారం మంత్రి సీతక్క తన భద్రతా సిబ్బంది, కార్యాలయ, నివాస సిబ్బందితో కలిసి హోలీ పండుగ జరుపుకున్నారు. ఈ రంగుల పండుగ వేడుకల్లో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

అందుబాటులో భద్రాద్రి సమాచార యాప్

- ప్రారంభించిన ఈవో .. రాష్ట్రంలోనే తొలి దేవస్థానం

భద్రాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి తరలివచ్చే భక్తుల కోసం భద్రాద్రి దేవస్థానం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. రామయ్య పెండ్లి పనులు ప్రారంభం కావడం, సీతమ్మవారి జన్మ నక్షత్రం కావడంతో శుక్రవారం ఈ యాప్‌ను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి లాంఛనంగా ప్రారంభించారు. ఆత్రేయ ఇన్ఫోటెక్ సిస్టమ్స్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ యాప్‌లో ఆలయంలో భక్తులకు అందుబాటులో ఉన్న వివిధ సేవలు, క్షేత్ర మహత్యం, పట్టణం, పరిసరాల్లో దర్శనీయ స్థలాలు, దూరాలు.. ఇతర వివరాలు పొందుపరిచారు. దేవస్థానంలో ఇప్పటికే ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. పారదర్శకత కోసం బార్ కోడింగ్, అన్నప్రసాదంలో ఈ టికెటింగ్ విధానం అమల్లో ఉంది. రానున్న నెల రోజుల్లో ఈ యాప్ ద్వారా భక్తులు నేరుగా ఆర్జిత సేవలు, పూజలు, ఇతరత్రా వాటిని సైతం పొందేలా తీర్చిదిద్దనున్నట్లు ఈవో వెల్లడించారు. కాగా స్వామివారి మహాప్రసాద అన్నదానంలో భాగంగా వెయ్యిమందికి అన్నప్రసాదం అందించేందుకు ప్రసాద్ పథకంలో నిర్మిస్తున్న హాల్‌ను ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించామని ఈవో తెలిపారు. ప్రొటోకాల్ విధానం ప్రవేశపెట్టడంతో భక్తులకు పారదర్శకంగా దర్శనం లభిస్తోందని, దేవస్థానానికి ఆదాయం కూడా సమకూరుతోందన్నారు. వస్త్రాలకు బార్ కోడింగ్ విధానం ప్రవేశపెట్టి, భక్తులకు దేవస్థానం నిర్దేశించిన ధరకే వాటిని విక్రయించాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో భక్తులకు ఆన్‌లైన్, బార్‌కోడింగ్, ప్రత్యేక యాప్‌లు అందుబాటులోకి తెచ్చిన తొలి దేవస్థానంగా భద్రాద్రి ఖ్యాతినార్జించిందన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, ఆత్రేయ ఇన్ఫోటెక్ సిస్టమ్స్ ఎండీ ఎ.రమేషన్ పాల్గొన్నారు.

రేపు జనగామకు సీఎం

- స్టేషన్‌ఘన్‌పూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- అనంతరం బహిరంగ సభ

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనగామ జిల్లాలో ఆదివారం పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

ఫొటో చెప్పే రేవంతు కథ



ఈ ఫొటో ఏంటీ ? వాళ్లంతా ఎవరు ? అని అనుకుంటున్నారు కదా.. !! ఈ ఫొటోలో ఉన్న వాళ్లలో ఇతరుల సంగతేమో కానీ.. చెంప మీద ఓ చెయ్యి వేసుకుని, మరో చేతిని పక్కనున్న వ్యక్తి భుజం మీద వేసుకుని దర్జాగా కూర్చుని చిరునవ్వు చిందిస్తున్న ఆ వ్యక్తిని మాత్రం జాగ్రత్తగా గమనించండి.. నాకేం టెన్షన్లు లేవన్నట్టు హాయిగా కూర్చున్న ఆ వ్యక్తి మరెవరో కాదు.. ఇప్పుడు రాష్ట్రం కోసం టెన్షన్ పడుతూ పరుగులు పెడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అవును.. ఓ సాధారణ యువకుడిగా తన స్నేహితులతో కలిసి కొన్నేళ్ల క్రితం ఆయన హోలీ జరుపుకున్నప్పుడు తీసిన ఈ ఫొటో.. హోలీ సందర్భంగా శుక్రవారం సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. సీఎం రేవంత్ అభిమానులు ఈ ఫొటోను వైరల్ చేసేశారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

అప్పు 1,50,000 కోట్లు?

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న అప్పుల భారం రూ.6,71,757 కోట్లని తేల్చింది. వాటికితోడు ఉద్యోగులకు సంబంధించి వివిధ రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని క్లియర్ చేయాలంటే మరో రూ.40,154 కోట్లు అవసరమని శ్వేతపత్రంలో వెల్లడించింది. ఇలా 2023 డిసెంబరు 20 నాటికి రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, చెల్లించాల్సిన బిల్లుల మొత్తం కలిపి రూ.7,11,911 కోట్లుగా నిర్ధారించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అప్పుల దూకుడు కొనసాగింది. మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రభుత్వ పథకాలు, ఉద్యోగుల జీత భత్యాల చెల్లింపులు, పాత అప్పుల వడ్డీల చెల్లింపుల కోసం అప్పులు తెస్తున్నారు. కార్పొరేషన్ల పేర బడ్జెట్ ఆవల తీసుకుంటున్న అప్పులు కూడా భారీగానే ఉన్నాయి. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) ద్వారా సేకరించిన అప్పు రూ.10 వేల కోట్లను మొత్తం ప్రభుత్వమే వినియోగించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా పెడుతున్న ఖర్చు రూ.22,500 కోట్ల వరకు ఉంటే, వస్తున్న ఆదాయం, తెస్తున్న అప్పులు కలిపినా రూ.18 వేల కోట్లు దాటడం లేదు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే పలు వేదికల మీద చెప్పారు. అంటే ప్రతి నెలా రూ.4,500 కోట్ల మేర ఆర్థిక లోటు ఏర్పడుతోంది. దీనిని పూడ్చుకొనే ప్రయత్నంలో భాగంగా భూములను తనఖా పెట్టి, కార్పొరేషన్లకు గ్యారెంటీలు ఇచ్చి అప్పులు తెస్తున్నారు. వాటికితోడు కేంద్ర ప్రభుత్వాన్ని అదనపు అప్పు కోసం అభ్యర్థిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రుణాలను పునర్ వ్యవస్థీకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కవిత ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో 2023 డిసెంబరు 7 నుంచి 2024 నవంబరు 30 వరకు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో రూ.52,118 కోట్ల అప్పు తీసుకున్నామని వెల్లడించింది. కార్పొరేషన్లు తీసుకున్న అప్పులు మరో రూ.61,991 కోట్లు ఉన్నాయని, ఎలాంటి గ్యారెంటీలు లేకుండా మరో రూ.10 వేల కోట్లను కూడా కార్పొరేషన్లు తీసుకున్నాయని వివరించింది. అంటే, రూ.1.24 లక్షల కోట్లన్నమాట. అయితే, ఏఏ కార్పొరేషన్లు ఎంతెంత తీసుకున్నాయన్న వివరాలు మాత్రం వెల్లడించలేదు. పౌర సరఫరాల సంస్థ వంటి కార్పొరేషన్లు ఏటా ధాన్యం సేకరణకు అప్పు తీసుకోవడం, అమ్మిన తర్వాత తిరిగి చెల్లించడం సాధారణంగా జరిగేదే. ఆ అప్పులు సాధారణంగా ప్రభుత్వానికి భారం కావు. ఇలాంటి అప్పులు ఎన్ని ఉన్నాయన్నది మాత్రం ప్రభుత్వం వెల్లడించలేదు. గత మూడు నెలల్లో తీసుకున్న అప్పుల్లో టీజీఐఐసీ ద్వారా భూమిని తనఖా పెట్టి తీసుకున్న రూ.10 వేల కోట్లు, తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) తీసుకున్న రూ.1000 కోట్లు ఉన్నాయి. అన్ని అప్పులు కలిపి రూ.1,52,818 కోట్లకు చేరాయి. బీఆర్ఎస్ కాలం నాటి పాత అప్పు రూ.6,71,757 కోట్లతో కలుపుకొంటే ప్రస్తుతం రాష్ట్ర అప్పు రూ.8,24,575 కోట్లుగా తేలుతోంది.



ఇవీ అప్పుల వివరాలు (రూ.కోట్లలో)

2023 డిసెంబరు 7 నుంచి 2024 నవంబరు 30 వరకు తెచ్చిన అప్పులు

ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో తీసుకున్న అప్పు	52,118
కార్పొరేషన్ల పేర తీసుకున్న రుణాలు	61,991
గ్యారెంటీలు లేకుండా కార్పొరేషన్లు తీసుకున్నది	10,000
మొత్తం అప్పు	1,24,109

2024 డిసెంబరులో తీసుకున్న అప్పు

డిసెంబర్ 3న	2,000
డిసెంబర్ 17న	1,500
డిసెంబరు 26న (టీజీఐఐసీ ద్వారా)	10,000
డిసెంబర్ 31న	409
మొత్తం	13,909

2025లో తెచ్చిన అప్పులు

జనవరి 7న	3,000
జనవరి 28న	2,800
ఫిబ్రవరి 4న	3,000
ఫిబ్రవరి 4న (టీయూఎఫ్ఐడీసీ కోసం)	1,000
మార్చి 5న	2,000
మార్చి 11న	3000
మొత్తం	14,800

(రూ.కోట్లలో)



సీతారామ ఎత్తిపోతల పథకంపై సమీక్ష చేస్తున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల

మూడేళ్లలో సీతమ్మ సాగర్ పూర్తవ్వాలి

- నాలుగో పంప్‌హౌస్‌ను ఈ యేడు పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రులు ఉత్తమ్, తుమ్మల ఆదేశం

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సీతమ్మ సాగర్(దుమ్ముగూడెం) బ్యారేజీ నిర్మాణాన్ని మూడేళ్లలోపు పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ బ్యారేజీ పూర్తయితే 500 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. శుక్రవారం మంత్రి ఉత్తమ్ నివాసంలో సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్ష జరిగింది. భవిష్యత్‌లో కృష్ణా జలాలు తగ్గితే సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు స్థిరీకరణ.. సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తయితే పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి నీళ్లు చేరి.. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కూడా సీతారామ వరదాయినిగా మారుతుందన్నారు. సీతారామ ప్రాజెక్టులో నాలుగో పంప్‌హౌస్ నిర్మాణాన్ని కూడా ఈ ఏడాదిలో పూర్తి చేయాలని నిర్దేశించారు. ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఖమ్మం, కొత్తగూడెం కలెక్టర్లను మంత్రులు ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణీత వ్యవధిలోగా పనులు చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. సీతారామ ఎత్తిపోతల పథకంలోని సత్తుపల్లి విభాగం పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు.

పిల్లలేం చేశారు పాపం!

కన్నబిడ్డలను చంపి ఆత్మహత్యకు పాల్పడుతున్న తల్లిదండ్రులు

- తాము చనిపోతే పిల్లలేమైపోతారోననే భయంతో తీవ్రనిర్ణయం
- కన్నవారి మానసిక రుగ్మతలే చిన్నారులకు శాపమవుతున్న వైనం
- సరైన సమయంలో గుర్తిస్తే అడ్డుకట్ట వేయొచ్చు: మానసిక వైద్యులు

(హైదరాబాద్ సిటీ-ఆంధ్రజ్యోతి)



తన కూనల జోలికి వచ్చినవారిపై పిల్లులు, కుక్కలు తీవ్రంగా దాడి చేస్తాయి! తల్లి కోడి సైతం తన పిల్లలున్న గంప దగ్గరికి ఎవ్వరినీ రానివ్వదు!! పశుపక్ష్యాదులు ఇలా తమ ప్రాణాలు అడ్డేసి మరీ బిడ్డలను కాపాడుకుంటాయి. కానీ.. ఆలోచించే శక్తి, తెలివితేటలు ఉన్న మనుషులు మాత్రం తమ కడుపున పుట్టిన బిడ్డల్ని చంపి తాము ఆత్మహత్య చేసుకుంటున్న ఘటనలు ఇటీవలికాలంలో పెరుగుతున్నాయి! "మా ఆయుష్షు కూడా పోసుకొని నిండు నూరేళ్లూ వర్ధిల్లు" అంటూ దీవించిన చేతులతోనే తల్లిదండ్రులు తమ పిల్లల ఉసురు తీస్తుండడం బాధాకరం. సాధారణంగా పిల్లలకు ఒంట్లో కాస్తంత నలతగా ఉంటేనే కన్నవారు తీవ్రంగా కలవరపడిపోతారు! ఆడుకుంటూ పొరపాటున కింద పడ్డ బిడ్డకు చిన్నగాయమైతేనే విలవిల్లాడిపోతారు. అలాంటిది.. కన్నబిడ్డల గొంతు నులిమి, వారికి విషం పెట్టి చంపేసేంత కర్కశత్వం వారిలో ఎందుకొస్తోంది? ఎలా వస్తోంది? అంటే.. రకరకాల మానసిక రుగ్మతలు, తాము చనిపోతే బిడ్డల భవిష్యత్తు ఏమైపోతుందోనన్న ఆందోళనే ఇందుకు కారణమని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు. ఇటీవల హైదరాబాద్ హబ్సిగూడలో తమ ఇద్దరు పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకున్న చంద్రశేఖర్ రెడ్డి దంపతులే ఇందుకు ఉదాహరణ. ప్రైవేటు కళాశాల మాజీ లెక్చరర్ అయిన చంద్రశేఖర్ రెడ్డి ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. తనతోపాటే ప్రాణాలు తీసుకోవాలని భార్యకూ చెప్పి ఒప్పించాడు. తాము చనిపోతే పిల్లలేమైపోతారోనన్న ఆందోళనతో.. వారిద్దరూ ఉరి వేసుకోవడానికి ముందు.. తమ 15 ఏళ్ల కుమార్తెను, పదేళ్ల కుమారుణ్ని కర్కశంగా చంపేశారు. మొన్నటికి మొన్న విజయవాడలో శ్రీనివాస్ అనే వైద్యుడు అప్పుల బాధ తట్టుకోలేక తల్లి, భార్యతో సహా తమ ఇద్దరు పిల్లల్నీ పొట్టనపెట్టుకొని, ఆపై తాను బలవంతంగా ప్రాణాలు తీసుకున్నాడు. వ్యవసాయంలో వరుస నష్టాలతో.. కడపజిల్లాకు చెందిన నాగేంద్ర తాను ఉరివేసుకుని చనిపోవడానికి ముందు భార్యా, పిల్లలను చంపేశాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల ఊబిలోచిక్కుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వెంకటేశ్.. కన్నబిడ్డలన్న కనికరమైనా లేకుండా.. ఐదేళ్లలోపు బాబు, పాప ముఖంపై దిండుపెట్టి అదిమి, ఆపై భార్యను కడతేర్చి తాను తనువు చాలించాడు. ఇలా ఇటీవలికాలంలో పలు ఘటనలు జరగడం పౌర సమాజాన్ని తీవ్రంగా కలవరపెడుతోంది.

భయమే కారణమా!

సాధారణంగా ఇలాంటి దారుణాలు ఇంటిపెద్ద ప్రేరణతోనే జరుగుతాయని సీనియర్ సైకియాట్రిస్ట్ డాక్టర్ పింగళి లక్ష్మి తెలిపారు. తాను లేకపోతే భార్యాబిడ్డలు బతకలేరేమోనన్న ఆందోళన.. వారి జీవితాలు చిన్నాభిన్నమవుతాయేమోనన్న భయంతోనే ముందుగా ఇంటి పెద్ద భాగస్వామిని ఆత్మహత్యకు ఒప్పించి, ఆపై పిల్లలను చంపి తమ ఉసురుతీసుకుంటున్నారని ఆమె వివరించారు. ఆర్థిక సమస్యలు, బెట్టింగ్‌లాంటి వ్యసనాలు, కుటుంబ కలహాలు వంటివి వారి ఆత్మహత్యలకు ప్రధాన కారణాలుగా పైకి కనిపించినా.. బలవంతంగా ఉసురు తీసుకునే స్వభావం వెనుక మానసిక రుగ్మతలు, వారి కుటుంబంలో అలాంటి చరిత్ర ఉండడం లాంటి అనేక కారణాలు ఉంటాయని తెలిపారు. అలాంటి ప్రవర్తన కలిగిన కుటుంబాలకు చెందినవారు.. బంధు, మిత్రులతో సాధారణంగా కలవరని ఆమె వెల్లడించారు. ముభావంగా ఉండడం, మరొకరిని సాయం అడగలేకపోవడం, ఆత్మన్యూనతా భావం వంటి లక్షణాలున్న వ్యక్తులు ఎక్కువగా బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు డాక్టర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు.

ఐదేళ్లలోపువారే ఎక్కువ...

కన్నవారి చేతుల్లో హత్యకు గురవుతున్న వారిలో ఐదేళ్లలోపు పిల్లలు ఎక్కువ ఉంటున్నారని నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసెన్ అధ్యయనంలో తేలింది. ఆసియా, మధ్య ప్రాచ్య దేశాలలో ఇలాంటి ఘటనలు ఎక్కువ జరుగుతున్నాయని ఆ నివేదికలో ప్రస్తావించారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇలాంటి దుర్ఘటనలు వరుసగా చోటుచేసుకోవడం ఆందోళనకరం. తల్లిదండ్రులు పిల్లలను తమ ఆస్తిగా భావిస్తుండడం వల్ల.. వారిపై సర్వాధికారాలూ తమకే ఉన్నాయన్న మానసిక స్థితి.. కడుపునపుట్టినవారిని చంపడానికి ఒక ప్రధాన కారణంగా పనిచేస్తుందని తరుణీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మమతా రఘువీర్ తెలిపారు. ఈ తరహా ఆలోచనలు, మానసిక రుగ్మతలు ఉన్నవారిని గుర్తించి, తగిన చికిత్స చేయిస్తే ఇలాంటి దారుణాలకు, ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయొచ్చని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

మానసిక అనారోగ్యమూ ఒక వ్యాధే



ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు మానసిక సమస్యలు పెరిగాయి. మలేరియా, టైఫాయిడ్ వంటి వాటి లాగానే మానసిక అనారోగ్యం కూడా ఒక వ్యాధి. దానికి తగిన చికిత్స తీసుకోవాలన్న స్పృహ సమాజంలో పెరగాలి. అప్పుడే ఇలాంటి ఆత్మహత్యలు తగ్గుతాయి. కుటుంబ, ఆర్థిక సమస్యలు చాలామందికి ఉంటాయి. అలా ఉన్నవారంతా ఆత్మహత్యకు పాల్పడరు. వ్యసనాలకు గురైనవారంతా చనిపోవాలనుకోరు. స్వభావంలోనే సూసైడల్ టెండెన్సీ ఉన్నవారు, ఒత్తిడి, కుంగుబాటు వంటి మానసిక సమస్యలతో బాధపడేవారు.. చనిపోవడమే తమ సమస్యలకు పరిష్కారంగా భావిస్తారు. అదే ఈ విషాద ఘటనలకు కారణం. ఎవరిలోనైనా ఇలాంటి లక్షణాలు కనిపిస్తే.. వెంటనే మానసిక వైద్యులను సంప్రదించడం ద్వారా వారి ప్రాణాలతోపాటు, వారి కుటుంబాలను కూడా కాపాడవచ్చు. అసలు పాఠశాల దశ నుంచే పిల్లల్లో ఇలాంటి లక్షణాలను గుర్తించి వాటికి అధిగవించడానికి తగిన పరిష్కారాలు చూపించాలి. ఆత్మహత్య ఆలోచనల నివారణకు మన దేశంలో చాలా హెల్ప్‌డెస్కులు పనిచేస్తున్నాయి. కనీసం వాటినైనా సంప్రదించాలి.

- డాక్టర్ పింగళి శ్రీలక్ష్మి, సీనియర్ సైకియాట్రిస్ట్, రోష్ని కౌన్సెలింగ్ సెంటర్

మే 5 నుంచి కన్‌ఫర్డ్ ఐఏఎస్‌లకు శిక్షణ

హైదరాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మే నెల 5 నుంచి ముస్సోరిలో జరగనున్న శిక్షణకు రాష్ట్రం నుంచి 23 కన్‌ఫర్డ్ ఐఏఎస్(ప్రమోటీలు)లు వెళ్లనున్నారు. ఈమేరకు వీరిని రిలీవ్ చేయాల్సిందిగా కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ(డీఓపీటీ) రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీలో మే 5 నుంచి జూన్ 13 వరకు శిక్షణ కొనసాగనుందని, మే 4న అకాడమీలో రిపోర్టు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రానికి సూచించింది. రాష్ట్రం నుంచి మొత్తం 23 మంది ప్రమోటీలను ప్రభుత్వం నామినేట్ చేసింది. వీరిలో కొర్రా లక్ష్మి, సీహెచ్ శివలింగయ్య, చిట్టెం లక్ష్మి, అమోయ్‌కుమార్, ఎం.హన్మంతరావు, ఎం.హరిత, టి.వినయ్‌కృష్ణారెడ్డి, వి.వెంకటేశ్వర్లు, అయిషా మస్రత్ ఖానమ్, జి.రవి, కె.నిఖిల, కె.స్నేహ, ఎం.సత్య శారదా దేవి, నారాయణరెడ్డి, ఎస్.హరీశ్, ఎ.సంగీత సత్యనారాయణ, ఎస్.వెంకటరావు, ఎస్కే యాస్మీన్ బాషా, ఎ.నిర్మలా క్రాంతి వెస్లీ, జల్దా అరుణశ్రీ, పి.కాత్యాయనీ దేవి, జి.ఫణీంద్రరెడ్డి, కె.చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ప్రాథమిక ఆస్పత్రుల్లో..

డిజిటల్ హెల్త్ రికార్డ్

(మొదటిపేజీ తరువాయి)

ఉంచనున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగి ఆధార్ కార్డు సంఖ్య ఆధారంగా వారి వివరాలను ఆన్‌లైన్ చేస్తారు. ఒకవేళ ఆధార్ లేకుంటే ప్రత్యేకంగా ఓ ఐడీని రూపొందించి వివరాలు నమోదు చేస్తారు. ఈ వివరాలను అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు అనుసంధానం చేస్తారు. రోగి మళ్లీ ఎప్పుడైనా ఏదైనా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లినప్పుడు తన ఐడీ సంఖ్యను చెబితే.. అక్కడి వైద్యులు సదరు రోగి ఆరోగ్య చరిత్రను ఆన్‌లైన్‌లో చూడవచ్చు. ఉదాహరణకు ఎవరైనా అనారోగ్యంతో ఆస్పత్రికి వెళితే వారి ఆధార్ కార్డు సంఖ్య ఆధారంగా అబా నెంబరు(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ నంబరు) జారీ చేస్తారు. 14 అంకెలతో ఉండే ఈ అబా నెంబర్‌నే డిజిటల్ హెల్త్ ఐడీ అని కూడా అంటారు. ఒక్కసారి ఇది జనరేట్ అయితే ఎప్పటికీ అదే నెంబరు ఉంటుంది. ఈ ఐడీ నెంబర్ సాయంతో రోగి ఆరోగ్య వివరాలను ఏ ప్రభుత్వ ఆస్పత్రిలోనైనా వైద్యులు చూడవచ్చు. రోడ్డు ప్రమాదాలు వంటి అత్యవసర సమయాల్లో ఈ డిజిటల్ ఐడీ చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

తెలంగాణ డయాగ్నస్టిక్స్‌తో అనుసంధానం

రోగుల వివరాలను ఆన్‌లైన్ చేసే విధానాన్ని తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఓ 50 ఆస్పత్రుల్లో ఇప్పటికే ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఆయా ఆస్పత్రులకు వచ్చిన రోగుల(ఓపీ, ఐపీ) వివరాలను ఆన్‌లైన్ చేశారు. ఈ క్రమంలో ఎదురైన సవాళ్లు, సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించారు. అలాగే వైద్యవిద్య సంచాలకుల పరిధిలోని 30 ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇక, డిజిటల్ హెల్త్ రికార్డును తెలంగాణ డయాగ్నస్టిక్‌తోనూ అనుసంధానం చేస్తారు. ప్రస్తుతం పీహెచ్‌సీలకు వచ్చే రోగుల రక్త, మూత్ర నమూనాలను పరీక్షల నిమిత్తం తెలంగాణ డయాగ్నస్టిక్‌కు పంపుతున్నారు. ఆయా నమూనాల ఫలితాల నివేదికలను ఇకపై డిజిటల్ హెల్త్ ఐడీకి జత చేస్తారు. దీంతో రోగి తన ఐడీ లేదా ఆధార్ నెంబర్ చెబితే.. ఆయా టెస్టుల ఫలితాలతోపాటు సమస్త ఆరోగ్య చరిత్రను వైద్యులు ఆన్‌లైన్‌లో చూసే వెసులుబాటు ఉంటుంది. దీంతో చికిత్స మరింత సులభతరం అవుతుంది. కాగా, ప్రజల ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేసేందుకు అవసరమయ్యే నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తితో సమకూరుస్తున్నాయి. గ్రామాల్లో ప్రజలందరికీ అబా నెంబర్ రూపొందించి ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో సిబ్బంది పని చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని వైద్యవర్గాలు వెల్లడించాయి.

ఎంపీడీఓల సంఘం అధ్యక్షురాలిగా పద్మావతి

హైదరాబాద్, మార్చి14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎంపీడీఓల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా జొన్నల పద్మావతి ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా గంగుల సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శేషాద్రి, దివ్యదర్శన్, భారతి, ప్రధాన కార్యదర్శిగా యం.మోహన్, కోశాధికారిగా మహేష్, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



మెట్‌పల్లిలో పసుపు కొనుగోళ్లు జరుపుతున్న వ్యాపారులు

పసుపు రైతు పరేషాన్!

మద్దతు ధర లేక విలవిల.. మార్కెట్లో వ్యాపారులు చెప్పిందే ధర

- క్వింటాలుకు రూ.9,200 లోపే.. బోర్డు వచ్చినా మారని పరిస్థితి
- భారీ వర్షాలతో తగ్గిన దిగుబడి.. పంటను దెబ్బతీసిన 'దుంపకుళ్లు'
- ప్రభుత్వం ఆదుకోవాలి: రైతులు

జగిత్యాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో ధర లేక పసుపు రైతు ఆగమాగమవుతున్నాడు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేసినా మద్దతు ధర రాకపోవడంతో విలవిల్లాడుతున్నాడు. మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన రేటే చలామణీ అవుతుండడంతో పెట్టుబడి సైతం రాని దుస్థితిలో పడ్డాడు. ఈ క్రమంలో ఇటీవల పసుపునకు క్వింటాలుకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్, మెట్‌పల్లిలలో రైతు ఐక్య వేదికల ఆధ్వర్యంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాల్లో పసుపు సాగవుతుండగా జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో సుమారు 80 వేల ఎకరాల్లో రైతులు పసుపు పండిస్తున్నారు. ఇక్కడి నేలలు పసుపు పంటకు అనుకూలంగా ఉండడం వల్ల దిగుబడులు బాగా వస్తున్నాయి. అయితే, ప్రస్తుత సీజన్‌లో వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల పంట దెబ్బతిని కొద్దిగా దిగుబడులు తగ్గాయి. దీనికి తోడు పసుపునకు దుంపకుళ్లు రోగం పలు ప్రాంతాల్లో సోకి దిగుబడిపై ప్రభావం చూపింది. సాధారణంగా ఎకరాకు 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందనుకుంటే 20 నుంచి 25 క్వింటాళ్లకు దిగుబడి పడిపోయిందని రైతులు అంటున్నారు. ఒక్కో రైతు ఎరువులు, కలుపుతీత, పంట తవ్వకం, కొమ్ములు విరవడం, ఉడకబెట్టేందుకు ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు వ్యయం చేశారు. అయితే ఆ స్థాయిలో దిగుబడి రాకపోవడం, ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

గతేడాది ధరలో సగమే ఈసారి

గతేడాది పసుపు క్వింటాలుకు రూ.17 వేల నుంచి రూ.18 వేల వరకు ధర పలికింది. దీంతో ఈ యేడాది సైతం ధరలు బాగుంటాయని రైతులు ఆశించారు. ఇటీవల నిజామాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేసి, బోర్డుకు చైర్మన్‌ను, కార్యదర్శిని నియమించింది. దీంతో తమకు మంచి రోజులు వచ్చాయని అన్నదాతలు భావించారు. అయినా, వారం రోజులుగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మార్కెట్‌లో పసుపు క్వింటాలుకు రూ.8,500 నుంచి రూ.9,200 లోపే పలుకుతోంది. ఫలితంగా పెట్టుబడులు సైతం రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రూ.15 వేలు మద్దతు ధర ప్రకటించాలి



పసుపు బోర్డు ఏర్పాటు చేయడం సంతోషకరమే. పసుపు క్వింటాలుకు రూ.15 వేల మద్దతు ధరను ప్రకటించాలి. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం (ఎంఐఎస్) కింద పసుపును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయాలి. మార్కెట్‌లో ధరలు లేకపోవడం వల్ల రైతులు నష్టాల పాలవుతున్నారు. పసుపు రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి.

- పన్నాల తిరుపతి రెడ్డి, రైతు ఐక్య వేదిక నాయకులు, జగిత్యాల జిల్లా

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.



డౌన్ పేమెంట్
₹1
36 నెలల ఇఎంఐ
లోన్ & ఎక్స్చేంజ్ మేళా
మీ పాత ఫర్నిచర్‌పై
25% వరకు
తగ్గింపు*
పొందండి.
బ్రెజిల్ 2 సీటర్ సోఫా
MRP ₹25,999 Sale ₹9,999 PER DAY EMI ₹11
టేక్‌వుడ్ 3 సీటర్ సోఫా
MRP ₹36,999 Sale ₹14,999 PER DAY EMI ₹16
రాకీ 3 సీటర్ సోఫా
MRP ₹43,999 Sale ₹17,999 PER DAY EMI ₹19
వెరోనా: ఆర్ట్ లెదర్ రిక్లైనర్ సోఫా సెట్ 3+1+1
MRP ₹1,09,999 Sale ₹49,999 PER DAY EMI ₹54
మాన్యువల్ ఆల్ రిక్లైనర్ సోఫా సెట్ 3+2+1
MRP ₹2,16,999 Sale ₹99,999 PER DAY EMI ₹108
ఫుల్ లెదర్ ఆల్ ఎలక్ట్రికల్ రిక్లైనర్ సోఫా సెట్ 3+1+1
MRP ₹3,98,999 Sale ₹1,79,999 PER DAY EMI ₹194
సాలిడ్ వుడెన్ 50mm థిక్‌నెస్ బెడ్
MRP ₹1,02,499 Sale ₹49,999 PER DAY EMI ₹54
కింగ్‌సైజ్ కాట్ బాటమ్ డ్రా స్టోరేజితో +
2 సైడ్ పిల్లింగ్ + బెడ్‌సైడ్ టేబుల్ + ఉచిత పరుపు
MRP ₹1,84,999 Sale ₹29,999 PER DAY EMI ₹32
పరుపు : కొనండి 4 అంగుళాలు మరియు పొందండి 6 అంగుళాల ఉచిత అప్‌గ్రేడ్
చెల్లించండి రూ.1 డౌన్ పేమెంట్
మిగతా 24 నెలలు ఇఎంఐ
అదనంగా 15% డిస్కౌంట్ ఎంఆర్‌పి పై
ఉచితం 2 దిండ్లు రూ.999 విలువైనవి
టేక్‌వుడ్ డైనింగ్ టేబుల్
65mm థిక్ మార్బుల్ టాప్ 1+6తో
MRP ₹1,55,999 Sale ₹69,999 PER DAY EMI ₹75
యాంటెక్: సాలిడ్‌వుడెన్ డైనింగ్ టేబుల్ 6 సీటర్
(4 కుర్చీలు + 1 బెంచ్)
MRP ₹54,999 Sale ₹24,999 PER DAY EMI ₹27
ప్రీమియం క్వాలిటీ వార్డ్‌రోబ్
చికాకో :
2 డోర్
MRP ₹ 27,449
₹ 10,999
చికాకో :
3 డోర్
MRP ₹ 39,990
₹ 15,999
బానోరా:
4 డోర్
MRP ₹ 54,990
₹ 21,999
PER DAY EMI ₹12
మీ సోఫాను మీకు ఇష్టమైన విధంగా తయారు చేయించుకోండి
వేగన్, ఫ్యాబ్రిక్, ఆర్ట్ లెదర్స్‌తో తయారు చేయబడిన మరియు రూపొందించబడిన 28 విభిన్న రకాలు మరియు 78 విభిన్న రంగుల నుండి ఎంచుకోండి
సూపర్ స్టార్ ఎలక్ట్రికల్ రిక్లైనర్ 1 సీటర్ రూ.3,999 వద్ద ఇఎంఐ ప్రారంభం
సూపర్ స్టార్ ఎలక్ట్రికల్ రిక్లైనర్ 2 సీటర్ రూ.5,999 వద్ద ఇఎంఐ ప్రారంభం
సూపర్ స్టార్ ఎలక్ట్రికల్ రిక్లైనర్ 3 సీటర్ రూ.7,999 వద్ద ఇఎంఐ ప్రారంభం
సూపర్ స్టార్ ఎలక్ట్రికల్ రిక్లైనర్ 3 సీటర్ లాంజర్‌తో రూ.11,999 వద్ద ఇఎంఐ ప్రారంభం
సూపర్ స్టార్ ఎలక్ట్రికల్ రిక్లైనర్ కార్నర్ రూ.14,999 వద్ద ఇఎంఐ ప్రారంభం
78 విభిన్న రంగులు
సూపర్ స్టార్ ఎలక్ట్రికల్ రిక్లైనర్ యూ కార్నర్ 2 రిక్లైనర్స్‌తో రూ.18,999 వద్ద ఇఎంఐ ప్రారంభం
షూ ర్యాక్స్ 40% వరకు తగ్గింపు
డ్రెస్సింగ్ టేబుల్స్ 50% వరకు తగ్గింపు
మల్టిపుల్ ఫైనాన్స్ ఎంట్‌సర్లు అందుబాటులో గలరు
కార్పొరేట్ బుకింగ్‌లు లేదా బల్క్ ఆర్డర్ల కొరకు
enquiry@bantia.in లో మాకు ఇ-మెయిల్ చేయగలరు.
కరీంనగర్‌లో త్వరలో ప్రారంభం !
•ఎ.ఎస్.రావు నగర్ •అత్తాపూర్ •బోడుప్పల్
•దిల్‌సుఖ్‌నగర్ •హైటెక్ సిటీ •కర్మన్‌ఘాట్
•కొంపల్లి •కూకట్‌పల్లి •నాగోల్ •సికింద్రాబాద్ •వరంగల్
•విజయవాడ •www.bantia.in
An ISO-9001:2015 Certified Company
BANTIA
Furnitures
Affordable Lifestyles Since 1955
Mulugu Road, WARANGAL
79950 00930
040-27841562 79933 33351